"మోడీ సర్కార్ దేశభక్తులను అవమానిస్తోంది. గాంధీ, నెహ్రూ లాంటి వారి త్యాగాలు, పోరాటాల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చరిత్రను వక్రీకరిస్తోంది. మతమౌఢ్యాన్ని ప్రజల నరనరాల్లో జొప్పిస్తూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు హిందూ రాష్ట్ర ఎజెండాను భుజానెత్తుకుని మత ప్రాతిపదికన ప్రజలను విడదీసేందుకు చేస్తున్న ప్రయత్నాలు దేశానికే ప్రమాదకరం. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని వారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ రాసిన 'ఇంక్విలాబ్' రాంపునియా రాసిన 'ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కోరుకునేది' అనే రెండు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వెస్లీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో ఈ రెండు పుస్తకాలు రావడం సమాజానికి, భవిష్యత్ పోరాటాలకు ఎంతో అవసరమని వ్యాఖ్యానించారు. స్వాతంత్రోద్యమ కాలం నుంచి బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టిన చరిత్ర ఆర్‌ఎస్‌ఎస్‌దని విమర్శించారు. హిందుత్వ ఎజెండాను అమలు చేసేందుకు ఒకప్పుడు జనసంఘ్‌కు, ప్రస్తుతం బీజేపీకి బినామిగా ఆర్‌ఎస్‌ఎస్ మారిందని ఎద్దేవా చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు, పేద, ధనిక వర్గ పోరాటాలను అడుగడుగునా దెబ్బతీస్తూ కుల వ్యవస్థను పెంచి పోషిస్తోందని వ్యాఖ్యానించారు. మూడోసారీ గద్దెనెక్కిన మోడీ సర్కార్ విభజన రాజకీయాలకు పాల్పడుతూ దేశాన్ని రెండు వర్గాలుగా చీల్చేందుకు కుట్రలు పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో దళితులపై భౌతిక దాడులు, మహిళలపై లైంగికదాడులు పెరగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బుల్లెట్ నడిపాడని, పెండ్లిలో గుర్రంపై ఊరేగాడని దళితుల చేతులు, కాళ్లు నరికిన అమానుష చర్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆదివాసుల్లో మత భావాల్ని జొప్పించి వారి కాళ్ల కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇంక్విలాబ్ పుస్తక అనువాదకులు, ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు మాత్రమే కాదనీ, స్వాతంత్ర్యానంతరం దేశం ఎలా ఉండాలనే దానిపై అధ్యయనం చేసిన మేధావి అని కొనియాడారు. " బాంబులు, తుపాకులు విప్లవం కాదు. ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు రావడమే విప్లవం. నేను నా జీవిత చరిత్రను రాయాలనుకోవడం లేదు... ప్రపంచ చరిత్రను రాయాలనుకుంటున్నాను" అని భగత్‌సింగ్ చెప్పిన మాటలే ఆయన ఆలోచనలకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. పుస్తక అనువాదకులు జి.రఘుపాల్ మాట్లాడుతూ దేశాన్ని మత ప్రాతిపదికన ప్రజల్ని విభజిస్తున్న నేటి తరుణంలో ఇలాంటి పుస్తకాలు మరింతగా రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నవతెంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి సాహిత్యం రావాల్సిన అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. భగత్‌సింగ్‌ను త్యాగశీలిగా మాత్రమే కాకుండా, దేశాన్ని గొప్పగా మలచాలనే మేధావిగా చూడాలని పేర్కొన్నారు. కుల, మత రహిత సమాజం కోసం ఆయన చివరి వరకు తపించారని కొనియాడారు. నవతెలంగాణ బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు కార్యక్రమానికి స్వాగతం పలకగా, మేనేజర్ డి.కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు.



ట్రంప్, పుతిన్ మధ్య భేటీ ఖరారు కాలేదు

వెల్లడించిన క్రెమ్లిన్

రియాద్‌లో ఇరు దేశాల అధికారుల చర్చలు

ఉక్రెయిన్ యుద్ధ విరమణ పైనా దృష్టి ?

రియాద్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య సమావేశానికి ఎలాంటి తేదీ నిర్ధారించలేదని క్రెమ్లిన్ అధికారులు మంగళవారం తెలిపారు. రియాద్‌లో రష్యా, అమెరికా అధికారులు జరిపిన చర్చలకు హాజరైన పుతిన్ విదేశాంగ వ్యవహారాల సలహాదారుడు యూరి యుష్‌కొవ్ రష్యా చానెల్‌తో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఈ సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో సహా ఇరు దేశాల అధికారులు పాల్గొన్నారు. వచ్చే వారం ఇరు నేతల సమావేశం జరగకపోవచ్చని, దీనిపై ఇంకా ఇరు దేశాల ప్రతినిధి బృందాలు కసరత్తు చేయాల్సి వుందని యుష్‌కొవ్ చెప్పారు. రష్యా, అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై, ఉక్రెయిన్‌లో యుద్ధానికి స్వస్తి పలకడంపై ఇరు దేశాల చెందిన ఉన్నతాధికారులు మంగళవారం రియాద్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ నేతృత్వంలో అమెరికా విదేశాంగ విధానంలో అకస్మాత్తుగా వచ్చిన ప్రధాన మార్పుకు సంకేతంగా ఈ చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. అలాగే ఇరువురు అధ్యక్షుల మధ్య భేటీకి మార్గం సుగమం చేసేందుకు ప్రయత్నించారు. కాగా ఈ సమావేశంలో ఉక్రెయిన్ అధికారులెవరూ పాల్గొనలేదు. దాదాపు మూడేండ్ల క్రితం ప్రారంభమైన ఈ యుద్ధంలో రష్యా బలగాలు క్రమేపీ పట్టు సాధిస్తుండడంతో ఉక్రెయిన్ బలగాలు బలహీనపడుతున్నాయి. కీవ్ ఈ చర్చల్లో పాల్గొనకపోయినా ఈ సమావేశాల్లో ఏదో ఫలితం వచ్చేస్తుందని తాము భావించలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. తాజా సమావేశం పట్ల యురోపియన్ మిత్రపక్షాల్లో భయాందోళనలు తలెత్తాయి. కాగా, శాంతి చర్చలకు తాము సిద్ధమని పుతిన్ పదే పదే చెబుతూ వస్తున్నారని క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కొవ్ మంగళవారం వ్యాఖ్యానించారు. యూరప్‌లో భద్రతా అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోనిదే ఉక్రెయిన్‌లో శాశ్వత శాంతి, సుస్థిర పరిష్కార మార్గం సాధ్యం కాదని పెస్కొవ్ చెప్పారు.

ఉపాధ్యాయుల గొంతునయ్యా..

నిత్యం అధ్యాపకుల మధ్యే ఉన్నా

ముఖాముఖి

- చట్టసభల్లో వారి వాణి వినిపించా
- నిజాయితీ, నిబద్ధతతో పనిచేశా
- ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశా
- సీడీపీ నిధులు ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికే ఖర్చు చేశా : నవతెలంగాణతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



'ఉపాధ్యాయుల పక్షాన నిబద్ధతతో నిలబడ్డాను. వారి నమ్మకాన్ని వమ్ము చేయలేదు. చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతునయ్యాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సంబంధించి ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేశాను. నియోజకవర్గ అభివృద్ధి నిధులను (సీడీపీ) ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసమే ఖర్చు చేశాను. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలి, ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను చెల్లించాలి, నాలుగు డీఏలను మంజూరు చేయాలనే డిమాండ్ లను బలంగా వినిపిస్తున్నాను. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించాలని, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్‌ను ఇవ్వాలని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని, 317 జీవో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని పోరాడు తున్నాను. అందుకే నాకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి రెండోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలి.'అని ప్రస్తుత ఎమ్మెల్సీ, వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

మీరు ఎమ్మెల్సీగా ఎన్నికై ఆరేండ్లు పూర్తి కావస్తున్నది. ఈ పదవి మీకు సంతృప్తినిచ్చిందా?, మీ అనుభవాలేంటీ?

ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడం నాకు కొత్త అనుభవం. అనేక మంది ప్రజాప్రతినిధులను నేను గమనించాను. నిజాయితీ, నిబద్ధతతో ప్రజలతో కలిసుండే కొంతమంది ప్రజాప్రతినిధులు నాపై బలమైన ముద్ర వేశారు. వారి స్ఫూర్తితోనే నేను ఆరేండ్ల కాలం ఎమ్మెల్సీగా కొనసాగుతూ వచ్చాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సామాన్యులతో నేను వ్యవహరించిన తీరు ప్రజాప్రతినిధిగా నాకు చాలా సంతృప్తిని కలిగించింది. ఎందుకంటే ఈ ఆరేండ్లూ నన్ను ఎన్నుకున్న ఉపాధ్యాయులు అధ్యాపకుల మధ్యే గడిపాను. వారి సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ విద్యారంగాన్ని నిలబెట్టడంలో మంచి కృషి చేశాను.

రెండోసారి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారు. మొదటిసారి ఎన్నికల్లో మీరు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరాయి. టీచర్ల సంక్షేమం కోసం ఎలాంటి కృషి చేశారు. ఇప్పుడు మీకు ఓటెందుకు వేయాలంటారు?

2019 నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి నేను పోటీ చేశాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రధానంగా నన్ను ఒక ప్రశ్న అడిగారు. మీరు కూడా అధికార పార్టీ కండువా కప్పుకుని అటు వెళ్తారా? లేదా నికరంగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడతారా?అని ప్రశ్నించారు. ఈ ఆరేండ్ల కాలంలో నా పనితీరును గమనించారు. గెలిచిన తర్వాత నేను ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడ్డాను. నిజాయితీ, నిబద్ధతతో ఉన్నాను. ప్రతి సమస్యనూ సమర్థవంతంగా ప్రాతినిధ్యం చేశాను. అవి కొన్ని పరిష్కారమయ్యాయి. పీఆర్సీ 2020లో 30 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించడంలో, దాన్ని రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింపజేయడంలో నేను కీలక పాత్ర పోషించాను. గతేడాది జూన్‌లో ఢిల్లీకి వెళ్లి ఎన్‌సీటీఈ చైర్మెన్, సెక్రెటరీలతో మాట్లాడి టెట్ సమస్యను పరిష్కరించాను. తద్వారా 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చాయి. 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు కూడా జరిగాయి. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలోనూ నా కృషి ఎక్కువగా ఉన్నది. కేజీబీవీ ఉపాధ్యాయుల ప్రతి సమస్య పరిష్కారంలో నేనున్నాను. వారు కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నా మూడు పర్యాయాలు బదిలీలు చేయించాను. పీఆర్సీ ప్రకారం 30 శాతం జీతాల పెంపుదలకు కృషి చేశాను. వేసవి కాలం జీతాలు వచ్చేటట్టు చేశాను. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆటో రెన్యూవల్ సాధించాం. వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కూడా మా ద్వారానే వచ్చింది. మోడల్ స్కూల్ టీచర్ల ప్రతి సమస్య పరిష్కారంలో, ఉన్నత విద్యారంగమైన ఇంటర్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో నా కృషి ఉన్నది. ఇంకా కొన్ని సమస్యలు పరిష్కారం చేయాల్సి ఉన్నది.

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పట్ల బీఆర్ఎస్ విధానాలకు, కాంగ్రెస్ విధానాలకు తేడా ఏంటీ?

బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాల పేరు చెప్పి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. బడ్జెట్‌ను కూడా 6.5 శాతానికి తగ్గించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొంచెం భిన్నంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యకు 7.5 శాతం నిధులను కేటాయించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు విద్య బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలి. తొమ్మిదేండ్ల నుంచి ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ అప్‌గ్రేడ్ అయిన పండితులు 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించింది. డీఎస్సీ ద్వారా 10 వేలకుపైగా పోస్టులను అతి తక్కువ కాలంలో భర్తీ చేసింది. గత ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనులను గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, మున్సిపాల్ కార్పొరేషన్లకు అప్పగించింది. అది ఆచరణలో సాధ్యం కాదని నేను 4 ఏండ్ల నుంచి మండలిలో, బయట చెప్తున్నాను. విద్యాశాఖ ద్వారానే పాఠశాలలకు పారిశుధ్యం కోసం నిధులివ్వాలని కోరాను. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు గ్రాంట్‌ను నెలవారీగా మంజూరు చేస్తున్నది. ప్రభుత్వ విద్యాసంస్థల కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది.

శాసనమండలిలో మీరు లేవనెత్తే సమస్యలు పరిష్కారమవుతున్నాయా?

ఈ అంశానికి వచ్చినపుడు అసెంబ్లీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై చర్చ జరిగే సమయం బాగా తగ్గింది. ఆ కొద్ది సమయంలో ప్రస్తావించిన అంశాలు కొన్ని పరిష్కారమవు తున్నాయి. కొన్ని అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి.

మీకు సీడీపీ నిధులు వస్తాయి. వాటిని ఏయే అవసరాలకు ఖర్చు చేశారు?

నాకు ఆరేండ్ల కాలంలో మూడేండ్లలో రూ.9 కోట్లు సీడీపీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులను 95 శాతానికిపైగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీగోడల నిర్మాణం కోసమే కేటాయించాను. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉండి ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసమే నిధులను ఖర్చు చేశాను.

సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు మీరందించిన సహాయం ఎలా ఉందంటారు?

ఇతర కార్యక్రమాలకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ కింద బీపీఎల్ కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందజేస్తారు. వారు మా ఓటర్లు కాదు. అయినా వెయ్యికిపైగా కుటుంబాలకు రూ.4 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పించాను. నిమ్స్ ఆస్పత్రిలో బీపీఎల్ కుటుంబాల వారికి రూ.1.20 కోట్లకుపైగా ఎల్‌వోసీ ఇప్పించాను. చాలా మంది పేద పిల్లలకు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలు కల్పించేందుకు కృషి చేశాను.

మీరు ఎమ్మెల్సీగా మళ్లీ పోటీ చేస్తున్నారు. మీకు మద్దతిస్తున్న సంఘాలేంటీ?

టీఎస్‌యూటీఎఫ్‌తోపాటు టీపీటీఎఫ్, ఎస్టీఎఫ్, జూనియర్ లెక్చరర్ల సంఘం, పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘం, విశ్వవిద్యాలయ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం, మోడల్ స్కూల్ టీచర్ల సంఘం, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయుల సంఘం, కేజీబీవీ ఉపాధ్యాయుల సంఘం, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం, ఐదు రకాల గురుకులాలైన రాష్ట్ర గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, బీసీ గురుకులాలు, మైనార్టీ గురుకులాల్లోని ఉపాధ్యాయ సంఘాలు మద్దతిస్తున్నాయి.

317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన వారి సమస్యను ఎలా పరిష్కారం చేయాలంటారు?

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కొంత మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారు పుట్టిన జిల్లా కాకుండా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారు. పరస్పర (మ్యూచువల్), భార్యాభర్తలు (స్పౌజ్), ఆరోగ్య కారణాలున్న వారి బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. స్థానికత కోల్పోయిన వారందరినీ రూల్ 28 ప్రకారం ఖాళీలు ఏర్పడుతున్న సందర్భంలో సొంత జిల్లాలకు బదిలీ చేయాలి. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి.

ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇంకా ఏయే సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారమేంటీ?


ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలి. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి. ఓపీఎస్‌ను అమలు చేయాలి. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లోని ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులివ్వాలి. కేజీబీవీ టీచర్లకు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలి. వాటిలో చనిపోయిన కుటుంబాల వారికి కారుణ్య నియామకాలను చేపట్టాలి. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలి. ఉపాధ్యాయులకు నివాస సముదాయాలను ఏర్పాటు చేయాలి. గురుకులాల కాల నిర్ణయ పట్టికను మార్చాలి. ఉద్యోగుల ఆరోగ్య కార్డులను పటిష్టంగా అమలు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నిర్వహణ గ్రాంటును రూ.2 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.10 లక్షల వరకు ఇవ్వాలి. జూనియర్ కాలేజీల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలి. డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులకు ఏడో కేంద్ర పీఆర్సీ బకాయిలను చెల్లించాలి. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి. మెస్‌చార్జీలను కూడా పెంచాలి. కేంద్ర ప్రభుత్వమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించాలి. కొత్త జిల్లాలకు డీఈవో పోస్టులను, డీఐఈవో పోస్టులను, కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలి. ఎంఈవో, డిప్యూటీఈవో, డీఈవో, డైట్ లెక్చరర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలి. తరగతికొక టీచర్, గది, పాఠశాలకో ప్రధానోపాధ్యాయుల పోస్టు ఉండేలా ప్రాథమిక పాఠశాలలను రీ ఆర్గనైజ్ చేయాలి.

కాన్పులకూ ముహూర్తాలు

సమస్యలు తప్పవంటూ వైద్య నిపుణుల హెచ్చరిక | 'సమయం' కంటే ఆరోగ్యం, సంరక్షణే కీలకమని సూచన

కొత్తైనా కాకపోయినా...

పుట్టుక, చావు...ఏ క్షణాన వస్తాయో ఎవరికీ తెలియదన్నది నానుడి. అయితే ఇది ఒకప్పటి మాట. చావు సంగతి ఎలా ఉన్నప్పటికీ ఇప్పుడు పుట్టుక మాత్రం మన చేతుల్లోనే ఉంది. శిశువు ఎప్పుడు భూమి మీద పడాలో తల్లిదండ్రులే నిర్ణయించుకుంటున్నారు. ఆ 'శుభ ఘడియ'లను తామే నిర్దేశించు కుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మంచి ముహూర్తం చూసుకొని పిల్లల్ని కంటున్నారన్న మాట. తిథి, వార, నక్షత్రాలను చూసుకొని అన్నీ బాగున్నాయనుకుంటే ఆ సమయానికే సిజేరియన్ చేసి బిడ్డను బయటికి తీయాలని వైద్యులకు సూచనలు చేస్తున్నారు.



న్యూఢిల్లీ : 'పూజారినో లేదా జ్యోతిష్కుడినో సంప్రదించి డెలివరీలకు ముందుగానే ముహూర్తాన్ని నిర్ణయించుకుంటున్నారు. వివాహాలకు ఏ విధంగా అయితే ముహూర్తం పెడతారో ఇప్పుడు బిడ్డ జన్మించడానికి కూడా అదే రీతిన ముహూర్తం నిర్ణయించుకుంటున్నారు. అయితే వైద్యులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. డెలివరీకి సమయం ఆసన్నమైందా లేక ఇంకా సమయం ఉన్నదా అనేది చూసుకోవాలి. వైద్యపరంగా అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎలాగూ తప్పదు. అలాంటి స్థితి ఉన్నదా అనేది కూడా గమనించాల్సి ఉంది' అని బెంగళూరులోని బీజీఎస్ ఆస్పత్రి గైనకాలజీ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నిర్మలా చంద్రశేఖర్ తెలిపారు. ఇప్పుడు సిజేరియన్ డెలివరీలపై ఎక్కువగా ఆధారపడుతున్నందున ముహూర్తం ప్రకారం బిడ్డను బయటికి తీయడంలో కొత్తేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. మొదటిసారి మాతృమూర్తి అయ్యే మహిళలు ఎక్కువగా సిజేరియన్ వైపే మొగ్గు చూపుతున్నారని, కాకపోతే దానికి శుభ ముహూర్తాన్ని నిర్ణయించుకుంటున్నారని నిర్మలా చంద్రశేఖర్ చెప్పారు.

జ్యోతిష్యాన్ని నమ్మి...

బిడ్డ జననాన్ని పూర్తిగా నియంత్రించలేము. సంప్రదాయపరంగా చూస్తే అనేక డెలివరీలు సహజంగానే జరిగిపోతున్నాయి. బిడ్డ ఎప్పుడు భూమిపై పడుతుందో వైద్యులు ముందుగా ఉజ్జాయింపుగా అంచనా వేస్తారు. కానీ అదేమీ కచ్చితమైన తేదీ కాదు. ఇప్పుడు వైద్య శాస్త్రం అభివృద్ధి చెందుతోంది. దీంతో తమ పిల్లల భవితవ్యాన్ని తామే నిర్ణయించాలని చాలా మంది తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. అందుకోసం జ్యోతిష్యపరంగా అనుకూలమైన సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఆ సమయాన్ని జ్యోతిష్య పండితుడో లేదా పూజారో నిర్ణయిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ముహూర్త డెలివరీలకు డిమాండ్ పెరుగుతోందని హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో క్లినికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మంజుల అనగాని అంగీకరించారు. 'చాలా మంది దానిని కోరుకుంటున్నారు. అనిశ్చితమైన ప్రపంచంలో బిడ్డ భవిష్యత్తుపై తామే ప్రభావం చూపాలని వారు ఆశిస్తున్నారు. అయితే ఇలాంటి డెలివరీలు ఆమోదయోగ్యం కావు. మా ఆస్పత్రిలో సిజేరియన్ తప్పనిసరి అయ్యే పరిస్థితి ఉంటేనే దీనికి అంగీకరిస్తున్నాము' అని ఆమె చెప్పారు.

సమస్యలు తప్పవు

ఇదిలావుండగా దేశంలో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. 2015-16లో సిజేరియన్లు 17.2 శాతం జరిగితే 2019-21 నాటికి వాటి సంఖ్య 21.5 శాతానికి పెరిగిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు తెలిపాయి. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య బాగా ఎక్కువగా ఉంటోంది. వాటిలో జరిగే డెలివరీల్లో సగానికి పైగా సిజేరియన్లే. ఈ తరహా ఆపరేషన్లు సురక్షితమని, ఎలాంటి సమస్యలు ఉండవని చాలా మంది చెబుతుంటారు. అలాంటప్పుడు ముందుగానే సమయాన్ని నిర్ణయించుకొని ఆపరేషన్ చేయించుకుంటే అది తల్లి లేదా బిడ్డ ఆరోగ్యంపై ఎందుకు ప్రభావం చూపుతుందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి వైద్య నిపుణులు పలు కారణాలు చూపుతున్నారు. తల్లి గర్భంలోని పిండం పూర్తిగా తయారు కాకుండానే....అంటే 37 వారాల కంటే తక్కువగా ఉన్నప్పుడే ముహూర్త డెలివరీ చేస్తే నవజాత శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, అలాంటప్పుడు వారికి తరచుగా ఎన్ఐసీయూ చికిత్స అందించాల్సి వస్తుందని డాక్టర్ అనగాని హెచ్చరించారు. అదీకాక సహజంగా నెప్పులు వచ్చినప్పుడు ఆ రోజు డెలివరీ చేయడానికి తల్లిదండ్రులు ఇష్టపడని పక్షంలో తల్లికి, బిడ్డకు సమస్యలు ఎదురవుతాయని ఆమె చెప్పారు. 'సహజమైన డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ కొందరు సిజేరియన్ చేయాలని పట్టుబడతారు. తాము ముందుగా ఎంచుకున్న సమయానికి డెలివరీ అయ్యేలా చూడడానికే వారు ఇలా చేస్తుంటారు. ఇది చాలా హానికరం. అనవసరమైన శస్త్ర చికిత్స పద్ధతులు పాటించాల్సి రావడంతో ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. తల్లి అనారోగ్యం బారిన పడుతుంది. శిశువుపై కూడా ప్రభావం పడుతుంది' అని వివరించారు.

డెలివరీ సురక్షితమైనప్పుడు, శిశువు శారీరకంగా పూర్తిగా తయారైనప్పుడు పెద్దగా ఆరోగ్య సమస్యలేవీ రావని డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని, తల్లిదండ్రులు ఎంచుకునే ముహూర్తం వైద్యపరంగా అనువుగా లేకుంటే వారికి నచ్చచెమబుతామని తెలిపారు. చివరగా డాక్టర్ ముంజులా అనగాని ఓ అద్భుతమైన సలహా ఇచ్చారు. 'పుట్టే సమయం కంటే చిన్నారుల భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, సరైన వైద్య సంరక్షణ ప్రధాన పాత్ర పోషిస్తుంది'.... డాక్టర్ మంజుల మాటలు అక్షర సత్యాలు కదూ ?!

ఆంక్షలు తప్పనిసరి

పెరుగుతున్న ధోరణులకు అనుగుణంగా ఆస్పత్రులు కూడా కొన్నింటిని అంగీకరించాల్సి ఉంటుంది. అయితే ఆంక్షలు తప్పనిసరి. కొన్ని సందర్భాలలో తల్లిదండ్రులు ఎంతగా ఒత్తిడి తెచ్చినా తాము నిరాకరిస్తున్నామని కొందరు వైద్యులు తెలిపారు. 'సాధారణంగా ఆపరేషన్లు ఉదయం లేదా పగటి సమయంలో జరుగుతాయి. ఆ సమయంలో తల్లిదండ్రులు ఏదైనా సమయాన్ని సూచిస్తే అంగీకరిస్తాం. కానీ రాత్రి సమయంలో... 10 గంటల నుండి అర్ధరాత్రి ఒంటి గంట మధ్య డెలివరీలు చేయాలని అడిగితే మాత్రం అందుకు నిరాకరిస్తాం. ఎందుకంటే అప్పుడు వైద్య సేవలు అందించడం కష్టం. ఆ సమయం అటు బిడ్డకు, ఇటు తల్లికి సానుకూలమైనది కాదు' అని డాక్టర్ అనగాని తెలిపారు.

అవినీతి ప్రమాదకరం

సంపాదకీయం

అవినీతి ప్లేగ్ కన్నా భయంకరంగా వ్యాపిస్తోంది. అది దేశంలోని అన్ని అంగాలకు సోకింది. ఇప్పుడది ప్రభుత్వాన్నే శాసిస్తోంది. అది చెప్పినట్టుగా పాలకులు తలలూపాల్సి వస్తోంది. తమ గురువులకు కావా ల్సిన పనిని అవినీతి భూతం చేయించిపెడుతోంది. తాజాగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసిన 2024 అవినీతి భావన సూచిక కూడా ఇదే రుజువు చేసింది. అవినీతిలో భారతదేశం 180 దేశాలతో పోలిస్తే 96వ స్థానంలో ఉంది. దేశంలో అవినీతి ర్యాంక్ 1995 సంవ త్సరం నుండి 2024 వరకూ సగటున 78.03గా ఉంది. అది 2024లో గరిష్ట స్థాయికి...అంటే 96.00కి చేరింది. 1995లో ఈ ర్యాంక్ 35.00గా ఉంది.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయుల ప్రభ వెలిగిపోతున్నదనీ, విశ్వగురుగా అవతరించిందనీ సుప్రభాత గీతా లతో మేల్కొంటున్నాం. అవినీతిని, నల్లధనాన్ని తరిమి కొట్టడమే లక్ష్యంగా మోడీజీ మహత్తర విజయాలు సాధించారని ఒకవైపు కీర్తిస్తుంటే ఈ సూచిక వివరణ భిన్నంగా ఉంది. అసలు అవినీతిపై ఇంతగా సమరం చేస్తున్నాను గనకే తనను ప్రత్యర్థులు వేటాడుతున్నారనీ ఆయన చేసిన భావోద్వేగ ప్రకటనలతో భజనపరులు బాధపడిపోతుంటారు. అవినీతిని అరికడతాం.. పూర్తిగా రూపుమాపుతాం అని మోడీ 2014లో చెప్పినా, ఇప్పుడు మాట్లాడుతున్నా అసలు ఆపింది లేనేలేదు. ఇంతచేస్తే పై స్థాయిలో అవినీతిని ఎందుకు అరి కట్టలేకపోతున్నారంటే సమాధానం ఉండదు. ఒకవేళ తమకు రాజకీయంగా ఇబ్బందులు వచ్చినప్పుడు, అవినీతికి ప్రజలు వ్యతిరేకంగా తిరగబడుతున్న సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేసేసి.. తప్పుకుంటారు. పెద్దనోట్ల రద్దు సమయంలో ఇలానే జనాన్ని రోడ్లపై నెట్టేసి అవినీతిపరులకు ఏ రకంగా ద్వారాలు తెరిచింది చూశాం. అవినీతిని అడ్డుకోవడం ప్రసుత్త పాలకులకు ఇష్టం లేదు. మరింత పెంచి పోషిస్తూ రాజకీయ పబ్బానికి వాడుకోవడమే బీజేపీ ప్రభుత్వానికి కావాల్సింది. అవినీతి, కార్పొరేట్లు, మతం ఈ మూడింటితోనే దేశ రాజకీయాలను, ప్రభుత్వాన్ని, రాష్ట్రాలను మోడీ ప్రభుత్వం శాసిస్తోంది.

విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి... ఇలా ఎన్ని బయటపడినా మోడీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోడీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమ లును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతిపై మాట్లాడేందుకు నిరాకరించారు.

బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అస్మదీయులకు ప్రజాసంపదను దోచి పెట్టడంలో గత ప్రభుత్వాల కంటే బీజేపీ ప్రభుత్వం మించి పోయింది. తమకు మేలు చేసిన వారి అవినీతి కుంభ కోణాలు బయటపడినా వారికి అండగా నిలబడింది. వందలు, వేల కోట్ల రూపాయల కుంభకోణాలు బయట కొచ్చినా విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ లాంటి దొంగలను దగ్గరుండి దేశం దాటించింది. బీజేపీ నేతలు ప్రభుత్వ రంగాలను పూర్తిగా అనిల్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు దగ్గరుండి దోచిపెడుతున్నారు. అనేక చోట్ల అవినీతి జరిగిందని తెలినా చర్యల్లేవు. అవినీతికి దూరంగా ఉండాలని మోడీ చెబుతారు. కానీ తమ హయాంలో జరుగుతున్న అవినీతి కుంభ కోణాల గురించి మాత్రం పెదవి విప్పరు. ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొ రేట్ల నుంచి అత్యధికంగా విరాళాలు పొందింది బీజేపీనే. ఆ విషయంలో మరే పార్టీ దరిదాపుల్లోకి లేదు. ఆ డబ్బు అంతా అవినీతికరమైనదే. ఆ డబ్బుతోనే ప్రతిపక్షపార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, ప్రభుత్వాలను పడకొట్టడం చేసింది. ఎన్నికల బాండ్లను వ్యతిరేకించిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే. విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థలకు మోడీ లబ్ది చేకూర్చారు. రైతుల రుణాలు మాఫీ చేయడానికి చట్టం వర్తించదు. అదే కార్పొరేట్లు నష్టపోతే వారి బ్యాంకు రుణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేశారు.



విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి... ఇలా ఎన్ని బయటపడినా మోడీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోడీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమ లును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతిపై మాట్లాడేందుకు నిరాకరించారు. ప్రత్యర్థుల మీద ఏ చిన్న ఆరోపణలు వచ్చినా ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రయోగించి మోడీ ప్రభుత్వం ఇబ్బందులు పాలు చేస్తోంది చూస్తూనే ఉన్నాం. అవినీతి విషయంలో సీరియస్‌గా లేకుంటే, దేశాభివృద్ధిని దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువల క్షీణత, అస్థిరత, మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. స్వచ్ఛమైన పాలన, అవినీతి రహితమైన పాలన అని గొప్పలు చెప్పుకోవడం తప్ప పేరుకు పోయిన అవినీతిని అరికట్టకపోగా కార్పొరేట్ల అనుబంధంతో మరింత అవినీతికి ఆస్కారం ఇస్తున్న ప్రభుత్వంగా మనముందు నిలబడింది. పెరుగుతున్న అవినీతి దేశాభివృద్ధికి ఆటంకంగా మారింది.

ఉక్రెయిన్‌పై క్షణక్షణానికి మారుతున్న మాటలు



ఎం.కోటేశ్వరరావు

అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫిబ్రవరి 12న జరిపిన ఫోన్ సంభాషణ ప్రపంచంలో ఎంతో ఆసక్తి రేపింది. ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్చలు జరపనున్నట్లు ప్రకటించాడు. పరస్పర విరుద్ధ వార్తలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, ఉక్రెయిన్ సంక్షోభం ముగింపు గురించి నేతలు చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే అసలేం జరుగుతోందని సామాన్యుడు ఎటూ తేల్చుకోలేని స్థితి. ఒక ప్రకటన, పరిణామం వాస్తవం అనుకుంటే తలెత్తే సందే హాలెన్నో. మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి వచ్చిన వార్తల ప్రకారం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో అమెరికా -రష్యా ఉన్నత ప్రతినిధి వర్గాలు భేటీ అవుతున్నాయి. డోనాల్డ్ ట్రంప్-వ్లదిమిర్ పుతిన్ కూడా అక్కడి చేరుకోవచ్చుని వార్త. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం నాడు అక్కడికి చేరుకోనున్నారు. ముగ్గురూ అక్కడ భేటీ కావచ్చంటున్నారు. ఐరోపాకు చర్చల్లో ఎలాంటి ప్రమేయం ఉండదనే ఊహాగానాల పూర్వరంగంలో సోమవారం నాడు పారిస్‌లో కొన్ని దేశాల నేతలు సమావేశం జరిపి పరిస్థితిని సమీక్షించారు. ఉక్రెయిన్‌పై 2022 ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్య ప్రారంభమైంది. వేగంగా మారుతున్న పరిణామాలను చూస్తే నాలుగో ఏడాదిలో ప్రవేశించకముందే దానికి ముగింపు పలుకుతారా? ఈ సమస్యను ఇంత సులభంగా పరిష్కరించే అవకాశం ఉంటే మూడేండ్లు ఎందుకు కొనసాగించినట్లు ? కోట్లాది మంది జనాలను, అనేక దేశాలను ఎందుకు ఇబ్బందులు పెట్టినట్లు? దీనికి ఎవరిది బాధ్యత? ఎంతో సం క్లిష్టమైన ఈ వివాదం ఒక్క భేటీతో నాటకీయంగా ముగుస్తుందా? చర్చల పేరుతో కొత్త ఎత్తుగడలకు ప్రాతిపదిక వేస్తున్నారా?

జెలెన్‌స్కీ, ఐరోపా సమాఖ్యతో నిమిత్తం లేకుండానే చర్చలు జరిపి ఒక ముగింపు పలుకుతామని అమెరికన్లు చెప్పారు. తమతో నిమిత్తం లేకుండా జరిగే చర్చలను అంగీకరించేది లేదని జెలెన్‌స్కీ ప్రకటించాడు. పుతిన్ అబద్దాల కోరు, అసలు తమకు చర్చల గురించి సమాచారమే లేదన్నాడు. ముసాయిదా ప్రతిపాదనల్లో తమ భద్రతకు ఎలాంటి హామీ లేదన్నాడు. తమకూ అంగీకారం కాదని ఐరోపా దేశాలు స్పష్టం చేశాయి. మరి జెలెన్‌స్కీ సతీసమేతంగా రియాద్ ఎందుకు వస్తున్నారంటే " అది ఎప్పుడో నిర్ణయించిన పర్యటన " అని అతగాడి ప్రతినిధి వివరణ ఇచ్చాడు. రష్యా-ఉక్రెయిన్ ఖైదీల మార్పిడి గురించి చర్చలు జరిపేందుకు జెలెన్‌స్కీ ఆదివారం నాడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరుకున్నాడు. సౌదీ పర్యటన గురించి గతంలో ఎలాంటి వార్తా లేదు. ఎవరి ప్రమేయం లేకుండా చర్చలు జరుగుతాయని ట్రంప్ సలహాదారులు స్పష్టంగా చెప్పారు. దానికి పూర్తి విరుద్ధంగా శాంతి చర్చల్లో జెలెన్‌స్కీ పాల్గొంటారని ఆదివారం నాడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు రాయిటర్స్ వార్త పేర్కొన్నది. ఐరోపా నుంచి వ్యతిరేక స్పందన వెలువడటంతో అమెరికా మాట మార్చింది.సౌదీలో చర్చలకు అమెరికా ప్రతినిధివర్గ నేత మార్క్ రూబియో సిబిఎస్ టీవీతో మాట్లాడుతూ అసలు పుతిన్ నిజంగా చిత్తశుద్ధితో ఉన్నాడా లేదా అన్నది పరీక్షించేందుకు చర్చలను ముందుకు తెచ్చామని, నిజమైన సంప్ర దింపుల్లో ఉక్రెయిన్, ఐరోపాకు భాగస్వామ్యం ఉంటుందని చెప్పాడు. ఎందుకంటే రష్యాపై ఆంక్షల్లో ఐరోపా కూడా ఉందన్నాడు. పైకి ఏమి చెప్పినప్పటికీ అమెరికా అధికారులు ప్రయివేటు సంభాషణల్లో ఐరోపా వారితో మీ అంగీకారం లేకుండా ఏదీ జరగదని చెబుతున్నట్లు మీడియా పేర్కొ న్నది. ఏ రోటి దగ్గర ఆ పాట పాడినట్లు వ్యవహరిస్తున్నారా ? దీన్ని చూస్తుంటే పరిణామాలు ఏ మలుపు తిరిగేదీ ఊహించలేము.

ట్రంప్ ఫోన్ సంభాషణకు ముందు జరిగిన పరిణామాలను సింహావలోకనం చేసుకోవాల్సి ఉంది. ఉక్రెయిన్ పోరులో తాము చేసిన సాయం లేదా చేసిన ఖర్చును తిరిగి చెల్లించే స్థితిలో లేనందున ప్రతిగా టిటానియం, యురేనియం, లిథియం వంటి 500 బిలియన్ల విలువగల ఖనిజ సంపదలున్న ప్రాంతాల్లో సగం తమకు అప్పగించాలని అమెరికా బేరం పెట్టింది. దాని కోసం తన ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్‌ను కీవ్ పంపిన సంగతి తెలిసిందే ప్రస్తుతం రష్యా దాని అనుకూల శక్తుల ఆధీనంలో ఉన్న నాలుగో వంతు భూ భాగంలో ఈ ఖనిజాలు ఉన్నాయి. సంక్షోభానికి ముందు ఉన్న ప్రాంతాలు తిరిగి కావాలని కోరుకోవద్దని కూడా ట్రంప్ యంత్రాంగం జెలెన్‌స్కీకి సూచించింది. అలాంటపుడు ఖనిజాల గురించి ఎందుకు బేరం పెట్టినట్లు? రష్యాను అడ్డుకొనేందుకు ఐరోపా దేశాలు కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేశాయి. ఖనిజాలతో అమెరికా తన ఖర్చుతాను రాబట్టుకుంటే తమ సంగతేమిటని అవి ప్రశ్నిస్తాయి. అయితే సంక్షోభం ప్రారంభమైన తరువాత ఐరోపా దేశాలు 300 బిలియన్ డాలర్ల విలువగల రష్యన్ ఆస్తులను స్తంభింప చేశాయి. వాటిని స్వాధీనం చేసుకోవటం గురించి కొందరు ఆలోచనలు చేస్తు న్నారు. దీనికి రష్యా అంగీకరించే సమస్యే ఉత్పన్నం కాదు. 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియా ద్వీపకల్పంతో సహా ఆక్రమిత ప్రాంతాలన్నింటినీ తమకు అప్పగించాలని జెలెన్‌స్కీ డిమాండ్ చేశాడు. ఒక వైపు చర్చల గురించి సిద్ధమవుతూనే రష్యా తన దాడులను కొనసాగిస్తూనే ఉంది. ఉక్రెయిన్ ప్రతిఘటన కూడా



కొద్ది నెలలు, వారాల క్రితం వరకు కూడా రష్యాను నిలువరించేందుకు ఏం చేయాలి? ఎలాంటి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించాలి అని తర్జన భర్జనలు పడిన ఐరోపా నేతలు, వ్యూహకర్తలు ఇప్పుడు ట్రంప్ తెచ్చిపెట్టిన పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. తాము విధించిన ఆంక్షలతో బలహీనపడిన పుతిన్ నాయకత్వాన్ని మరింతగా ఎలా ఒంటరిపాటు చేయాలా అని చూశారు.ట్రంప్ చర్యతో పుతిన్ ఆ స్థితి నుంచి తాత్కాలికంగా అయినా బయటపడ్డారు. దీని అర్థం ఎవరిదారి వారు చూసుకోవటం అని కాదు.ఇప్పుడున్న పరిస్థితిలో అమెరికా-ఐరోపాలకు పరస్పర సహకారం అవసరం. మమ్మల్ని, మా భద్రతను అర్ధాంతరంగా ఎలా వదిలి వెళతారని అడిగితే ఐరోపా మరింత చులకన అవుతుంది. అమెరికా పట్టు మరింతగా దాని మీద బిగుస్తుంది.

సాగుతోంది.

'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగాను' అన్నట్లుగా పుతిన్ చాలా జాగ్రత్తగా స్పందిస్తున్నాడు. ఎవరూ ఎవరిని నమ్మే స్థితిలో లేరు. అమెరికా - ఐరోపా యూనియన్ మధ్య ఉన్న మిత్ర వైరుధ్యం ప్రస్తుతానికి శత్రు వైరుధ్యంగా మారు తుందని చెప్పలేము గానీ ట్రంప్ -పుతిన్ ఫోన్ చర్చల తరువాత తేడా మరింత పెరిగింది. అలాగైతే ఏం చేయాలి ఇలా జరిగితే ఏం చేద్దామనే సంప్రదింపులు ఐరోపాలో ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఐరోపా దేశాలన్నింటికీ కలిపి ఎంత మిలిటరీ ఉందో అంతకంటే ఎక్కువగా రష్యా కలిగి ఉంది. అందువలన ఆచితూచి అడుగేస్తున్నాయి. అది వాటి బలహీనత అయితే దాన్ని సొమ్ముచేసుకోవాలని చూడటం అమెరికా బలం. అమెరికాకు అగ్రపీఠం అనే తన అవగాహనను ట్రంప్ మరింత ముందుకు తీసుకుపోయేట్లయితే ఐరోపాకు దానితో ఘర్షణ పడటం లేదా లొంగిపోవటం తప్ప మరొక మార్గం లేదు. అమెరికా బలహీనతలు కూడా తెలిసినందున ఐరోపా ధనిక దేశాలు అంత తేలికగా సాగిల పడతాయని చెప్పలేము. ప్రపంచ బలాబలాల్లో కొత్త సమీకరణకు తెరలేచే అవకాశాలు కూడా ఉన్నాయి. అదే జరిగితే అమెరికా ఏకాకి అవుతుంది, దానికి సిద్ధపడుతుందా ? అలాంటి అవకాశమే లేదని చెప్పవచ్చు.

'ఐరోపా మీద డోనాల్డ్ ట్రంప్ దాడి' అంటూ ఎకనమిస్టు పత్రిక ఒక వ్యాఖ్యా విశ్లేషణ చేసింది. ఉక్రెయిన్ మీద ఒక ఒప్పందం చేసుకొనేందుకు పుతిన్‌కు ట్రంప్ పంపిన ఆహ్వానం నాటో కూటమిని గందరగోళంలోకి నెట్టిందని పేర్కొన్నది. ఐరోపా భద్రతకు తామింకే మాత్రం ప్రాథమిక హామీదారుగా ఉండేది లేదంటూ ముందుగా అమెరికా రక్షణ మంత్రి పేట్ హెగ్‌సేత్ చేసిన ప్రకటన షాకిచ్చింది. కొద్ది గంటల తర్వాత పుతిన్‌తో సంప్రదింపుల గురించి ట్రంప్ ప్రకటిం చాడు. ఆ తర్వాత వార్షిక మ్యూనిచ్ భద్రతా సమావేశంలో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నొప్పించే రీతిలో ఐరోపా మీద దాడి చేశాడు.ఉక్రెయిన్ గురించి మాట్లాడాల్సిన వాన్స్ తన ప్రసంగమంతా ఐరోపా మీద కేంద్రీకరించాడు.ఐరోపాకు ఉందని చెబుతున్న ముప్పు రష్యా నుంచి కాదు, అంతర్గతంగానే ఉందన్నాడు. దాని అర్థం వలసల సమస్య. పుండు మీద కారం చల్లినట్లుగా ఉక్రెయిన్‌లో అమెరికా రాయ బారి కెయిత్ కెలోగ్ కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడాడు. సంప్రదింపుల్లో ఐరో పాకు స్థానం ఉంటుందా? అన్న ప్రశ్నకు అది జరుగుతుందని అనుకోవటం లేద న్నాడు. దీంతో ఐరోపా భద్రత తమ కళ్ల ముందే కుప్పకూలుతుందా అన్నట్లుగా అనేక మంది నేతలు, అధికారులు భావించినట్లు ఎకనమిస్టు వర్ణించింది. ట్రంప్ ప్రతిపాదించిన చర్చలు ఎవరి అజెండా మేరకు జరుగుతాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. వస్తున్న వార్తలన్నీ పుతిన్ డిమాండ్లకే అమెరికా అంగీకరించవచ్చని సూచిస్తున్నాయి.ఒక వేళ నిజంగా అదే జరిగితే రానున్న రోజుల్లో ఏ ఒక్కదేశం కూడా అమెరికా మాటలు, హామీల మీద ఆధారపడి వ్యవహరించే అవకాశాలు మరింతగా కుచించుకుపోతాయి. ఇంతవరకు దాన్ని నమ్మి బాగుపడిన దేశం లేదనే అభిప్రాయాన్ని మరింతగా బలపరిచినట్లు అవుతుంది. ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులు ఆత్మహత్యకు పాల్పడ తారా? సోమవారం నాడు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ ఎంపిక చేసిన కొన్ని దేశా లతో పారిస్‌లో సంప్రదింపులు జరిపాడు. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

మూడేండ్లుగా ఉక్రెయిన్ శాంతి చర్చలను సాగనివ్వని అమెరికన్లు ఆకస్మికంగా ఎందుకు రష్యాతో సంప్రదింపులకు సిద్ధపడుతున్నారు జెలెన్‌స్కీ? ఒకటి ఐరోపాలోని నాటో కూటమి దేశాలు అవసరమైతే రంగంలోకి దిగుతామని కబుర్లు చెబుతున్నప్పటికీ నేరుగా ఉక్రెయిన్ తరపున యుద్ధంలో పాల్గొనే అవ కాశాలు లేవు. వేల కిలోమీటర్ల దూరం నుంచి అమెరికా సేనలు వచ్చి రష్యాతో తల పడేందుకు సిద్ధం కాదు. ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్లకే సలాంగొట్టి కాళ్లు గడ్డాలు పట్టు కుని ప్రాణాలు అరచేత పట్టుకొని వెళ్లిన వారు అణుశక్తి రష్యాతో తలపడగలరా? రష్యా తొలి నుంచీ కోరుతున్నదేమిటి ? గతంలో తమకు హామీ ఇచ్చినట్లుగా ఉక్రె యిన్‌కు సభ్యత్వమిచ్చి నాటో కూటమి ఆయుధాలను తమ ముంగిట్లో ఉంచ కూడదు. సంక్షోభానికి ముందు ఉన్న సరిహద్దులు, ప్రాంతాల గురించి ఉక్రెయిన్ మరచిపోవాలి.శాంతి పరిరక్షణ, మరొక పేరుతో నాటో కూటమి దళాలు తమ సరి హద్దులో తిష్టవేయకూడదు. ఉక్రెయిన్ మిలిటరీపై పరిమితులు పెట్టాలి. స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఉక్రెయిన్‌లోని ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు ఇవ్వాలి. ఏ విషయంలోనూ రాజీ పడేందుకు పుతిన్ సిద్ధంగా లేడని ఐరోపా గూఢచారులు నివేదించినట్లు వార్తలు. పుతిన్ షరతుల మేర ఒప్పందం కుదుర్చుకుంటే అమెరికాకు వచ్చేదేముంది? వారు మరీ అంత అమాయకులా?

కొద్ది నెలలు, వారాల క్రితం వరకు కూడా రష్యాను నిలువరించేందుకు ఏం చేయాలి? ఎలాంటి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించాలి అని తర్జన భర్జనలు పడిన ఐరోపా నేతలు, వ్యూహకర్తలు ఇప్పుడు ట్రంప్ తెచ్చిపెట్టిన పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. తాము విధించిన ఆంక్షలతో బలహీనపడిన పుతిన్ నాయకత్వాన్ని మరింతగా ఎలా ఒంటరిపాటు చేయాలా అని చూశారు.ట్రంప్ చర్యతో పుతిన్ ఆ స్థితి నుంచి తాత్కాలికంగా అయినా బయటపడ్డారు. దీని అర్థం ఎవరిదారి వారు చూసుకోవటం అని కాదు.ఇప్పుడున్న పరిస్థితిలో అమెరికా-ఐరోపాలకు పరస్పర సహకారం అవసరం. మమ్మల్ని, మా భద్రతను అర్ధాంతరంగా ఎలా వదిలి వెళతారని అడిగితే ఐరోపా మరింత చులకన అవుతుంది. అమెరికా పట్టు మరింతగా దాని మీద బిగుస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన సమయంలో మాదిరి పశ్చిమ ఐరోపా ఆర్థికంగా బలహీనంగా లేదు. గడచిన ఏడు దశాబ్దాల్లో మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థలన్నీ సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ పశ్చిమ ఐరోపా పరిస్థితి మెరుగుపడింది. అందుకే ఫ్రాన్సు, జర్మనీ పాలకవర్గాలు స్వంతంగానే భద్రతను చూసుకోగలమనే సంకేతాలను పంపుతున్నప్పటికీ మొత్తంగా ఐరోపాను ఆదుకొనేంత ఆర్థిక శక్తి వాటికి లేదు. మొత్తమ్మీద ప్రపంచ రాజకీయాల గురించి మీడియాలో గతంలో ఎన్నడూ లేని చర్చ జరుగుతోంది. సౌదీలో ఏం జరగనుంది? తురుపు ముక్కలను ఎవరు ఎలా ప్రయోగిస్తారు.వేచి చూడాల్సిందే!

'ఐరోపా మీద డోనాల్డ్ ట్రంప్ దాడి' అంటూ ఎకనమిస్టు పత్రిక ఒక వ్యాఖ్యా విశ్లేషణ చేసింది. ఉక్రెయిన్ మీద ఒక ఒప్పందం చేసుకొనేందుకు పుతిన్‌కు ట్రంప్ పంపిన ఆహ్వానం నాటో కూటమిని గందరగోళంలోకి నెట్టిందని పేర్కొన్నది. ఐరోపా భద్రతకు తామింకే మాత్రం ప్రాథమిక హామీదారుగా ఉండేది లేదంటూ ముందుగా అమెరికా రక్షణ మంత్రి పేట్ హెగ్‌సేత్ చేసిన ప్రకటన షాకిచ్చింది. కొద్ది గంటల తర్వాత పుతిన్‌తో సంప్రదింపుల గురించి ట్రంప్ ప్రకటిం చాడు. ఆ తర్వాత వార్షిక మ్యూనిచ్ భద్రతా సమావేశంలో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నొప్పించే రీతిలో ఐరోపా మీద దాడి చేశాడు.ఉక్రెయిన్ గురించి మాట్లాడాల్సిన వాన్స్ తన ప్రసంగమంతా ఐరోపా మీద కేంద్రీకరించాడు.

అది ఫిబ్రవరి 17వ తేదీ. 1600 సంవత్సరం. ఇటలీ లోని రోమ్ నగరం, కాంపోడి ఫియోరి కూడలి. అక్కడికి ఖగోళ సిద్ధాంతకర్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన బ్రూనోను రెక్కలు విరిచి కట్టి తీసుకొచ్చారు. నాలుకకు చుట్టిన తీగ విప్పేసి, చివరిసారి అడిగారు. "తప్పులన్నీ ఒప్పుకో! ప్రాణభిక్ష పెడతాం!" అన్నారు రోమన్ మత న్యాయస్థానం పెద్దలు. బ్రూనో తల అడ్డంగా తిప్పాడు. తను ఏ తప్పు చేయలేదని నిర్భయంగా చెప్పాడు. శిక్ష అనుభవించడానికి సిద్ధమన్నట్లుగా నిలబడ్డాడు. 'నేను చెప్పిన నిజాలు తరతరాలుగా మీలాంటి మూర్ఖుల్ని తొలుస్తూనే ఉంటాయి' అన్న మనో నిబ్బరం ఆయనది. మత న్యాయస్థానం అధికారులు, రాజ్యాధినేతలు అందరూ ఆత్రంగా ఎదురు చూశారు. ఆ చివరి క్షణంలోనైనా దాసోహం అంటాడేమోనని ఆశపడ్డారు. కాని, వారి ఆశ నిరాశే అయ్యింది. సత్యస్థాపన కోసం తను ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనన్నట్లు, వారివైపు బ్రూనో జాలిగా చూశాడు. 'ఏమిటీ విచిత్రం? గాలీ వెలుతురూ లేని చీకటి గదిలో ఏడేళ్ళు బంధించినా, రోజూ చిత్ర హింసలు పెట్టినా, క్రమం తప్పకుండా మానసికంగా వేధించినా బ్రూనోలో ఏ మాత్రం మార్పు రాలేదేమని మతాధికారులు ఆశ్చర్యపోయారు. వారి పైశాచికత్వానికి వారే భయపడ్డారు. అయితే ఆ పైశాచిక ప్రవృత్తిని బ్రూనోకు అంటగట్టారు. ఇతను మనిషి కాదు, సైతానుగా మారిపోయాడు. సైతాను రక్తం భూమి మీదపడితే అరిష్టం సంభవిస్తుంది-అని తీర్మానించుకున్నారు. మూఢత్వంలోంచి క్రూరత్వంలోకి జారిపోయారు.

బ్రూనో సజీవ దహనం అతిపెద్ద మానవ తప్పితం



అప్పటివరకు మత విశ్వాసకులు భూమి కేంద్రకమని, దాని చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని విశ్వసించేవారు. అది తప్పని, సూర్యుని చుట్టూ భూమి తిరుగుతోందని బ్రూనో చెప్పాడు. ఈ విషయం అంతకు ముందు నికొలస్ కోపర్నికస్ (1473-1543) చెప్పిందే. దాన్ని బ్రూనో బలపరిచాడు. అంతేకాదు. ఈ భూమి లాంటి "భూములు" (గ్రహాలు) ఇంకా ఉన్నాయన్నాడు. ఈ విశ్వానికి ఆదీ, అంతం ఉన్నాయని మత విశ్వాసకులు బోధిస్తూ ఉంటే, అలాంటివేమీ లేవన్నాడు బ్రూనో. మొత్తానికి సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం, క్రైస్తవ సన్యాసి అయి ఉండి క్రీస్తుకు, బైబిల్‌కు వ్యతిరేకంగా ప్రశ్నలు గుప్పించడం, విమర్శించడం నాటి రోమన్ మత న్యాయస్థానం వారికి ఆగ్రహం తెప్పించింది. మానవీయ విలువల్ని మంటగలుపుతూ నాటి మత పెద్దలు బ్రూనోకు శిక్ష విధించారు. మనిషి, మనిషిని మనిషిగా గుర్తించక పోవడం చరిత్రలో అతి దారుణంగా నమోదైంది.

బ్రూనో (1548-17 ఫిబ్రవరి 1600) ఫిలిప్పో బ్రూనోగా ఇటలీ, నాపల్స్ రాజ్యం, నోలాలో పుట్టాడు. కవిగా, తత్వవేత్తగా, గణిత శాస్త్రజ్ఞుడిగా పేరు సంపాదించుకున్నా, ఖగోళ సిద్ధాంతకర్తగా ప్రపంచ ప్రఖ్యాతు డయ్యాడు. ఆధునిక వైజ్ఞానిక పరికరాలు లేని రోజుల్లో, టెలిస్కోపులు, అబ్జర్వేటరీలు లేని రోజుల్లో కొన్ని వైజ్ఞానిక విషయాలు కచ్చితంగా చెప్పగలిగాడంటే ఆయన ఎంతటి మేధావో మనం అంచనా వేసుకోవాలి. చుక్కలు చాలా దూరంలో ఉన్న సూర్యుళ్లు అని మొదట చెప్పిన వాడాయన. తరువాత కాలంలో ఆయన చెప్పిన అంశాల్ని ఆధునిక పరిశోధనలు ధ్రువీకరించాయి. స్వయం ప్రకాశితాలు, వేడినిచ్చే కొన్ని 'సూర్యుళ్ళు' నిశ్చలంగా ఉన్నాయని, వాటి చుట్టూ తిరిగే వాటినే 'భూముల'ంటున్నామని, అవి వెలుగునూ, వేడిని సూర్యుల నుండి స్వీకరిస్తున్నాయని బ్రూనో ప్రకటించాడు.

వైజ్ఞానికంగా ప్రపంచం ఏమీ సాధించని రోజుల్లోనే బ్రూనో లాంటి వాళ్లు గట్టిగా నిలబడి మూఢనమ్మకాల్ని నిరసించారు. ప్రాణ త్యాగానికి సిద్ధమయ్యారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మత పెద్దలు పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తూ అబద్ధాలను నిజాలుగా భ్రమింపచేస్తున్నారు. జనాన్ని మూఢత్వంలో ముంచి ఉంచుతున్నారు. బ్రూనో వారసుల అవసరం ఈ నాడు కూడా ఉంది. ఇప్పటికీ భూమినే కేంద్రంగా తీసుకుని, లెక్కలు కడు తున్న అజ్ఞాన పండితుల్ని జనం తిరస్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. మనమిప్పుడు ఆస్ట్రాలజీ కాదు, ఆస్ట్రానమీ తెలుసుకోవాలి! బ్రూనో జ్ఞాపకార్థం పదిహేడు ఫిబ్రవరి సత్యాన్వేషణ దినంగా పరిగణిస్తున్నాం!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మైనార్టీలు ఈ దేశ పౌరులు కాదా?బడ్జెట్‌లో ఎందుకింత వివక్ష?



అబ్దుల్ సత్తార్
7382619029

"సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్" మోడీ ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పుకుంటున్న నినాదం. దేశంలో తమ ప్రభుత్వం అందరిదనీ, ఆదర్శ మైనదని, సంక్షేమాన్ని ఇచ్చేదని వల్లె వేస్తున్నది. కానీ, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలను పూర్తిగా విస్మరించింది. కేంద్ర బడ్జెట్ మొత్తం రూ.50.47 లక్షల కోట్లు. ఇందులో మైనార్టీల సంక్షేమానికి కేటాయిం చింది కేవలం 0.05 ఆరు శాతం. ఇది చాలా నామమాత్రం. మైనార్టీలకు సంబం ధించిన స్కాలర్‌షిప్ కేటాయింపులకు కోత పెట్టడం నుంచి మొదలకుంటే ఫ్రీ కోచింగ్ స్కీమ్, స్కిల్ డెవల ప్మెంట్, ఎంప్లాయ్‌మెంట్ పథకాలు అన్నింటా మోడీ సర్కార్‌ది చిన్నచూపే. బడ్జెట్‌లో నిధులు కేటాయించ కుండా వికాస్ ఎలా సాధ్య మనేది ప్రశ్న? 2023- 24 బడ్జెట్‌లో ఫ్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు రూ.433 కోట్లివ్వగా ఆ తర్వాత ఏడాది దీనికి కోత పెట్టి 326.16 కోట్లు కేటాయి ంచింది. ఇప్పుడేమో కేవలం 195.70 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపు కుంది. దేశంలో దాదాపు ఇరవై కోట్ల మంది ముస్లిం జనాభా ఉంటే, వారికి సరిపడా కేటాయింపులు లేక పోవడం ఆందోళనకరం. కేటాయించిన వాటిని కూడా ఖర్చు పెట్టకపోవడం మరీ తీవ్రమైన అన్యాయం. 2023 -24లో ఖర్చు పెట్టింది కేవలం రూ.95.83 కోట్లు, ఆ తర్వాత ఏడాది మరింత తగ్గించి కేవలం 90 కోట్లతోనే సరిపెట్టింది.

మైనార్టీ సముదాయాల పిల్లల భవిష్యత్తు చదువుతో ముడిపడి ఉందని సచార్ కమిటీ, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్లు 2010-11లోనే సిఫార్సులు చేశాయి. మైనా ర్టీలు విద్యాపరంగానే కాదు ఆర్థికపరంగా కూడా వెనక బడ్డారని, ఈ సమయంలో పిల్లల చదువును ప్రోత్స హించడం ద్వారా వారి ప్రగతికి తోడ్పడటం, దేశ అభివృద్ధికి కూడా చాలా అవసరమని చెప్పాయి. ఈ విషయాలన్నీ మోడీ సర్కార్‌కు పట్టదు. మైనార్టీ పిల్లల చదువులను కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. 2025-26 బడ్జెట్‌లో ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్స్‌లో కోత పెట్టింది. పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్‌ల విషయంలోనూ ఇదే పరిస్థితి. ఈసారి బడ్జెట్‌లో 65 శాతం వరకు కోత విధించింది. మెరిట్, ప్రొఫెషనల్, టెక్నికల్ చదువులను ఉద్దేశించినవాటికి గతేడాది రూ.33.60 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం 7.34 కోట్లు మాత్రమే కేటాయించింది. విదేశీ చదువులకిచ్చే రుణాల విషయం లోనూ ఇదే వైఖరి. గతేడాది రూ.15.30 కోట్లు కేటాయిస్తే, ఈసారి 8.16 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఈ ఏడాది కేటాయింపులే సరిపోవంటే అందులో నిధుల విడుదల, ఖర్చు పెట్టడం కూడా తక్కువ గానే ఉండే అవకాశం ఉంది. ఎందు కంటే, మైనార్టీలకు కేటాయి ంచిన గత రెండు, మూడు బడ్జెట్‌ల్లోనూ ఇదే పరిస్థితి. ఇది మైనార్టీ పిల్లలను విద్యకు దూరం చేయడమే తప్ప వేరే కాదు.

మరోవైపు మదర్సాల పట్ల వ్యతిరేక ప్రచారం జరుగుతున్నది. 2023-24 బడ్జెట్‌లో మదర్సాల స్కీముల కేటాయిం పులు 93 శాతం తగ్గించింది. ఆ తర్వాత ఏడాది కేవలం రూ. రెండు కోట్లివ్వగా ఈ ఏడాది పూర్తిగా తగ్గించింది. 2024- 25లో మోడీ ప్రభుత్వం మొత్తం ఆరు స్కీములకు గాను రూ.1575.72 కోట్లు కేటాయిస్తే, అందులో విడుదల చేసింది కేవలం 517.20 కోట్లు మాత్రమే. ఖర్చు ఎంత చేశారన్నది తెలియదు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లల చదు వులకు స్కాలర్‌షిప్‌లు ఉప యోగమో అలాగే మైనార్టీల పిల్లలకు కూడా అంతే అవసరం. చదువులకు స్కాలర్‌షిప్‌ల మద్దతు లేకపోతే పేదరికంలో రోజు కష్టపడే కుటుంబాలు, అసం ఘటిత రంగ కార్మికులు పిల్లలను చదివించుకోవడం కష్టం. 2023-24లో రూ. 1689 కోట్లు బడ్జెట్లో కేటాయించగా రూ.500 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేసింది. కానీ ఖర్చు పెట్టింది మాత్రం రూ. 428.74 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఇదే స్కీముల కోసం కేటాయించింది రూ. 678.03 కోట్లు. మోడీ గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రాజ్యాంగబద్ధం కాదని కోర్టులో అప్పటి ప్రభుత్వం కేసు వేయగా ఏండ్ల పాటు కేంద్రమిచ్చే స్కాలర్‌షిప్‌లు ఆ రాష్ట్రంలో అందించలేదు. దీన్నిబట్టి చూస్తే మోడీ మైనార్టీల చదువుల పట్ల వ్యతిరేకంగా ఉన్నారనేది స్పష్టమవుతున్నది.

చదువులకు స్కాలర్‌షిప్‌ల మద్దతు లేకపోతే పేదరికంలో రోజు కష్టపడే కుటుంబాలు, అసంఘటిత రంగ కార్మికులు పిల్లలను చదివించు కోవడం కష్టం. 2023-24లో రూ. 1689 కోట్లు బడ్జెట్లో కేటాయి ంచగా రూ.500 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేసింది. కానీ ఖర్చు పెట్టింది మాత్రం రూ. 428.74 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఇదే స్కీముల కోసం కేటాయించింది రూ.678.03 కోట్లు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రాజ్యాంగబద్ధం కాదని కోర్టులో అప్పటి ప్రభుత్వం కేసు వేయగా ఏండ్లపాటు కేంద్రమిచ్చే స్కాలర్‌షిప్‌లు ఆ రాష్ట్రంలో అందించ లేదు. దీన్నిబట్టి చూస్తే మోడీ మైనార్టీల చదువుల పట్ల వ్యతిరేకంగా ఉన్నారనేది స్పష్టమవుతున్నది.



ఇంకోవైపు ఇటీవల వక్ఫ్ బిల్లుపై కేంద్రం పార్లమెంటులో చర్చ లేవనెత్తింది. తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీ జరిపి మళ్లీ ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నది. వక్ఫ్ సమస్యల పరిష్కా రానికి బిల్లు తెచ్చామని చెప్పకుంటున్న కేంద్రం బడ్జెట్‌లో దాని కోసం ఎలాంటి కేట యింపులు చేయ లేదు. ఖౌమి వక్ఫ్‌బోర్డ్ తర్కీయాతి స్కీం ఇందులో ఒకటి. ఒక బోర్డు నిర్వహిస్తున్న ఆస్తులన్నింటినీ డిజిటలైజ్ చేయడానికి ఉద్దేశించిన స్కీమ్. అలాగే షహరీ సంపత్తి వికాస్ యోజన మరో స్కీమ్. వక్ఫ్ సంస్థలు, వక్ఫ్ బోర్డులకు, వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం, వడ్డీ రహిత రుణాలివ్వడానికి ఉద్దేశించిన స్కీమ్. ఈ రుణాల ద్వారా పట్టణాల్లో ఉన్న వక్ఫ్ భూములపై ఆర్థికంగా లాభ దాయకమైన కట్టడాలు అంటే బిజినెస్ కాంప్లెక్సులు, కల్యాణ మండపాలు, ఆస్పత్రులు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు వగైరా నిర్మించి ఈ ఆస్తులను వినియోగంలోకి తీసుకు రావడం ఉద్దేశం.ఈ రెండు స్కీమ్‌లు గతంలో వేర్వేరుగా ఉండేవి. కానీ 2020-21లో ఈ రెండు స్కీములను కలిపి ఒకటి చేశారు. 2023- 24లో కేవలం రూ.17 కోట్లు కేటాయిస్తే ఇందులో రూ.8కోట్లు మాత్రమే విడుదల చేసి కేవలం ఖర్చుచేసింది మాత్రం పదిలక్షలు. తర్వాత సంవత్సరం రూ.16 కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రూ.3.7 కోట్లు మాత్రమే. ఈ ఏడాది రూ.13 కోట్లు కేటా యించగా ఇందులో ఎంత ఖర్చు చేస్తారో కూడా తెలియని పరిస్థితి. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌కు సంబం ధించిన విషయాల్లో నయి మంజిల్, లీడర్‌షిప్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీ వుమెన్, హమారీ ధరోహర్ వంటి స్కీములను పూర్తిగా నిలిపేసింది.

యూపీఎస్సీ, ఎస్పెస్సీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పరీక్షల కోసం మైనార్టీ పిల్లలకు తోడ్పడే కార్యక్రమాలు కూడా ఆగిపోయాయి. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నేషనల్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎండిఎఫ్‌సి) కేటాయింపులు పడిపోయాయి. కొంత మంది గతంకంటే ఎక్కువిచ్చామని చెబుతున్నా అంకెలు కూడా అలాగే కనిపిస్తున్నాయి. గతేడాది రూ.3183 కోట్లు కేటాయిస్తే ఈసారి 3350 కోట్లు కేటా యించింది. 167కోట్లు పెరిగినప్పటికీ వాటిని ఖర్చు చేసేవరకు నమ్మకం లేదు. ఎందుకంటే, ఇప్పటివరకు మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు సగానికి సగం ఖర్చు చేయలేదు. గతేడాది మైనార్టీల కోసం రూ. 3183.24 కోట్లు ప్రకటించి, మళ్లీ రూ.1868.18 కోట్లుగా సవరించింది. ఈసారి ఏమవు తుందోనన్న ఆందోళన మైనార్టీలను వేధిస్తోంది. అయితే ఇక్కడ గమ నించాల్సిన ముఖ్యమైన విషయమేమి టంటే కేంద్రం ఉద్దేశ పూర్వ కంగానే మైనార్టీ వర్గాలను బలహీన పరిచేయత్నం చేస్తున్నది. అందుకే ఏడాదికేడాది కేటాయింపుల్లోనూ కోతలు విధిస్తున్నది. ఈ పదకొండు సంవత్సరాల బడ్జెట్‌ను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఈ విధా నాల్ని సహించబోమని మైనార్టీ ప్రజలు గళ మెత్తాలి. మేము కూడా ఈ దేశ పౌరులమేనని, మాకూ హక్కులున్నాయని చాటిచెప్పాలి. మైనా ర్టీలకు కేటాయించిన అరకొర బడ్జెట్‌ను సవరించి, వాటిని సంక్షేమానికి ఖర్చు చేసే వరకు ఉద్యమించాలి.

కృష్ణా జలాల వివాదంలో కేంద్రం జోక్యం చేసుకోవాలి


పర్యవేక్షణకు టెలిమెట్రీ పరికరాలు వినియోగించాలి • సాగర్ నీటిని అక్రమంగా మళ్లించొద్దు : ఉదయపూర్ వాటర్ సదస్సులో మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణకు అన్యాయం జరగకుండా నిరోధించడానికి కృష్ణా నీటి వివాదంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయపూర్‌లో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆమోదించిన రెండో ఆల్ ఇండియా స్టేట్ వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్ -2025లో మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి కృష్ణా నది నీటిని అక్రమంగా మళ్లించకుండా ఆపడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా నది నీటి వినియోగాన్ని పర్యవేక్షించడానికి టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తెలంగాణ న్యాయమైన వాటాను రక్షించడానికి కృష్ణా జలాల వివాదం ట్రిబ్యునల్ కేసును త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని అన్ని ప్రధాన, చిన్న సాగునీటి ప్రాజెక్టుల పూడికతీత, డీసెడిమెంటేషన్ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. ఇది ఇతర రాష్ట్రాల్లోని ఇలాంటి ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) విచారణను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ముందుకు సాగడానికి కేంద్రం నుంచి స్పష్టమైన లిఖిత సిఫారసులను అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ప్రధాన, మధ్యస్థ సాగునీటి ప్రాజెక్టులలో పూడికతీత, డీసెడిమెంటేషన్ ప్రయత్నాలను ప్రారంభించిందన్నారు. ఈ ప్రయత్నాలకు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతున్నట్టు చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్‌ఏ విచారణ గురించి, ఈ విచారణ చాలా నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. త్వరితగతిన పూర్తి చేయడానికి, తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణను నిర్దేశించడానికి జలశక్తి మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని మంత్రి కోరారు. గంగా, యమునా పునరుద్ధరణ ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా మూసీ ప్రాజెక్టుకు కూడా పూర్తి ఆర్థిక మద్దతును కేంద్రం అందించాలని కోరారు. ఈ ప్రయత్నం నది పర్యావరణాన్ని పునరుద్ధరించడం, మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడం, హైదరాబాద్ కోసం స్థిరమైన నీటి నిర్వహణను నిర్ధారిస్తూ పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

మూసీ నది వెంట ట్రంక్ , ఇంటర్‌సెప్టర్, సీవర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 4,000 కోట్లు అవసరమని చెప్పారు. గోదావరి నదిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లతో లింక్ చేయడానికి అదనంగా రూ. 6,000 కోట్లు కేంద్రం ఇవ్వాలని కోరారు. ఈ లింకేజ్ హైదరాబాద్ తాగునీటి సరఫరాను భద్రపరచడంతో పాటు మూసీ నది పునరుద్ధరణను కూడా సహకరిస్తుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగే షన్ స్కీం, సమక్క-సారలమ్మ ప్రాజెక్ట్, సీతారామసాగర్ ప్రాజెక్ట్ కోసం నీటి కేటాయింపును త్వరగా పూర్తి చేయాలనీ, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో దీర్ఘకాలిక నిధులను అందించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.



గుజరాత్‌లో బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తారా?

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు షబ్బీర్ అలీ సూటి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గుజరాత్‌లో బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తారా? అంటూ ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో బీసీల్లో మైనార్టీలను కలిపారంటూ మాట్లాడటం కాదు...గుజరాత్ సంగతి చూడాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాధారణ వ్యక్తి మాట్లాడితే...ఏదోలే అనుకోవచ్చు కానీ కేంద్ర మంత్రులుగా ఉండి మతాల మధ్య చిచ్చుపెట్టటమేంటని వారిని నిలదీశారు. హంటర్ కమిషన్(1882), మిల్లర్ కమిషన్ (1918), కాక కాలేకర్ నివేదిక(1953)ల్లో ఏముందో చూడాలని కోరారు. ఇప్పటికీ అత్యంత వెనకబడిన మైనార్టీలు బీసీ జాబితాలోనే ఉన్నారని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఆయా కమిషన్లు ఇచ్చిన నివేదికల ఆధారంగానే తమ ప్రభుత్వం పని చేసిందన్నారు.

కులగణనను సద్వినియోగించుకోవాలి

- బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్
- బీజేపీది కుటిల రాజకీయం
- దమ్ముంటే కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి : రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

కులగణనకు సంబంధించి బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ అన్నారు. హైదరాబాద్ గోల్నాక డివిజన్ పరిధిలోని కాచిగూడలో మంగళవారం కులగణనపై పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావుతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. కులగణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ సర్వేలో పాల్గొని కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎన్యూమరేటర్లు, వార్డు అధికారులకు సర్వేకు సంబంధించిన దిశా నిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సర్వే ఈనెల 28 వరకు కొనసాగనుందన్నారు. మూడు విధాలుగా వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను పిలిపించుకునే ఛాన్స్ ఇచ్చిందని చెప్పారు. 040 21111111 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు కాల్ చేసి అడ్రస్ చెప్తే.. ఫోన్ చేసినోళ్ల ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని వివరించారు. ఈసారి ఆన్‌లైన్‌లో ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇచ్చే ఆప్షన్ కూడా ఉందన్నారు. వార్డు కార్యాలయాలను సంప్రదించొచ్చన్నారు. వీహెచ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కులగణన చేపడుతున్నామని తెలిపారు. బీజేపీ కుటిల రాజకీయం చేస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాలని, అనవసరంగా రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ తదితర నాయకులను విమర్శించడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, అప్సర్ నవాబ్ జాహి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్ కుమార్, జమీర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో పీఎన్బీ కొత్త శాఖ ప్రారంభం



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) హైదరాబాద్ సర్కిల్‌లోని శంకర్‌పల్లిలో నూతన శాఖను ఏర్పాటు చేసింది. దీనిని మంగళవారం ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా పీఎన్బీ ఉందని దీపక్ కుమార్ తెలిపారు. తమ బ్యాంక్‌ల్లో అన్ని రకాల విత్త సేవలు లభిస్తాయన్నారు. సర్కిల్ హెడ్ అర్విండ్ కల్రా మాట్లాడుతూ వ్యవసాయ, బంగారం, గృహ, వాహన రుణాలను తక్కు వడ్డీ రేట్లతో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ రియా కుమారి సహా ఇతర సీనియర్ అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించండి

- డిప్యూటీ సీఎంకు టీజీఎస్‌యూఈఈయూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీఎస్‌యూఈఈయూ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు యూనియన్ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతను బట్టి రెగ్యులర్ పోస్టుకు కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. దీనివల్ల సంస్థపై ఎలాంటి ఆర్థికభారం పడబోదన్నారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ వీ గోవర్ధన్, కోశాధికారి బసవరాజు, టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ ఉపాధ్యక్షులు కర్నాల అనిల్‌కుమార్ ముదిరాజ్, శ్రీకాంత్, పండుగ స్వామి తదితరులు ఉన్నారు.

విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలి

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యనందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టికి విద్యాకమిషన్ ప్రతిపాదన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. రాష్ట్రంలో వివిధ వర్గాలతో వరుస చర్చలు జరిపి వారి నుంచి అనేక సలహాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం అస్తవ్యస్థం చేసిందని పేర్కొన్నారు. దాని ఫలితంగా అభ్యాస పేదరికం ఏర్పడిందని వివరించారు. ప్రస్తుత విద్యారంగం దుస్థితి వల్ల ప్రజా, పౌర సమాజ సంస్థల నుంచి ఒత్తిడి, అశాంతి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగంపై తగిన జ్యోం చేసుకోవాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో రాష్ట్ర బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రూపొందించగల అభివృద్ధి, ప్రాధాన్యతలకు దిశానిర్దేశం చేయడం కోసం ఈ బడ్జెట్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు విశ్వవిద్యాలయాలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు.

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి కావాల్సిన బడ్జెట్‌ను తయారుచేసి సమర్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ఫౌండేషనల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి అంతర్జాతీయ ప్రమాణాలు, ఉత్తమ అభ్యాస వాతావరణం, ఉత్తమ బోధనా వాతావరణంతో కూడిన ఉత్తమ పాఠశాల ప్రమాణాలు కలిగి ఉండేలా బడ్జెట్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ హెచ్‌యూసీ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా లెనిన్, పంకజ్
- విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు తీర్మానం

నవతెలంగాణ-మియాపూర్

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీ 41 మందితో ఎన్నికైంది. కమిటీ 18వ మహాసభ క్యాంపస్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. అంతర్జాతీయ, జాతీయ సమస్యలు, విద్యార్థుల సమస్యలపై చర్చించి, వివిధ తీర్మానాలు చేశారు. విద్యావ్యవస్థ ప్రయివేటీకరణ, కేంద్ర విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. అనంతరం ఈ మహాసభ 41 మందితో కమిటీ.. 15 మందితో కారదర్శివర్గాన్ని ఎన్నుకుంది.

నూతన కమిటీ అధ్యక్షులుగా లెనిన్, కార్యదర్శిగా పంకజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అతీక్, డేబస్రీత, మోహిత్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సుభాషిణి, ఆకాశ్, కృప ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యలపై, విద్యార్థి వ్యతిరేక పాలసీలపై నిరంతరం పోరాటాలు చేస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు చెప్పారు.

వైద్యారోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యత

- రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్యారోగ్యశాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్యారోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునీకరిస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆస్పత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియంలు నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు వారు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

డంప్ యార్డ్.. జీవన్మరణ సమస్య

పంటలు, పర్యావరణం పాడయ్యే ప్రమాదం
ప్రజాభిప్రాయానికి భిన్నంగా జీహెచ్ఎంసీ నిర్ణయం

- పోలీస్ నిర్బంధాలు పోరాటాల్ని ఆపలేవు
- గుమ్మడిదల పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తం చేస్తాం
- డంపు యార్డ్ రద్దు కోసం 20న కలెక్టరేట్ ముట్టడి
- ఇతర రాజకీయ పార్టీలూ కలిసి రావాలని పిలుపు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- ప్రజల దీక్షలకు మద్దతు



చెత్తతో నివాసాల విధ్వంసం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని గుమ్మడిదల ప్రాంతంలోని 40 వేల మంది ప్రజలు చేస్తున్న పోరాటం జీవన్మరణ సమస్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. చెత్త వల్ల జన నివాసాలు విధ్వంసం అవుతాయని, ఇప్పటికే జవహర్‌నగర్ ప్రాంతం కాలుష్యమయంగా మారిందని వివరించారు. డంప్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 14 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతు పలుకుతూ మంగళవారం ఆ పార్టీ నాయకులు గుమ్మడిదల, నల్లవల్లిలో దీక్షా శిబిరాల్ని సందర్శించి.. మద్దతు తెలిపి దీక్షల్లో కూర్చుకున్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. చెత్త డంపింగ్ యార్డ్ వల్ల ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని నివాస గ్రామాలన్నీ ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జవహర్‌నగర్‌లో 400 ఎకరాల్లో పోస్తున్న చెత్త వల్ల ఆ ప్రాంతమంతా పర్యావరణం దెబ్బతిన్నదని, వాయు, జల కాలుష్యం వల్ల ప్రజలెవ్వరూ అక్కడ ఉండే పరిస్థితి లేదని అన్నారు. ప్యారానగర్‌లో ప్రజాభిప్రాయానికి భిన్నంగా జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ పెట్టాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఇక్కడ జనవాసాలు, పంటలు, పర్యావరణం దెబ్బతినడమే కాకుండా పక్కనే ఉన్న ఎయిర్‌లైన్స్ శిక్షణా కేంద్రానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు సైతం డంపింగ్ యార్డ్ పెట్టొద్దని కలెక్టర్‌కు లేఖ రాసినా అధికారులు పట్టించుకోకపోవడం బాధ్యతారా హిత్యమన్నారు. ఊర్లను ఖాళీ చేసే.. పంట పొలాల్ని పడావు పెట్టే చెత్త కుంపటిని ప్యారానగర్‌లో కాకుండా జనజీవనం, పంట పొలాల్లేని, గుట్టలు కొండల్లో పెట్టుకోవాలని సూచించారు. అధికారులు చెబుతున్న టెక్నాలజీ ఏమిటో దాని వల్ల చేకూరే మేలు ఏమిటో ప్రజలకు అవగాహన కల్పించి ఇప్పటికే ఏర్పాటు చేసిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను సరి చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం న్యాయబద్ధమైనదని, ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ప్రశాంతంగా ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. సీపీఐ(ఎం) ప్రజల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెల్పడమే కాకుండా ప్రత్యక్ష కార్యాచరణలో ఉంటుందన్నారు. ఈ నెల 20న సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయకపోతే ప్రజల్ని సమీకరించి గుమ్మడిదల పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తం చేస్తామని హెచ్చరించారు. ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీటీసీ ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీలు, నాయకులు ఈ పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊర్ల నిండా పోలీస్ బలగాల్ని మోహరించి ప్రజలు కదలకుండా నిర్బంధం ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టులు, కేసులు, నిర్బంధాల వల్ల ప్రజా పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. ప్రజల న్యాయమైన పోరాటానికి ఈ ప్రాంతంలోని కార్మికవర్గం కూడా మద్దతుగా నిలుస్తుందన్నారు.

సీపీఐ(ఎం), సీఐటీయూ ప్రజాందోళనలో పాల్గొంటాయన్నారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయం సేకరించకుండా ఏకపక్షంగా ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ పెట్టడం అప్రజాస్వామికమన్నారు. నివాస గ్రామాలకు రోడ్డు వేసుకునేందుకు అనుమతులివ్వని అటవీ శాఖ అధికారులు డంపింగ్ యార్డ్ కోసం మాత్రం రాత్రికి రాత్రే చెట్లు నరికి రోడ్డు వేసేందుకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ వల్ల ఎలాంటి పర్యావరణం దెబ్బతినదంటూ పీసీబీ అధికారులు అనుమతులివ్వడం బాధ్యతా రాహిత్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వర్, రాయిని లలిత, ప్రజా సంఘాలు, సీఐటీయూ నాయకులు పాండు రంగారెడ్డి, నాయిని నర్సింహ్మారెడ్డి, సునీత, వీరస్వామి, శ్రీధర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, శేఖర్, లక్ష్మణ్, తలారీ శ్రీను, వెంకటేశ్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో 17 మందికి జీవితఖైదు

నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు తీర్పు

- చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్షలు తప్పవు : రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నవతెలంగాణ-అడ్డగూడూరు

భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో 17మందికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017లో యాదవ సామాజిక తరగతికి చెందిన ఓ వ్యక్తి మృతి కేసులో బట్ట లింగయ్య జైలుకెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటకొచ్చాడు. దసరా పండుగ సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో బట్ట లింగయ్య కుటుంబంతో కలిసి పాల్గొనేందుకు వెళ్లాడు. ఆ సమయంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు ఎదురయ్యారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో లింగయ్యపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. యూఎస్147, 302, 323 504 ఆర్/డబ్ల్యూ149 ,109 ఐపీసీ సెక్షన్



3(1)(1)(ఆర్),(ఎస్) 3(2)(వీఏ) ఎస్సీ ఎస్టీ చట్టం, అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ ఎస్సీ నెం45/2018 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసు విచారణ ప్రారంభమైంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్ అప్పుడు ఇక్కడ ఏసీపీ హోదాలో ఈ కేసు విచారణను వేగవంతంగా పూర్తి చేసి సాక్షాధారాలను కోర్టు ముందుంచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలు వినిపించారు. సాక్షాధారాల పరిశీలన అనంతరం నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు 17 మంది నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.6000 చొప్పున జరిమానా విధించింది.

శిక్ష పడినవారు వీరే..

ఏ-1 పండుగ రామస్వామి, ఏ-2 పండుగ సాయిలు, ఏ-3 పండుగ రాములు, ఏ-4 పండుగ మల్లేశ్, ఏ-5 బండగొర్ల వలరాజు, ఏ-6 పండుగ యాదయ్య, ఏ-7 జక్కుల రమేశ్, ఏ-8జక్కుల భిక్షమయ్య(విచారణలో ఉండగా మృతిచెందాడు. ఏ-9 (విద్యార్థి), ఏ-10, ఏ-11 పండుగ నర్సాయిస్, ఏ-12 పండుగ సత్యనారాయణ, ఏ-13 బండగొర్ల నాగమ్మ, ఏ-14 పండుగ శ్రీను, ఏ-15 పండుగ మల్లయ్య, ఏ-16 పండుగ లింగయ్య, ఏ-17 జక్కుల లచ్చయ్య, ఏ-18 పిలబోయిన లింగయ్య(అజీంపేట గ్రామ మాజీ సర్పంచ్).

తాత్కాలిక ఆవేశాలతో చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

తాత్కాలిక ఆవేశంలో విచక్షణ కోల్పోయి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుంది. భవిష్యత్‌ను కోల్పోయి జైలు జీవితం గడపాల్సి వస్తుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ వ్యక్తులు తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకూడదు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రాచకొండ పోలీసులు అహర్నిశలూ కృషి చేస్తున్నారు.



సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ జయప్రదానికి మాస్ ఫండ్ క్యాంపైన్

అగ్రనేతలంతా ప్రజల వద్దకెల్లి నిధి వసూళ్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలని, అందుకు ప్రజలంతా విరివిగా విరాళాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) తమిళనాడు నాయకులు పిలుపు ఇచ్చారు. తమిళనాడులోని మధురైలో ఏప్రిల్ 2 నుండి 6 వరకు సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభ జరగనుంది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నేతలు, కార్యకర్తలు నేరుగా ప్రజల వద్దకే వెళ్లివిరాళాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు కె. బాలకృష్ణన్, సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పెరుమాళ్, పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు టికె రంగరాజన్ తదితరులు నిధులు వసూలు చేశారు. గ్రూపులుగా ఏర్పాడి మార్కెట్లు, ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించడంలో సీపీఐ(ఎం) కార్యకర్తలు నిమగ్నమై ఉన్నారు. ప్రజలు కూడా సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు వారి వద్దకు వెళ్లినప్పుడు తమకు తోచినది చిరునవ్వుతో ఇస్తూ అక్కున చేర్చుకుంటున్నారు.

పంటల రక్షణకు 'సోలార్ ఫెన్సింగ్ '

మంత్రి తుమ్మల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అడవి జంతువులు, కోతుల నుంచి పంటల రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పామాయిల్‌తోపాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశించారు. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో పామాయిల్ కర్మాగారం, మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రగతి చూపని పామాయిల్ కంపెనీలపై చర్యలు ప్రారంభిస్తామన్నారు. విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యానశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. సోలార్ పెన్సింగ్ పథకాన్ని అమలు చేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున సబ్సిడీపై ఇచ్చేందుకు విధి, విధానాలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రెండు, మూడేండ్లలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తి



చేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుంచి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ కోసం ధరఖాస్తులను స్వీకరించి గ్రౌండింగ్ మొదలు పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సాగు చేస్తూ లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశ పెట్టేందుకు వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.

ఆయా కంపెనీలకు నోటీసులిస్తాం

ఆయిల్ పామ్ సాగు లక్ష్యానికి చేరువ కానీ కంపెనీలకు నోటిసులు జారీ చేస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. సాగు పురోగతి తక్కువగా ఉన్న కంపెనీలను గుర్తించి రద్దు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోలన్నారు. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీకి ఆ ప్రాంతాన్ని అప్పగించామని చెప్పారు. మూడు, నాలుగు సంవత్సరాలు అయినప్పటికి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి భూమి గుర్తించక పోవడం, ప్లాంటేషన్ లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలను తొలగించి, వాటి స్థానంలో ఆయిల్‌ఫెడ్ కు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల్లో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మాణం జరుగుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మే నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. గద్వాల జిల్లా బీచుపల్లిలో, ఖమ్మం జిల్లా కల్లూరిగూడంలో ఆయిల్‌పామ్ కర్మాగారాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, పనులు ప్రారంభించాలన్నారు. ఆరువేల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసిన ప్రయివేటు కంపెనీలు కూడా వెంటనే పామ్ ఆయిల్ కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్

21 మందితో నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్ ఎన్నికయ్యారు. 21 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. జమ్మూకాశ్మీర్‌లోని జమ్మూలో రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ రాష్ట్ర 13వ మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాష్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యులు మొహమ్మద్ యూసుఫ్ తరిగామి, ప్రముఖ నాయకుడు ఓం ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ మహాసభకు 251 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 8 మంది మహిళలు ఉన్నారు. వీరిలో కాశ్మీర్ నుంచి 219 మంది ప్రతినిధులు, జమ్మూ నుంచి 32 మంది ప్రతినిధులు ఉన్నారు. రాష్ట్ర కార్యదర్శి గులాం నబీ మాలిక్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. 13 మంది ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. కార్యదర్శి సమాధానం తరువాత నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర నూతన కార్యదర్శిగా మహమ్మద్ అబ్బాస్ ఎన్నికయ్యారు. 21 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. రాష్ట్ర కార్యదర్శిగా గులాం నబీ మాలిక్ మూడు సార్లు పూర్తి చేసుకోవడంతో ఆయన రిలీవ్ అయ్యారు.

రాష్ట్ర హెూదా, ప్రత్యేక హెూదా కోసం పోరాటానికి పిలుపు

సీపీఐ(ఎం) జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర మహాసభ రాష్ట్ర హెూదా, ప్రత్యేక హెూదా కోసం పోరాటానికి పిలుపునిచ్చింది. 2019 ఆగస్టు 5 నుంచి బీజేపీ-ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ ప్రజలకు తీవ్ర అన్యాయం, భారీ అణచివేత, ఎన్నడూ లేనంతగా అవమానాల వంటి వాటిపై మహాసభ తీవ్రంగా విమర్శించింది. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ విజయాన్ని, బీజేపీ-ఎన్‌డీఏ ఓటమిని అభినందించింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హెూదా, ప్రత్యేక హెూదా పునరుద్ధరణ అనే ప్రశ్న ప్రజాస్వామ్య రక్షణకు సంబంధించిన ప్రశ్న అని పేర్కొంది. ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛ పరిరక్షణ, రాష్ట్ర హెూదా పునరుద్ధరణ, నిరుద్యోగంపై పోరు, భూ చట్టాలపై పోరాటం, ఎస్ఈపీని రద్దు చేయాలి, ఉద్యానవనం, కాశ్మీరీ వలసదారుల పరిహారం, పునరావాసం మహాసభ తీర్మానాలను ఆమోదించింది. జమ్మూ కాశ్మీర్‌లో సాధించిన లౌకిక ఐక్యతను కొనసాగించడానికి, బలోపేతం చేయడానికి రాబోయే రోజుల్లో పోరాటాలకు బలమైన పార్టీగా నిర్మించడంపై దృష్టి పెట్టాలని ప్రకాష్ కరత్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా అత్యంత క్లిష్ట పరిస్థితిలో గొప్ప అంకితభావంతో పని చేసిన ప్రతినిధులందరినీ అభినందించారు.



విమాన కంపెనీల నిలువు దోపిడీ

- రూ.30వేల వరకు పెంచిన చార్జీలు
- కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు
- డీజీసీఏ చర్యలు అంతంత మాత్రమే

న్యూఢిల్లీ : కుంభమేళా డిమాండ్‌ను ఆసరగా చేసుకొని విమానయాన కంపెనీలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతోన్నాయి. సాధారణ రోజుల్లో రూ. 5000 నుంచి రూ.10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30వేలకు చేర్చాయి. అడ్డగోలుగా ఛార్జీలు పెంచి.. భక్తులను నిలువు దోపిడి చేయడంపై కేంద్రానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కుంభమేళా ఈ నెల 26న శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ వస్తోన్నారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే తరలివస్తున్నారు. ఇందుకోసం విమానయాన కంపెనీలు ప్రత్యేక విమానాలు నడుపుతున్నాయి. గత రెండు రోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య 100 మార్క్‌ను దాటింది. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలు ఈ నెల చివరి వరకు విమానాలను నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు తాజాగా రూ.13వేలకు తక్కువ కాకుండా ధర ఉండగా.. కొన్ని తేదీల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తోన్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఏకంగా రూ.28వేల నుంచి రూ.32వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో రూ.33వేల వరకు విమాన చార్జీలు వసూలు చేస్తోన్నాయి.

మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10వేల లోపు ఉన్న విమాన చార్జీలను.. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా మరింత దండుకోవడం గమనార్హం. ముంబయికి వెళ్లే విమానాల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తున్నాయి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. అదే విధంగా కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలో వసూలు చేస్తున్నాయి."అధిక డిమాండ్ వల్ల ప్రయాగ్‌రాజ్ విమాన చార్జీలు పెరిగాయి. సాధారణంగా విమానయాన సంస్థలు ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ముందస్తు బుకింగ్‌లకు ప్రత్యేక విమాన చార్జీలు లేదా తగ్గింపులను అందిస్తాయి. కానీ ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విమాన కంపెనీలే స్వయంగా విక్రయించుకుంటున్నాయి. సాధారణంగా రూ.8,000 నుంచి రూ.10,000 మధ్య ఉండే చార్జీ ఇప్పుడు ప్రయాణ తేదీని బట్టి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు పలుకుతోంది." అని ట్రావెల్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (గుజరాత్) ప్రెసిడెంట్ రోనక్ షా పేర్కొన్నారు. అధిక చార్జీలపై ఫిర్యాదులు పెరగడంతో రెండు వారాల క్రితం విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించింది. చార్జీలను తగ్గించాలని ఆయా కంపెనీలకు సూచించింది. విమానయాన కంపెనీలు మొక్కుబడిగా కొంత తగ్గించాయి. తిరిగి మళ్లీ చార్జీలను ఆకాశానికి చేర్చడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చు చార్జీలపై పౌర విమానయాన మంత్రిత్వశాఖకు చెందిన డీజీసీఏ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పెరిగాయి.

పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది

బండి సంజయ్ వ్యాఖ్యలపై బండ్రు శోభారాణి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తేనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడాలని సూచించారు. మనుగడ కోసం మాజీ మంత్రి కేటీఆర్ రైతు దీక్షలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారని తెలిపారు.

అన్ని హామీలు నెరవేరుస్తాం

- పకడ్బందీగా చట్టాన్ని రూపొందిస్తున్నాం
- పదేండ్లు ఏమి చేయని వారు విమర్శిస్తారా?
- గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆర్ఎంపీలు, పీఎంపీలు అవసరం : ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభలో టీపీసీసీ అధ్యక్షులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆర్ఎంపీలు, పీఎంపీలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడితే సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్ల సమస్యపై ముఖ్యమంత్రితో, సంబంధిత శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకోసం పకడ్బందీగా చట్టం రూపొందించేందుకు సమయం పడుతున్నదని తెలిపారు. పదేళ్లు ఏమి చేయని వారు రెచ్చగొట్టే మాటలను పట్టించుకోవద్దని కోరారు. అలా రెచ్చగొడితే గత పదేళ్లు ఏమి చేశారో నిలదీయాలని సూచించారు. మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 2008లో ఆర్ఎంపీల కోసం జీవో తీసుకొచ్చారని గుర్తుచేశారు. పదేళ్లు ప్రాథమిక వైద్యాన్ని, రాజీవ్ ఆరోగ్యశ్రీని పట్టించుకోని బీఆర్ఎస్ సర్కార్ గ్రామీణ వైద్య వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తనకు చిన్నప్పుడు గాయమైతే ఆర్ఎంపీ వైద్యుడే వైద్యం చేశారని తెలిపారు. కొంత మంది పరిధికి మించి చేసే చికిత్స వికటిస్తున్నాయనీ, అలా అని అందరికి దానిని ఆపాదించలేమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమనీ, అందరి బాధలు వింటున్నదనీ, అందరి సమస్యలు పరిష్కరించేందుకే తామున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పులు చేస్తే ఆ అప్పులకు వాయిదాలు, వడ్డీలు కట్టుకుంటూ ఆర్థిక ఇబ్బందులున్నా మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో 14 వేల మందికి శిక్షణ ఇచ్చారనీ, వారికి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉందనీ, తమపై దాడులు జరుగుతున్నాయనీ, ప్రభుత్వ గుర్తింపు కార్డులివ్వాలని తదితర డిమాండ్లన్నింటిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్నదని తెలిపారు.

అనుభవజ్ఞులైన వైద్యుల సలహా మేరకే... : ప్రొఫెసర్ కోదండరాం

అనుభవజ్ఞులైన వైద్యుల సలహా మేరకే రాజశేఖర్ రెడ్డి సర్కార్ శిక్షణ, సర్టిఫికెట్లను ఇచ్చేందుకు నిర్ణయించిందని తెలిపారు. నిపుణులతో కమిటీ వేసి ఆ కమిటీ ఒకటిన్నర సంవత్సరాలు చర్చించి నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)తో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామనీ, మాట్లాడుకుందాం... పరిష్కరించుకుందాం అని సూచించారు.

దాక్టర్లు లేరు..గ్రామీణ వైద్యులను వద్దంటే ఎలా? : డాక్టర్ గోవిందరెడ్డి

దేశంలో వైద్యం అందించేందుకు 20 లక్షల మంది డాక్టర్లు అవసరమనీ, ప్రస్తుతం 13 లక్షల మంది మాత్రమే ఉన్నారని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ గోవింద రెడ్డి తెలిపారు. ఈ పరిస్థితిలో గ్రామీణ వైద్యులను వద్దంటే ఎలా అని ప్రశ్నించారు. గ్రామీణ వైద్యుల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లో వివిధ పేర్లతో ఉందని చెప్పారు. ఆర్ఎంపీల వ్యవస్థను సమాజం కోరుకుని తెచ్చుకుందని దాని చరిత్ర వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 10 వేల మందికి ఒక డాక్టర్ కూడా లేరని తెలిపారు. తాము చేసిన సర్వేలో గద్వాలలో 13 మండలాలుంటే 10 మండలాలకు ఒక్క డాక్టర్ లేరనీ, నల్లగొండలో 31 మండలాలుంటే కేవలం 7 మండలాల్లో మాత్రమే ఎంబీబీఎస్ డాక్టర్ ఉన్నారని చెప్పారు. గ్రామాలకు డాక్టర్లు రావడానికి మరో 20 ఏళ్ల సమయం పడుతుందని తెలిపారు. గ్రామీణ వైద్యులు కొంత మంది తమ పరిధిని దాటి చేసే వైద్యం వికటిస్తున్నదనీ, అలాంటి జరగకుండా గ్రామీణ వైద్యుల సంఘాలే అడ్డుకట్ట వేయాలని సూచించారు. రక్తదానం, నేత్రదానం కోసం ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. గతంలో గ్రామాల్లో టైఫాయిడ్, అపెండిసైటీస్ వంటివి వస్తే ప్రజలు మరణించే వారనీ, గ్రామీణ వైద్యుల వైద్యం వల్లే ఆ మరణాలు ఆగాయని కొనియాడారు.

మెడికల్ మాఫియాను వదిలి ఆర్ఎంపీలపై దాడులా? విజ్ఞాన దర్శినీ రమేశ్

మెడికల్ మాఫియాను వదిలేసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆర్ఎంపీలపై దాడులు చేస్తున్నదని విజ్ఞాన దర్శినీ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరాం దిష్టిబొమ్మను దహనం చేయడం కాదు... మెడికల్ మాఫియా దిష్టిబొమ్మను దహనం చేయాలని జూడాలకు సూచించారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి వేసిన కమిటీలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కూడా ఉన్నారని గుర్తుచేశారు. గ్రామాలకు ఎంబీబీఎస్ డాక్టర్లు వస్తే, ప్రజలు ఆర్ఎంపీల దగ్గరికి వెళతారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, వేదిక నాయకులు చొప్పరి శంకర్ ముదిరాజ్, చొల్లేటి బాల బ్రహ్మాచారి, ఎస్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా కొమరయ్యను గెలిపించుకుంటాం

- మద్దతు ప్రకటించిన టీఎస్సీఎస్టీయూఎస్, టీటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్- మెదక్ బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించుకుంటామనీ, ఆయనకు తమ మద్దతు ఉంటుందని టీఎస్సీఎస్టీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబు, టీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మణిపాల్ రెడ్డి, పోలంపెల్లి ఆదర్శన్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ టీచర్లకు క్యాడర్ సంఖ్యతో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇప్పించడం, ఎస్సీల రిజర్వేషన్లు జనాభా ఆధారంగా 18 శాతం పెంచేందుకు కృషి చేయడం, అన్ని క్యాడర్లలో ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10 శాతం ఉండేలా బ్యాక్ లాగ్ ప్రమోషన్లు ఇప్పించడం, ఎమ్మెల్సీ కోటా నిధులను ఎక్కువగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వెచ్చించడం, జీవో నం.342 ప్రకారం పీజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ లాంటి ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తాం అని కొమురయ్య ఇచ్చిన హామీ మేరకు మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ టీచర్లందరూ మల్క కొమరయ్య విజయానికి కృషిచేయాలని కోరారు. కొమరయ్య గెలుపు కోసం నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని టీటీయూ జిల్లా, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు, కార్యకర్తలంతా కృషిచేయాలని విన్నవించారు.

మరో ఐదు జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

- రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర నాయకత్వం మరో ఐదు జిల్లాల అధ్యక్షులను మంగళవారం ప్రకటించింది. ఎట్టకేలకు ఒక మహిళకు చోటు కల్పించింది. దీంతో 38 జిల్లాల కమిటీలకుగానూ 28 జిల్లాలకు అధ్యక్షుల నియామకం పూర్తయింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. నారాయణపేట - కె.సత్యయాదవ్, సూర్యాపేట-శ్రీలతారెడ్డి, నిర్మల్-రితేశ్‌రాథోడ్, సిద్దిపేట-బైరి శంకర్ ముదిరాజ్, రాజన్నసిరిసిల్ల-ఆర్.గోపి ముదిరాజ్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆ ఐదు జిల్లాల నుంచి 19 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు.

కొత్త కార్డులు.. కోటి తిప్పలు

- చేర్పులూ మార్పుల్లోనూ చిక్కులు
- 'ఆధార్ నంబర్'తో అప్లికేషన్ నిర్ధారణ

ఆన్‌లైన్ ప్రక్రియలో ఇక్కట్లు | మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు



'కోడ్' ఉన్నచోట తప్పని ఎదురు చూపులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుకు కోటి తిప్పలు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. రేషన్‌కార్డుల దరఖాస్తుదారులు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో అప్లికేషన్‌తో పాటు కుటుంబ సభ్యులందరి ఆధార్‌కార్డులు, చిరునామాకు సంబంధించి ఓటర్ ఐడీ లేదంటే కరెంట్ బిల్లు, ఇంటి పన్ను వంటి ధ్రువీకరణల జిరాక్స్‌లు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు పొందు పరుస్తున్నారు. ఇదంతా చేసి సబ్మిట్ చేశాక సర్వర్ డౌన్ లేదంటే ఆన్‌లైన్ ఎర్రర్.. ఇలాంటివేవో వస్తూ గంటల తరబడి ప్రక్రియ పూర్తి కావటం లేదు.

రూ.50 చార్జీతో ఆన్‌లైన్ చేయాల్సిన అప్లికేషన్‌కు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు రకరకాల కారణాలు చెబుతూ కనీసం రూ.100కు తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. జిరాక్స్‌ల పేరుతో ఒక్కో కాపీకి రూ.3 చొప్పున, ప్రింట్ ఇస్తే రూ.10-25 చొప్పున దండుకుంటున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఒక్కోసారి వెంటనే ఆన్‌లైన్ అవుతున్నా...కొన్నిసార్లు గంటల తరబడి వేచివుండాల్సి వస్తోందని, చేసేది లేక పూర్తి చేసిన హార్డ్‌కాపీ దరఖాస్తును మీసేవలో ఇచ్చి వెళ్తున్నారు. అవి ఆన్‌లైన్ అయ్యాక మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందని చెబుతున్నా ఏమీ రాకపోవడంతో పదే పదే మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తుందని దరఖాస్తుదారులు చింతిస్తున్నారు.

ఆధార్ నంబర్‌తో అప్లికేషన్‌కు అర్హత నిర్ధారణ

మీసేవ కేంద్రాల్లో అప్లికెంట్ పేరు, ఆధార్ నంబర్ ఇవ్వగానే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తేనే అప్లికేషన్ తీసుకుంటున్నారు. గతంలో ఫ్యామిలీ మెంబర్‌గా తెలంగాణ ప్రభుత్వ రేషన్‌కార్డులో నమోదై ఉంటే కొత్తకార్డు దరఖాస్తును ఒక్కోసారి ఆన్‌లైన్ ఆమోదించట్లేదు. కారణమేంటో మీసేవ కేంద్రాల నిర్వాహకులు చెప్పట్లేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే అక్కడా సరైన సమాధానం రావట్లేదు. వివిధ ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో లక్షలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం పదేండ్ల కిందట కొద్దిమందికి కార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుత ప్రభుత్వం నిరంతర ప్రక్రియ పేరుతో ఇబ్బందులు పెడుతుండటంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజాపాలనలో దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ ప్రక్రియలో దొర్లిన తప్పుల కారణంగా జనవరి 26 తర్వాత ప్రకటించిన అర్హుల జాబితాలో అనేక లోపాలు వెలుగుచూశాయి. మళ్లీ మీసేవల్లో దరఖాస్తు చేసుకోవాలనటం.. ఆన్‌లైన్ ఇక్కట్లు ఎదురవుతుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చేర్పులు.. మార్పుల్లోనూ సమస్యలు

పాత కార్డుల్లోని ఫ్యామిలీ మెంబర్ల చేర్పులు మార్పులకూ ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కానీ వాటి ఆన్‌లైన్ విషయంలోనూ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఈ పదేండ్లలో వివాహాలై అనేక మంది వేర్వేరు కార్డుల్లో ఫ్యామిలీ మెంబర్లుగా ఉన్నారు. వారిని ముందుగా వాటిలో నుంచి తొలగించిన తర్వాతే కొత్త కార్డు దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఆమోదించే పరిస్థితి ఉంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే మళ్లీ అదో తతంగం. రాష్ట్రంలో ఇప్పటికే 89.96 లక్షల మందికి రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటిలో 2.1 కోట్ల మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా మరో పది లక్షల మందికి పైగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అంతా సవ్యంగా పూర్తయితే రాష్ట్రంలో కోటి మందికిపైగా రేషన్‌కార్డుదారులు ఉండే అవకాశం ఉంది.

అర్హుల ఎంపికపై వ్యతిరేకత

ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం ఖమ్మం జిల్లాలో 51,558 మంది, భద్రాద్రి కొత్తగూడెంలో 42,644 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ గ్రామసభల్లో ఖమ్మంలో 17,088, భద్రాద్రిలో 38,879 దరఖాస్తులను మాత్రమే ఎంపిక చేయడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. వివిధ గ్రామాల్లో అధికారులు వెల్లడించిన జాబితాపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చాలాచోట్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండగా గ్రామ, మండల స్థాయిలో అధికారులతో సత్సంబంధాలున్న నేతల సూచన మేరకే ఎంపికలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాబితాలో పేర్లు రానివారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మళ్లీ అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారు. గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అర్హులు ఎవరనేది తేల్చనున్నారు. రాష్ట్రంలో లక్ష రేషన్ స్మార్ట్‌కార్డుల జారీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో ముందుగా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ఉన్న చోట లబ్ధిదారులు మరికొంత కాలం వేచిచూడక తప్పని స్థితి నెలకొంది. రేషన్‌కార్డులపై నెలకొన్న సమస్యలపై సివిల్ సప్లయ్ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఎంపికలు జరిగాయని చెబుతుండటం గమనార్హం.

వర్సిటీల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- సమస్యలు పరిష్కరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) సందర్శించిన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్లు అక్కడి సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లను సుదీర్ఘకాలం కొనసాగిస్తున్నారని వివరించారు. నిధుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ల్యాబ్ పరికరాలు, హాస్టళ్లు, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల హాస్టళ్లలో శ్లాబ్ పెచ్చులు ఊడిపడి విద్యార్థులు గాయపడ్డారని వివరించారు.

వందేండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపులో వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినిలపై వేధింపులు నిరోధించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఒక్కటే కాకుండా ప్రతి వర్సిటీని స్కిల్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా పరిశీలించి వర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

డిమాండ్లు :

- విశ్వవిద్యాలయాలకు రూ.ఐదు వేల కోట్లు, ప్రత్యేకంగా ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.
- వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.
- నూతన భవనాలను నిర్మించాలి. మోడ్రన్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి.
- ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికి నెలకు రూ.25 వేలు ఫెలోషిప్‌లను అందించాలి.
- అన్ని వర్సిటీలకూ రీసెర్చ్ గ్రాంట్లను ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి.
- కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్ల వేతనాలను పెంచాలి.
- వర్సిటీల్లో విద్యార్థి సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి.

రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంఘం (టీజీడీపీఎస్) సలహా కమిటీ ఏర్పాటు

- సభ్యులుగా 9 మంది, చైర్మెన్‌గా డిప్యూటీ సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) సలహా కమిటీని తొమ్మిది మందితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ కమిటీకి చైర్మెన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. సభ్యులుగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ శాంతసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖదేవ్ థోరట్, నిఖిల్ దేయ్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ భూక్యా, ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి ఉండనున్నారు. దీనికి సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 2ని విడుదల చేసింది.

రాజులు వద్దు..

"నో కింగ్స్" థీమ్ 50501 ఉద్యమాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిరసనకారులు గళం విప్పుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా తూర్పు తీర నగరాల్లో "ప్రెసిడెంట్స్ డే నాడు రాజులు వద్దు" అని నినాదాలతో ప్రదర్శనలు నిర్వహించారు. వేగంగా మారుతున్న ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అమలును బలోపేతం చేసే బిల్లును వ్యతిరేకిస్తూ ఫ్లోరిడా, కాలిఫోర్నియా, డల్లాస్ సహా పలు నగరాల్లో ప్రజలు ఆందోళనకు దిగారు. లాస్ ఏంజిల్స్‌లో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ప్రదర్శనకారులు పోస్టర్లు పట్టుకుని కవాతు చేశారు.

"50 నిరసనలు, 50 రాష్ట్రాలు, ఒక రోజు" అంటే "50501".. రెండోసారి గద్దెనెక్కిన ట్రంప్ పరిపాలన, విధానాలు, చర్యలను నిరసించేలా ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. బోస్టన్‌లోని స్టేట్‌హౌస్ నుంచి సిటీ హాల్ వరకు మంచులో కవాతు చేస్తూ "ఎలన్ మస్క్ వెళ్ళిపోవాలి" అంటూ నినాదాలు చేశారు.. గడ్డకట్టే స్థాయి కంటే తక్కువ మంచులోనూ గళమెత్తారు.బోస్టన్‌లో విప్లవాత్మక యుద్ధ శైలి దుస్తులు ధరించి, "ఇది తిరుగుబాటు" .. "ట్రంప్‌కు పిరికివాళ్లు నమస్కరిస్తారు, దేశభక్తులు ఎదురొడ్డి నిలబడతారు" వంటి ప్లకార్డులతో నినదించారు. ర్యాలీలో బోస్టన్ ఇంజనీర్ ఎమిలీ మానింగ్, తన ఇద్దరు టీనేజ్ కుమారులతో హాజరయ్యారు. "అమెరికన్ విలువలు ధనవంతుల విలువలు లేదా పరిమిత కొద్దిమంది ధనవంతులు కాదు."అని మానింగ్ చెప్పారు.దేశ రాజధానిలో వందలాది మందిని ఆకర్షించిన ర్యాలీలో ఒక బోర్డు "ట్రంప్‌ను మస్క్‌ను గద్దె దించు" అని ప్రదర్శించారు.

విద్యార్థినిపై ఒత్తిడి తెచ్చి.. ఫిర్యాదు లెటర్ వెనక్కి?

- లెక్చరర్ మందలించాడన్న కోపంతో తప్పుగా చెప్పిందంట
- సీసీ కెమెరాల ఆధారంగానే బాలిక ఘటనపై విచారణ
- ఏమీ లేదని తేల్చిన పోలీసులు
- అధ్యాపకుడితో బాలిక, తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పించిన ప్రిన్సిపాల్?

నవతెలంగాణ-సిటీబ్యూరో/కంటోన్మెంట్

సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని ఓ కళాశాలలో లెక్చరర్ వేధింపుల విషయంలో బాధిత బాలికపై ఒత్తిడి తెచ్చి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేసినట్టు తెలిసింది. ఘటనపై విద్యార్థిని తల్లి, బంధువులు కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన అంశాలతో కూడిన కథనాన్ని సోమవారం 'నవతెలంగాణ'లో ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే, విద్యార్థినిపై అధ్యాపకుని అసభ్య ప్రవర్తనపై తల్లిదండ్రుల ఫిర్యాదు లెటర్‌ను వెనక్కు తీసుకోవాలని ప్రిన్సిపాల్, సిబ్బంది ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. విద్యార్థిని ఇచ్చిన కంప్లైంట్‌పై సీసీ కెమెరాల్లో ఆధారాలు లేవని ఆ అధ్యాపకుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. సదరు విద్యార్థిని ఆ అధ్యాపకుని వల్ల తనకు వేధింపులు ఉన్నాయని రాతపూర్వకంగా తల్లిదండ్రులు, బంధువులతో వచ్చి ఫిర్యాదు లెటర్ ఇస్తే దాని ఆధారంగా విచారణ చేయకుండా.. సీసీ కెమెరాల రికార్డులో ఆధారాలు లేవని చెప్పి విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం ప్రిన్సిపాల్ చేస్తున్నట్టు తెలుస్తోంది. పైగా, కంప్లైంట్ ఇచ్చిన తల్లిదండ్రులకు, బాధిత విద్యార్థినికి సదరు అధ్యాపకుడితో క్షమాపణలు చెప్పించి రాజీ కుదిర్చినట్టు సమాచారం. అంతేగాక మరోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని బాలిక పేరెంట్స్‌కు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

కళాశాలకు స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులు

ఇదిలావుంటే 'నవతెలంగాణ'లో వచ్చిన వార్తపై స్పందించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, మారేడుపల్లి సివిల్ పోలీసులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. సీసీ ఫుటేజ్‌లను గంటకుపైగా పరిశీలించారని, మారేడుపల్లి మహిళా ఎస్ఐ సౌందర్య.. విద్యార్థినిని వ్యక్తిగతంగా విచారణ చేశారని కాలేజీ ప్రిన్సిపాల్ తెలిపారు. సదరు విద్యార్థిని విషయంలో ఏం జరిగిందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలలో ఎలాంటి ఘటనా జరగలేదని, విద్యార్థినిని లెక్చరర్ మందలించారని, ఆ కోపంతో తల్లిదండ్రులకు తప్పుగా చెప్పిందని, దాంతో వారు ఆందోళనకు గురై కాలేజీలో సీసీ కెమెరాలు చూడటానికి వచ్చారని తెలిపారు. సీసీ కెమెరాలో అలాంటిదేమీ లేకపోవడంతో బాలికదే తప్పు అని తేలిందని చెప్పారు.

సైబర్‌సేఫ్ స్టేట్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

రేకెత్తించే చర్యలు కూడా జరుగుతున్నాయని ఉదహరించారు. ఇలాంటి సైబర్ నేరాల కట్టడి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని భరోసా ఇచ్చారు. దీనికోసం సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, నిపుణులు, ఐటీ సంస్థలతో కలిసి పనిచేయడానికి అవసరమైన అన్ని వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను ఆర్థిక, వ్యాపార భద్రతకు కేంద్రంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. సైబర్ నేరాల కట్టడిలో భాగంగా 24 గంటలూ పనిచేసే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ క్రైం నుంచి ప్రజల్ని రక్షించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని గుర్తుచేశారు. గత ఏడాది ఏడు కొత్త సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లను ప్రారంభించామని తెలిపారు. నేరం జరిగిన తర్వాత నేరస్తులను పట్టుకోవడం కాదనీ, నేరం జరగకుండా నిరోధించేలా వ్యవస్థల రూపకల్పన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సైబర్ నేరాల ప్రమాదం, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రి,పవర్ గ్రిడ్‌లపై కూడా సైబర్ దాడులు జరిగాయని ఉదహరించారు. కానీ సమర్థవంతంగా భారతీయ టెకీలు దాన్ని నిలువరించగలిగారని చెప్పారు. గణాంకాల ప్రకారం దేశంలో 15వేల సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయనీ, వివిధ కారణాలతో నమోదు కాని కేసులు దీనికి రెండింతలు ఉంటాయని తెలిపారు. డేటా చౌర్యాన్ని నిరోధించడమే అతిపెద్ద సవాలుగా ఉందన్నారు. దానికోసమే దావోస్ పర్యటనలో గూగుల్‌తో 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నామని వివరించారు. ప్రజలకు డిజిటల్ రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికాగోయల్ స్వాగతోపన్యాసం చేశారు.

గోయాస్‌తో ఒప్పందం

బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్ రాష్ట్రంలోని టీహబ్‌తో కలిసి పనిచేసేందుకు అవగాహన ఒప్పందం చేసుకుంది. హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టీహబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్‌కు చెందిన గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్స్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్‌కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో ఈ సంస్థలు కలిసి పనిచేస్తాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

- ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-వరంగల్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2025 ఫిబ్రవరి 27న జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేశానన్నారు. యూఎస్ పీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యోగ, ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు వేసవి సెలవులు సహా 12 నెలలు జీతం వచ్చేలా చేయడంలో కృషి చేశానని చెప్పారు. తెలంగాణ మొదటి పీఆర్‌సీని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడంలో, 180 రోజుల ప్రసూతి సెలవులను సాధించడంలోనూ అద్వితీయమైన కృషి చేశానన్నారు. బేసిక్ పే సాధన కోసం పని చేస్తున్నామన్నారు. పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి పని చేశానని, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలకు ఏర్పడిన న్యాయమైన ఆటంకాలను అధిగమించి బదిలీలు జరిగేలా ఉత్తర్వులు సాధించానని తెలిపారు. ప్రమోషన్లు, 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు కోసం కృషి చేశానన్నారు. ఎయిడెడ్ టీచర్లకు సకాలంలో వేతనాల మంజూరు కోసం నిరంతరం పాటుపడ్డానన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, ప్రమోషన్లు జరిపించడంతోపాటు పండిట్, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, సీఆర్‌టీ వేతనాల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించినట్టు తెలిపారు. పాఠశాల విద్యారంగంలో నిలిచిన ఉపాధ్యాయ ప్రమోషన్స్, బదిలీలు జరగడానికి తన వంతు కృషి చేశానని వివరించారు. టెట్ వివాదం పరిష్కారానికి ఢిల్లీలో ఎన్సీటీఈ అధికారులతో చర్చించి మార్గం సుగమం చేశానన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషించానన్నారు.

డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల బదిలీల షెడ్యూల్ జారీ చేయించానన్నారు. కాకతీయ, మహాత్మాగాంధీ యూనివర్సిటీలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ సమయంలో ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఉత్తర్వులు సాధించానన్నారు. ప్రయివేట్ విశ్వవిద్యాలయాల బిల్లును వ్యతిరేకించి ఏకైక ఎమ్మెల్సీగా నిలిచానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన భవనాలు, ప్రహరీల నిర్మాణానికి కేటాయించడమే కాకుండా వాటిని సకాలంలో వినియోగించినట్టు తెలిపారు. పేద ప్రజలకు వైద్య సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించానని వివరించారు. తన వేతన భత్యాలను కూడా ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసి చట్టసభల సభ్యులకు రోల్ మోడల్‌గా నిలిచానన్నారు. అంగన్‌వాడీ, ఆశ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. వారి పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. మరోసారి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మరిన్ని సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం పాటుపడటమే కాకుండా ఉపాధ్యాయ, అధ్యాపకుల పక్షాన నిలుస్తానని హామీ ఇచ్చారు.



ప్రపంచ క్రికెట్ ఐసీసీ ఈవెంట్లతో కళకళలాడుతోంది. ఇటీవల 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 ప్రపంచకప్‌లు అభిమానులను అలరించగా.. ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ దూసుకొచ్చింది. ఏడేండ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ మెగా టోర్నమెంట్‌కు డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్ ఆతిథ్యం అందిస్తుండగా.. రన్నరప్ టీమ్ ఇండియా తన మ్యాచులను దుబాయ్‌లో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ప్రపంచ టాప్-8 జట్లు పోటీపడుతున్న ఈ సమరంలో టైటిల్ కోసం చాంపియన్లు తలపడుతున్నాయి. పాకిస్థాన్, న్యూజిలాండ్ ఆరంభ మ్యాచ్‌తో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నేటి నుంచి షురూ కానుంది.

చాంపియన్ల వేట

- నేటి నుంచి చాంపియన్స్ ట్రోఫీ
- ఆరంభ మ్యాచ్‌లో పాక్, కివీస్ ఢీ

నవతెలంగాణ-కరాచి

ఎనిమిది మేటి జట్లు

ఓ ఐసీసీ టోర్నమెంట్ ముంగిట అగ్ర జట్లు ఆ ఫార్మాట్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవటం బహుశా ఇదే ప్రథమం. చాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్‌లో జరుగుతుండగా.. భారత్, ఇంగ్లాండ్ సహా పలు దేశాలు టీ20 ఫార్మాట్‌లోనే ఎక్కువగా మ్యాచులు ఆడాయి. 50 ఓవర్ల ఆటకు ఆశించిన ప్రాధాన్యత దక్కలేదు. అయినా, చాంపియన్స్ ట్రోఫీ వేటలో సమర శంఖం పూరించేందుకు మేటి ఎనిమిది జట్లు సిద్ధమయ్యాయి. గత ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచిన జట్లు మాత్రమే అర్హత సాధించటంతో శ్రీలంక, వెస్టిండీస్ వంటి జట్లు ఈ టోర్నీకి దూరం అయ్యాయి. 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనలిస్టులు భారత్, పాకిస్థాన్ సహా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, అఫ్గనిస్థాన్‌లు తాజా టోర్నీలో పోటీపడుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశ, నాకౌట్ దశలో సాగనుంది. ఎనిమిది జట్లను తొలుత రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లు గ్రూప్-ఏలో ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, అఫ్గనిస్థాన్‌లు గ్రూప్-బిలో ఉన్నాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఇతర మూడు జట్లతో ఓసారి తలపడుతుంది. టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

పాకిస్థాన్‌కు సవాల్

పాకిస్థాన్‌లో పండుగ వాతావరణం మొదలైంది. 1996 ఐసీసీ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత పాక్‌లో మళ్లీ ఓ ఐసీసీ టోర్నమెంట్ నిర్వహించటం ఇదే ప్రథమం. దశాబ్ద కాలం పాటు స్వదేశంలో ద్వైపాక్షిక క్రికెట్‌కు దూరమైన పాకిస్థాన్ 29 ఏండ్ల నిరీక్షణ తర్వాత మెగా టోర్నమెంట్‌కు వేదికగా నిలిచింది. 1996 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్, 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఓ ఆసక్తికర సంబంధం ఉంది. 1992 ప్రపంచకప్ విజేతగా నిలిచిన పాకిస్థాన్.. డిఫెండింగ్ చాంపియన్‌గా వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వగా.. తాజాగా 2017లో చాంపియన్స్ ట్రోఫీ సాధించిన పాకిస్థాన్ మరోసారి డిఫెండింగ్ చాంపియన్ హోదాలో మెగా ఈవెంట్‌కు వేదికైంది. భద్రత ఏర్పాట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన సవాల్. ప్రణాళిక ప్రకారంగా మూడు స్టేడియాల్లోనే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. రావల్పిండి, కరాచి, లాహోర్‌లో స్టేడియాలను ఆధునీకరించారు. క్రికెట్‌ను పాకిస్థాన్‌లో విపరీతంగా అభిమానిస్తారు. మూడు దశాబ్దాల తర్వాత ప్రపంచ క్రికెట్ పాక్ గడ్డపై రావటంతో అభిమానుల్లో హంగామా మొదలైంది. పొరుగు దేశం, దాయాది భారత్ తన మ్యాచులు దుబాయ్‌లో ఆడటం పాకిస్థాన్‌కు నిరాశే మిగిల్చింది.

కొత్త చాంపియన్‌ను చూస్తామా?

ఐసీసీ ఈవెంట్లలో కొత్త చాంపియన్ అనగానే తొలుత వినిపించే మాట దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్. ప్రపంచకప్‌లలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌కు దారుణ రికార్డుంది. కానీ చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్లు మాజీ చాంపియన్లు. 1998 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 2000 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌పై న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో పైచేయి సాధించింది. 1998లో బంగ్లాదేశ్, 2000లో కెన్యా చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం అందించాయి. పాకిస్థాన్ (2017), ఆస్ట్రేలియా (2006, 2009), భారత్ (2002, 2013) చాంపియన్స్ ట్రోఫీ సాధించిన జట్లు. మాజీ చాంపియన్లు శ్రీలంక (2002), వెస్టిండీస్ (2004)లు 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించలేదు.

మూడో టైటిల్ వేటలో భారత్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా మంచి రికార్డుంది. 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్ ఇండియా టైటిల్ ఫేవరేట్. కానీ ఫైనల్లో పాకిస్థాన్ అనూహ్యంగా రాణించింది. అప్పటివరకు సూపర్‌గా ఆడిన కోహ్లిసేన టైటిల్‌కు అడుగు దూరంలోనే నిలిచింది. 2000 చాంపియన్స్ ట్రోఫీలోనూ భారత్ పరాజయం పాలైంది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌కు తలొగ్గింది. 2013 చాంపియన్స్ ట్రోఫీని టీమ్ ఇండియా ధోని సారథ్యంలో దక్కించుకుంది. 2002 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు వరుసగా రెండు రోజులు వర్షం అంతరాయం కలిగించటంతో శ్రీలంకతో కలిసి భారత్ టైటిల్‌ను పంచుకుంది.

ముందే ముగిసిన ఆరంభ వేడుకలు

ఐసీసీ టోర్నమెంట్లకు ఆరంభ వేడుకలు ప్రత్యేకంగా నిలుస్తాయి. చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తోన్న పాకిస్థాన్ టోర్నమెంట్ ఆరంభానికి మూడు రోజులు ముందే ఓపెనింగ్ సెర్మొనీ చేసేసింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియాన్ని అట్టహాసంగా ఆరంభించిన పీసీబీ.. లాహోర్ కోట వద్ద ఆరంభ వేడుకలు చేసింది. 2017 చాంపియన్స్ ట్రోఫీ గెలుపు గుర్రాలు ఆరంభ వేడుకలకు హాజరయ్యారు. ఐసీసీ ఈవెంట్లకు సహజంగా కనిపించే మరో సంప్రదాయం సైతం ఈసారి కనుమరుగైంది. టోర్నీలో పోటీపడుతున్న అన్ని జట్ల కెప్టెన్లు ట్రోఫీతో గ్రూప్ ఫోటో దిగుతారు. కెప్టెన్లు అందరూ మీడియా ముందుకొచ్చి మాట్లాడతారు. కానీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి ఈ కార్యక్రమాలు ఏమీ షెడ్యూల్ చేయలేదు.

ముంబయి విలవిల

తొలి ఇన్నింగ్స్‌లో 188/7

నాగ్‌పూర్ : విదర్భతో రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో 41 సార్లు చాంపియన్ ముంబయి ఎదురీదుతోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ పార్థ్ రాజేశ్ (3/16) ఒకే ఓవర్లో మూడు వికెట్ల మాయజాలం చేయటంతో 113/2తో పటిష్టంగా సాగిన ముంబయి ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఐదు పరుగుల వ్యవధిలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 118/6తో విలవిల్లాడింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (67 నాటౌట్, 171 బంతుల్లో 6 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. సిద్దేశ్ లాడ్ (35), ఆయుశ్ (9) నిరాశపరిచారు. అజింక్య రహానె (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివం దూబె (0)లు రాజేశ్ ఓవర్లో మాయకు చిత్తయ్యారు. శామ్స్ ములాని (4) విఫలమవగా.. శార్దుల్ ఠాకూర్ (37) వేగంగా పరుగులు రాబట్టాడు. ఆకాశ్ ఆనంద్‌తో కలిసి



తనుశ్ కొటియన్ (5 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచాడు. రెండో రోజు ఆట ముగిసేసరికి ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 188/7 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది. అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 107.5 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌటైంది. శివం దూబె (5/49) ఐదు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు.

అజహరుద్దీన్ సెంచరీ

కేరళ, గుజరాత్ రంజీ సెమీస్

అహ్మదాబాద్ : మందకోడిగా సాగుతున్న కేరళ, గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మహ్మద్ అజహరుద్దీన్ (149 నాటౌట్, 303 బంతుల్లో 17 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. రెండు రోజుల ఆటలో 177 ఓవర్లు వేసినా గుజరాత్ బౌలర్లు కేరళను ఆలౌట్ చేయలేదు. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 418/7 పరుగులు చేసింది. అజహరుద్దీన్‌కి తోడు సల్మాన్ నిజార్ (52, 202 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), సచిన్ బేబి (69, 195 బంతుల్లో 8 ఫోర్లు) అర్థ సెంచరీలతో రాణించారు. గుజరాత్ బౌలర్లలో అర్జాన్ (3/64) మూడు వికెట్లు పడగొట్టగా.. రవి బిష్ణోయ్ (1/74), విశాల్ (1/57), జడేజా (1/58) తలా ఓ వికెట్



పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆదిత్య (10 నాటౌట్)తో కలిసి అజహరుద్దీన్ అజేయంగా ఆడుతున్నాడు.

ఇక కూర్పు తలనొప్పి!

దుబాయ్ : దుబాయ్‌లో వరుసగా మూడు రోజులుగా కఠోర సాధన చేస్తున్న టీమ్ ఇండియా బుధవారం తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. దుబాయ్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో భారత్ తొలి మ్యాచ్‌లో ఆడనుంది. బ్యాటింగ్ లైనప్‌లో యశస్వి జైస్వాల్‌ను తప్పించటంతో సెలక్షన్ తిప్పలు తప్పాయి. బ్యాటింగ్ ఆర్డర్‌లో వికెట్ కీపర్ కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ మాత్రమే తుది జట్టులో చోటు కోసం పోటీపడుతున్నారు. రోహిత్, గిల్, కోహ్లి, శ్రేయస్ సహా హార్దిక్, జడేజా, అక్షర్‌లకు తుది



జట్టులో చోటు ఖాయం. పేసర్లలో మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్, హర్షిత్ రానాలో ఒకరు బెంచ్‌కు పరిమితం కానున్నారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ నడుమ గట్టి పోటీ నెలకొంది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో వరుణ్‌కు అవకాశం దక్కినా.. చైనామన్ కుల్దీప్‌కు దుబాయ్‌లో చాన్స్ ఇస్తారనే అంచనాలు ఉన్నాయి. కుల్దీప్, వరుణ్‌లు ఇద్దరూ మ్యాచ్‌ను మలుపుతిప్పగల మాయగాళ్లు కావటంతో రోహిత్, గంభీర్‌కు సెలక్షన్ కఠిన సవాలే.

జానపద కళాకారులకు శివరాత్రి ప్రదర్శనలు ఇప్పించాలి

- జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ అధ్యక్షులు మురళీధర్ దేశ్ పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - ముషీరాబాద్

ఉపాధి కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా తమ కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలని జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ అధ్యక్షులు మురళీధర్ దేశ్‌పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. 15 సంవత్సరాల కిందట డీపీఆర్ఓ కింద కళాకారులకు జీవనభృతి కల్పించారని, కానీ తెలంగాణ వచ్చినప్పటి నుంచి జీవనభృతి లేదని అన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డు, పింఛన్లు, ఇండ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రవింద్రభారతి అగ్రహారంగా మారిందన్నారు. తక్షణమే తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యక్షగాన జానపద కళాకారులపై సమగ్ర సర్వే చేయాలని, రవింద్రభారతిలో జానపద కళాకారుల ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు రూ.500 కోట్లు కేటాయించాలని, అకాడమీకి ఛైర్మెన్‌ను నియమించాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని, కళాకారులంతా రోడ్డెక్కి ఆందోళనకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు ఛైర్మెన్ వి.రామకృష్ణారెడ్డి, జానపద మీడియా ఇన్‌చార్జి సీహెచ్ సుధాకర్ బ్రాహ్మణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసన

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

నవతెలంగాణ -నారాయణపేట /విలేకరులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను నిరసిస్తూ వామ పక్షాల నేతలు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల మంగళవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే బడ్జెట్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్రాములు విమర్శించారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర నమూనా బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రధాని మోడీ రైతు బడ్జెట్ అంటూనే రైతు రుణమాఫీకి తగిన బడ్జెట్ కేటాయించ లేదన్నారు. విద్యుత్ సంస్కరణలతో వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం కుదేలవుతాయన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించారని, కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్న డిమాండ్‌ను పట్టించుకో లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామి రెడ్డి, గోపాల్, మహేష్ కుమార్, కాశప్ప, శ్రీనివాస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు నర్సింహా, ప్రశాంత్, నరాయణ పాల్గొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో గల నేతాజీ చౌరస్తాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేశారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో పేదలు, కార్మిక, కర్షకులకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రంపై వివక్ష



చూపారని వామపక్ష పార్టీల నాయకులు కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, అదానీ, అంబానీలకు అనుకూలంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాకు నిధులు తేలేకపోయిన స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి నిధులు తెస్తారా లేక తక్షణమే రాజీనామా చేస్తారా ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు కె.రాజన్న, ఎస్ఎన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. రైతన్నకి పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, రుణాలన్నింటినీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన రేంజర్, బీట్ ఆఫీసర్

నవతెలంగాణ-ఇల్లందు

ఆయనో గెజిటెడ్ ఆఫీసర్, నెలకు వేతనం లక్ష. అయినప్పటికీ అధికారం చేతిలో ఉంది కదా అని లంచాలకు మరిగారు. ఇటు గిరిజనులకు, అటు ప్రభుత్వానికి సేవ చేయాల్సింది పోయి డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని 24 ఏరియా మైనార్టీ ప్రిన్సిపాల్ కృష్ణ రూ.2000 తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

తాజాగా మంగళవారం మండలంలోని కొమరారం రేంజ్ పరిధిలో రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అటవీ భూమి నుంచి మట్టి తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.30వేలు



డిమాండ్ చేశారు. గతంలోనే ఇదే పనికి రూ.20 వేలు లంచం పుచ్చుకున్నట్టు తెలిసింది. మళ్లీ గ్రావెల్ తీస్తుండగా అటవీ శాఖ సిబ్బంది వచ్చి జేసీబీ, ట్రాక్టర్లు పట్టుకున్నారు. మరోసారి రూ.15వేలు మామూలు ఇచ్చినట్టు తెలిసింది. మళ్లీ తాజాగా రూ.50 వేలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకుని.. వేధింపులు భరించలేక విసిగిపోయిన గుత్తేదారు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో కొమరారం అటవీ రేంజ్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్‌ను పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థినిపై లైంగికదాడి

'బేటీ బచావో' ప్రసంగానికి ప్రశంస

ఆ తర్వాత 11రోజులకు దారుణం

దేశానికే మోడలైన గుజరాత్‌లో దారుణం

అహ్మదాబాద్/పలన్పూర్ : గుజరాత్‌లోని సబర్కాంత లో గల గ్రామ పాఠశాలలో జనవరి 26న జరిగిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థిని చేసిన ప్రసంగానికి అందరూ మారుమోగేలా చప్పట్లు కొట్టారు. కానీ అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడే తనపై లైంగికదాడికి పాల్పడ్డాడుజ. దేశానికే మోడల్ గుజరాత్ అంటూ ప్రధాని మోడీ ఓ పక్క గొప్పలు చెబుతుండగా ..అక్కడ ఎవరికీ భద్రతలేదని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అసలేం జరిగింది..?

సబర్కాంతలోని ఓ పాఠశాలలో చదువుతున్న పదిహేనేండ్ల బాలిక "ఆడపిల్లలను రక్షించడం, విద్య అంశాల ప్రాముఖ్యత"పై గణతంత్ర దినోత్సవం రోజున ఉత్సాహభరితమైన వాతావరణంలో అద్భుతమైన ప్రసంగం చేసింది. దీంతో ఆమెను ఎంతోమంది మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ బాలిక "నేను పోలీసు అధికారి కావాలని అనుకుంటున్నాను. సైన్స్ , గణితం నాకు ఇష్టమైన సబ్జెక్టులు. నా బోర్డు ఫలితాల ఆధారంగా నేను నా విద్యా ప్రవాహాన్ని ఎంచుకుంటాను" అని చెప్పింది. ఈ కార్యక్రమం జరిగిన 11 రోజులకు ఫిబ్రవరి 7న అదే పాఠశాల ఉపాధ్యాయుడు తన పుట్టినరోజు వేడుకల పేరుతో ఆ బాలికను హెటల్‌కు రప్పించి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చెప్పిన మాట వినకపోతే బోర్డు పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించాడనే ఆరోపణలూ ఉన్నాయి.

కుటుంబంలో ఎవరెవరు ఉన్నారంటే..

ఆ బాధిత బాలిక తన తండ్రి, సోదరితో కలిసి ఉంటోంది. వారు వ్యవసాయ కార్మికులు. ఈ దారుణం జరిగిన సంగతి తెలిశాక ఆమెను ఓదార్చేందుకు ప్రతిరోజూ జనం, బంధువులు వచ్చేవారు. అయితే 'ఆమె చదువుకు అంతరాయం కలిగించడం మాకు ఇష్టం లేదు. "ఆమె ధైర్యం , ధృఢ సంకల్పం పట్ల మేము చాలా గర్వపడుతున్నాం.

ముందున్న సవాళ్లతో సంబంధం లేకుండా, మేము ఆమెకు ప్రతి అడుగులోనూ మద్దతు ఇస్తాం" అని ఆమె మామ అన్నారు.

"మా భవిష్యత్ తరం వ్యవసాయ కార్మికులుగా కష్టపడి పనిచేయాలని మేము కోరుకోవడం లేదు. మేము భూస్వాములం కాదు. చదువు



ప్రాముఖ్యతను గ్రహించాం" అని ఆ బాలిక మామ నొక్కి చెప్పారు. అయితే ఆ చిన్నారి ధైర్యానికి వచ్చిన ప్రశంసలు ఆ కుటుంబానికి మాత్రమే పరిమితం కాదు. ఆ అమ్మాయి చాలా తక్కువ సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు తడబడే లెక్కలేననీ ఇది ఎంతో మందికి స్థితిస్థాపకతకు ఒక ఆదర్శంగా నిలుస్తుందని పలువురు తెలిపారు. ఈ సందర్భంగా గ్రాంట్-ఇన్-ఎయిడ్ పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆమె ధైర్యాన్ని ప్రశంసించే వారి జాబితాలో పెరుగుతున్నారు. "ఆమె ఎప్పుడూ తరగతులను కోల్పోని ఒక తెలివైన విద్యార్థి. కనీసం చెప్పాలంటే, ఈ సవాలుతో కూడిన సమయాల్లో ఆమె ధైర్యం , స్థితిస్థాపకతతో వేస్తున్న విధానం స్ఫూర్తిదాయకం" అని ప్రిన్సిపాల్ చెప్పారు.

తనపై దారుణం జరిగినా..పరీక్షలకు సన్నద్ధం

తనపై లైంగికదాడి జరిగినా ఆ విద్యార్థిని కుంగిపోలేదు. తన కుటుంబ పరిస్థితులు గమనించి తనకైన గాయాన్ని ఎదుర్కొని అసాధారణ స్థితి నుంచి రాబోయే బోర్డు పరీక్షలపై దృష్టిపెట్టింది. తనపై దాడి జరిగిన మూడు వారాల తర్వాత ఫిబ్రవరి 27 నుంచి జరగనున్న పరీక్షలకు సిద్ధమవుతున్నట్టు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు టీచర్‌ను అరెస్టు చేశారు.



మలక్‌పేట్ నుంచి సైదాబాద్ వెళ్లే రోడ్డులో ఉన్న ప్రభుత్వ కార్యాలయం ఎదుట కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులతో పాటు పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. జిరాక్సుల కోసం పక్కనే ఉన్న నెట్ సెంటర్లలోనూ తాకిడి పెరిగింది. కాగా చాలామంది ప్రైవేట్ వాహనాలపై వచ్చి.. ఆ వాహనాలను కార్యాలయం ముందు పార్క్ చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య నెలకొంది.

నవతెలంగాణ - చంపాపేట్

శంకేశ్వర్ బజార్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-చంపాపేట్

మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వర్ బజార్ కాలనీలో సంబంధిత అధికారులు, వివిధ విభాగాల నాయకులతో మంగళవారం కార్పొరేటర్ కొత్త కాపు రవీందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శంకేశ్వర్ బజార్ కాలనీ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సైదాబాద్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పలు ప్రాంతాల్లో నాలాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా శంకేశ్వర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దుకు చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కులగణన రీ సర్వేలో పాల్గొనండి



- కులాల అస్తిత్వాన్ని కాపాడండి
- బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్

నవతెలంగాణ-ఎల్బీనగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనలో పలు ఆరోపణలు వచ్చినందున తిరిగి రీ సర్వే చేపట్టినందున బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. తర్వాత కులగణనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రీ సర్వే చేపట్టినందున గతంలో నమోదు చేసుకోని వారు ఈసారి తప్పనిసరిగా తమ పేర్లను కులాల వారీగా పేర్లను నమోదు చేసుకొని ప్రభుత్వానికి, కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని పేర్కొన్నారు. కులగణన సర్వేపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగానే కుల సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. ఇప్పటికైనా రీ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కులగణన సర్వేను సమగ్రంగా చేయించేందుకు బీసీ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అధికారులు ఇప్పటికైనా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర, తల్లాటి రమేష్ నేత, శివ, ధనరాజ్ గౌడ్, గుండా నరసయ్య, జల్లా జగన్నాథం, దోర్నాల చంద్రమౌళి, దుర్గాప్రసాద్, ఆనంద్ కుమార్, ఏవి రావ్, ఇమ్రాన్, గర్దాస్ శ్రీశైలం, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పి.రమేష్, ఎండీ ముజాహిద్దీన్ ఖాన్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో కార్పొరేటర్ కళ్లెం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆసరా కమిటీ సభ్యులు వినాయక్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరి సభ్యులుతో మొదలుపెట్టిన సీనియర్ సిటిజన్స్ ఫోరం అందరీ సహకారంతో ఇంత పెద్ద ఎత్తున ఈ చుట్టుపక్కల ప్రాంతంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మీ అపారమైన అనుభవం నేటి యువతరంతో పోటీపడుతూ మేము సైతం సమాజానికి సేవ చేయాలనే పట్టుదల ప్రశంసనీయం అని అన్నారు. ఆసరా కమిటీ సభ్యులు విజ్ఞప్తి మేరకు హయత్ నగర్ సర్కిల్ ఆసరా కమిటీ భవన నిర్మాణం కోసం ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్తానని, ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో భవన నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరై సరైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని, స్థలం దొరికిన వెంటనే భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, హయత్ నగర్ గ్రామ పెద్దలు కళ్లెం శంకర్ రెడ్డి, కళ్లెం చెన్నారెడ్డి, కళ్లెం రవీందర్ రెడ్డి, ఆసరా కమిటీ ఉపాధ్యక్షులు పొట్టి యాది రెడ్డి, హయత్ నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ బొడ్డ బిక్షపతి, ఆసరా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ- హయత్‌నగర్

వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్‌నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ తెలిపారు. 11కేవీ జైపూర్ కాలనీ ఫీడర్.. ఆనంద్ నగర్, కృషి నగర్, ఫతుళ్ళగూడ, జైపూర్ కాలనీ, లక్ష్మి నరసింహ కాలనీ పరిసర ప్రాంతాల్లో, 11కేవీ విశాలాంధ్ర ప్రెస్ ఫీడర్.. ఫతుళ్ళ గూడ, బ్లైండ్స్ కాలనీ హనుమాన్ నగర్, విశాలాంధ్ర, వెంకటేశ్వర్లు కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. 11కేవీ రాజీవ్ స్వగృహ ఏ అండ్ డి ఫీడర్.. రాజీవ్ స్వగృహ ఏ అండ్ డి పరిసర ప్రాంతాల్లో, రాజీవ్ స్వగృహ బి, సి ఫీడర్.. రాజీవ్ స్వగృహ బి అండ్ సి పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, 11 కేవీ కొత్తపేట ఫీడర్.. కొత్తపేట పరిసర ప్రాంతాల్లో, 11కేవీ లక్ష్మీ నగర్ ఫీడర్.. ఎస్ఆర్ఎల్ కాలనీ, నాగేశ్వరరావు కాలనీ, సత్యా నగర్, గౌడ్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో 11కేవీ మోహన్ నగర్ ఫీడర్.. మోహన్ నగర్, స్నేహపూర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో, 11కేవీ న్యూ మారుతి నగర్ ఫీడర్.. మారుతి నగర్ రోడ్ నెంబర్ 1,2, న్యూ మారుతి నగర్, మారుతి నగర్ గౌట్ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో, 11 కేవీ విద్యుత్ నగర్ ఫీడర్.. లక్ష్మీ నగర్ ఎస్బిఐ కాలనీ, ఓమ్ని హాస్పిటల్, కొత్తపేట మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు.

కార్ల అద్దాల బ్లాక్ ఫిలింల తొలగింపు





నవతెలంగాణ-చంపాపేట్

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా సంతోష్‌నగర్ ట్రాఫిక్ సీఐ నరసింహ నాయక్, ఎస్సైలు సత్యనారాయణ, వెంకటప్ప, ట్రాఫిక్ పోలీసుల సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ ఆర్. వెంకటేశ్వర్లు ఐపీఎస్ కార్ల అద్దాలకు అంటించుకున్న బ్లాక్ ఫిలిం (టింటెడ్ గ్లాస్)లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన అనేక ఘటనల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసుల నేతృత్వంలో బ్లాక్ ఫిలింల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ జరుగనుందని తెలిపారు. కారు కిటికీలు, ముందు, వెనుక అద్దాలకు కనీసం 70 శాతం, సైడ్ గ్లాసులకు 50 దృశ్యమానత కలిగి ఉండాలని చెప్పారు. ఆర్టీవో అనుమతి లేకుండా టింటెడ్ గ్లాస్‌ను ఉపయోగించడం నేరమని, అందుకు రూ.100 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. చాలామంది వేడిని, కాంతి ప్రసరణను తగ్గించేందుకు, గోప్యతను పెంచేందుకు, వాహనం రూపాన్ని మెరుగుపరుచుకోవడం కోసం టింటెడ్ గ్లాస్‌ను వాడుతారని, అయితే దేశంలో టింటెడ్ గ్లాస్ వాడకాన్ని నిషేధించడం జరిగిందని తెలిపారు. బ్లాక్ ఫిలిం వాడకం సెక్యూరిటీ దృష్ట్యా కేవలం వీఐపీలకు మాత్రమే అనుమతి ఉందని, సామాన్య ప్రజలు ఎవరూ వాడడానికి వీలులేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'26, 27న నైట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్'

నవతెలంగాణ -హయత్‌నగర్

ఈ నెల 26, 27 తేదీలలో బ్యాడ్మింటన్ నైట్ టోర్నమెంట్ ఉంటుందని నిర్వాహకులు రాజారావు, గజ్జి నరసింహ యాదవులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ ఈ నెల 18, 19వ తేదీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గజ్జి యాదయ్య, రాజమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నైట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. ఎంట్రీ ఫీజు రూ.800 ఉంటుందన్నారు. హయత్ నగర్‌లో ఉన్న ఎస్వీఎస్ గార్డెన్‌లో పూర్తి వివరాలకు 9704541579, 849956055 నెంబర్లను సంప్రదించాలన్నారు.

23న బంజారా వివాహ పరిచయ వేదిక

నవతెలంగాణ -చంపాపేట్

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా లంబాడీ, సుగాలీ (బంజారా) వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు డి.టి.నాయక్, జనరల్ సెక్రెటరీ శ్రీమన్ నారాయణ అంగోత్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బంజారా వివాహ పరిచయ వేదికను ఈ నెల 23న ఆదివారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారు తమ వివరాలను ఈ నెల 21 సాయంత్రం 5 గంటలలోపు వ్యక్తి గతంగా లేదా ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9441771109, 8555866372, 9701381589 ఈ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

క్యాట్ పరీక్షలో రాణించిన పాణినీయ మహావిద్యాలయ విద్యార్థులు



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఉత్తమ సాధనతోనే మెరుగైన ఫలితాలు సాధిస్తారని పాణినీయ మహా విద్యాలయ ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. క్యాట్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాణినీయ మహా విద్యాలయ విద్యార్థులను మంగళవారం శ్రీచైతన్య పాఠశాల ఏ జి ఎం సతీష్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాట్ పరీక్షలలో 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న 73 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో 11 మంది విద్యార్థులు ప్రైజ్ మనీ అందుకున్నారని చెప్పారు. 38 మంది విద్యార్థులు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నట్టు పేర్కొన్నారు. 34 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ సాధించినట్టు పేర్కొన్నారు.

'హైదరాబాద్ నుంచి మదీనాకు డైరెక్ట్ ఫ్లైట్'

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీఎం రేవంత్ రెడ్డి కృషితో తెలంగాణ ముస్లింలు హైదరాబాద్ నుండి మదీనాకు డైరెక్ట్ ఫ్లైట్ ద్వారా వెళ్ళవచ్చని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్ అండ్ కాలేజ్ చైర్మెన్ ఫహీమ్ ఖురేషి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అసోసియేట్ డైరెక్టర్ బీవి చారి, సిబ్బందితో చర్చించారు. తర్వాత ఇండిగో సంస్థ



ప్రతినిధులు అంగీకరించడంతో ఈ నెల 20 నుండి హైదరాబాద్ నుండి మదీనాకు డైరెక్ట్ ఫ్లైట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫయీామ్ ఖురేషి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం నుండి కూడా మదీనాకు డైరెక్ట్ ఫ్లైట్‌లు లేవని, సీఎం రేవంత్ రెడ్డి కృషితోనే ఇండిగో సంస్థ అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హజ్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ లాయిక్, అల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ రౌఫ్, ప్రముఖ సంఘ సేవకులు షైక్ సలాఉద్దీన్, ఇండిగో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'భూగర్భ డ్రయినేజీ పనులు ప్రారంభం'



నవతెలంగాణ- హయత్ నగర్

డివిజన్ పరిధిలోని హయత్ నగర్‌లో ఉన్న కొలను శివారెడ్డి నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి రూ.8.50 లక్షలతో చేపట్టిన నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఇంకా కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను, సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్స్, విద్యుత్ స్తంభాలను తొందర్లోనే సాంక్షన్ చేయించి.. దశల వారీగా పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ రాజకీయాలతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి సస్పెండ్



- రాజకీయ కక్షతోనే సస్పెండ్ చేశారని ఆరోపణ
- బాధితురాలికి అండగా నిలుస్తాం : బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ -హస్తినాపురం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి పాలిట శాపంగా మారింది. హస్తినాపురం డివిజన్ నందనవనం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నాడు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ సంఘటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరపడం పట్ల సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఇంచార్జి హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రజితని సంబంధిత విద్యాధికారులు వెంటనే సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆందోజ్ సత్యం చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమైన స్వరాష్ట్ర కలను సాధించిన కేసీఆర్ జన్మదిన వేడుకలపై కాంగ్రెస్ నాయకులు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే నిధుల ద్వారా మంజూరైన పనులను చేపడుతూ డివిజన్ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్పొరేటర్ సుజాత నాయక్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధం లేని విషయంలో ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం దుర్మార్గమని, తమపై రాజకీయ కక్షతో కార్పొరేటర్ సుజాత నాయక్, చంద్ర శేఖర్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని బలి చేశారని, ప్రభుత్వ ఉపాధ్యాయూరాలు రజితకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు నారగొని శ్రీనివాస్ యాదవ్, భిక్షపతి చారి, విష్ణు, ఇబ్రహీం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన ఇటలీ సన్ విశ్వవిద్యాలయ బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటలీలోని సన్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ అల్లెసాంద్రో డెల్లా కోర్టే, వారి బృందం మంగళవారం నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ను సందర్శించారు. ఈ సందర్భంగా మొదట నిమ్స్ కార్డియో తెరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అంబరిష్, వారి బృందంతో కలిసి నిమ్స్ డైరెక్టర్ నగరి భీరప్పను కలిసిన తర్వాత వార్డులో చికిత్స తీసుకుంటున్న రోగులను కలిసి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ప్రొఫెసర్ అంబిరిష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లర్నింగ్ సెంటర్‌లో సమావేశమై అయోర్టిక్ డిసెక్షన్, అనూరిజమ్‌లతో బాధపడుతున్న రోగుల నిర్వహణకు నిమ్స్‌లోని సీవీటీఎస్, అనస్థీషియా విభాగంతో ఇంటరాక్టివ్ అయ్యి చర్చలు జరిపారు.

ఈ కార్యక్రమంలో డీఆర్ రవీంద్ర (హెచ్ఓడీ, సీవీటీఎస్, గాంధీ హాస్పిటల్), డాక్టర్ అనితా భల్లా (హెచ్ఓడీ, సీవీటీఎస్, ఉస్మానియా హాస్పిటల్), డాక్టర్ అభిజీత్ (హెచ్ఓడీ, సీవీటీఎస్, ఈఎస్ఐ హాస్పిటల్, హైదరాబాద్), డాక్టర్ అర్చన (కార్డియాక్ అనస్థీషియా ప్రొఫెసర్, నిమ్స్), డాక్టర్ గోపాల్ (నిమ్స్), డాక్టర్ రామకృష్ణ (నిమ్స్), డాక్టర్ కళాధర్ (సీవీటీఎస్, నిమ్స్) పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నవతెలంగాణ-బడంగ్‌పేట్

శివసాయి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు1, 2 రాళ్ళగూడెం రామకృష్ణా రెడ్డి, రామిడి వీరకర్ణా రెడ్డిల ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం కాలనీ వాసులతో కలిసి ధర్నా చేశారు. బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు, కొలన్ శంకర్ రెడ్డిలు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 23వ డివిజన్ పరిధిలోని శివసాయి నగర్ కాలనీలో రెండు ఏండ్లుగా డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయకుండా నిలిపివేశారని అన్నారు. రోడ్డు, తాగునీటి సరఫరా తదితర నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డికి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల కోసం ఏనాడు పనిచేసిన పాపాన పోలేదని ఆరోపించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక ప్రభుత్వ పార్కులను, ఓపెన్ స్థలాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. స్వయంగా ఇరిగేషన్ వారు ఇచ్చిన మ్యాప్‌లో కబ్జాదారులు నాలాను ఆక్రమించారని స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేకపోతున్నారని మండిపడ్డారు. అనంతరం రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులతో కలిసి అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మాజీ సర్పంచ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు నడికుడ యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువతి మృతి



నవతెలంగాణ- బడంగ్ పేట్

వాషింగ్ మిషిన్ విద్యుత్ షాక్ తగిలి ఓ యువతి మృతి చెందిన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలీనగర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ షానవాజ్ కూతురు పాతీమా బేగం(17).. తన స్వగృహంలో వాషింగ్ మిషిన్‌తో బట్టలు ఉతుకుతుండగా విద్యుత్ షాక్ తగిలి ఆ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకొని ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆమె మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి మహమ్మద్ షానవాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.

తోటకూర వజ్రేష్ యాదవ్‌కు సన్మానం



నవతెలంగాణ - శామీర్‌పేట

ఉద్దెమర్రి శ్రీవిష్ణు శివాలయాభివృద్ధికి సహకరిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు గ్రామస్తుల తరఫున ఉద్దెమర్రి మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం బోడుప్పల్ లోని వజ్రేష్ యాదవ్ నివాసానికి ఉద్దెమర్రి ఆలయ కమిటీ సభ్యులు వెళ్లి గజమాలతో సత్కరించారు. ఉద్దెమర్రిలో అక్కన్న మాదన్నలు నిర్మించిన అతి పురాతనమైన శ్రీవిష్ణు శివాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే దేవాదయ ధర్మాదాయ శాఖ మంత్రితో మాట్లాడి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయించామన్నారు. కాగా ఆలయాభివృద్ధికి నిధులు కేటాయింపజేసిన వజ్రేష్‌కు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలనర్సింహా, విష్ణు గౌడ్, వెంకటగిరి ప్రసాద్, నల్ల ప్రభాకర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రవణ్ కుమార్, లక్ష్మన్, గోపిరెడ్డి, నర్సింలు, తదితరులున్నారు.





ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి వెంకటరెడ్డి సతీమణి బండారి పద్మ ఇటీవల కాలం చేయడంతో సైనిక్ పురిలోని వారి నివాసంలో సోదరుడు వెంకట్ రెడ్డిని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు మాజీ ఎంపీ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ రావులు బండారి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. -నవతెలంగాణ,కాప్రా

పనులాయే..బిల్లులు రాకపాయే..!

- అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లుల చెల్లింపులో జాప్యం
- మీనమేషాలు లెక్కిస్తున్న జిల్లా ప్రణాళికా విభాగం..!
- ఆయా విభాగాల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు
- చిన్నపాటి కొర్రీల పేరుతో కాలయాపన
- అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!





నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జిల్లా ప్రణాళికా విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లులను వెంటనే చెల్లించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికా గుప్తా ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నట్టు తెలుస్తోంది. పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా.. నిధులను ఖాతాల్లో జమ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు జిల్లా విద్యాశాఖ, జిల్లా ప్రణాళికా కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. అప్పులు తీసుకొచ్చి మరీ పనులు చేపట్టామనీ, సకాలంలో నిధులు అందకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

286 స్కూల్స్.. రూ.12 కోట్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 286 స్కూళ్లను 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం కింద ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో నీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, టాయిలెట్ల ఏర్పాటు (మరమ్మతులు) గదుల నిర్మాణం (మరమ్మతులు), పెయింటింగ్, ట్యాంకుల గ్రిల్స్, ట్యాప్ తదితర పనులను అమ్మ ఆదర్శ కమిటీల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ద్వారా చేయించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, టీఎస్ఐఆర్‌సీ ఇంజినీరింగ్ శాఖల ద్వారా పనులను పర్యవేక్షించారు. ఈ పనుల కోసం రూ.12 కోట్లను కేటాయించగా, జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్ టీ) నుంచి ఈ నిధులను అందజేయాలనీ, జిల్లా ప్రణాళికశాఖ ద్వారా నిధులను విడుదల చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

3 నెలలుగా కాంట్రాక్టర్ల అవస్థలు..

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల కోసం ఎంబీ రికార్డులను పరిశీలించి నిధులను డీఎంఎఫ్‌టీ నుంచి నిర్దేశించిన ఖాతాల్లోకి ప్రణాళిక విభాగం ఆర్టీజీఎస్ చేయాల్సి ఉంది. కానీ బిల్లులు చెల్లించకుండా దాదాపు 3 నెలలుగా జిల్లా ప్రణాళికా విభాగం అధికారులు చిన్నపాటి కొర్రీలు పెడుతూ నిధులు తమ ఖాతాల్లో జమ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎంఎఫ్‌టీ నిధులున్నా.. తమ ఖాతాల్లో జమ కావడం లేదని వారు వాపోతున్నారు. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమం కింద ఆయా ప్రభుత్వ స్కూళ్లలో చేపట్టనున్న పనుల కోసం నిధులను ముందే తొలి విడుతలో రూ.6 కోట్లను ఖాతాల్లో జమ చేశారు. మరో రూ.2.13 కోట్ల పనులకు గాను ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధుల మంజూరుకు జిల్లా ప్రణాళిక విభాగానికి ప్రతిపాదనలు పంపించారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా బిల్లుల చెల్లింపులో ప్రణాళికా విభాగం నిర్లక్ష్యంతో తమకు వడ్డీల భారం పెరిగిపోతోందని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశంతో వడ్డీ వ్యాపారుల దగ్గర డబ్బులు తీసుకొచ్చి పనులు చేయించామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పనులు చేపట్టే క్రమంలో వెంటపడి చేయించిన అధికారులు.. బిల్లుల చెల్లింపులో జాప్యం ఎందుకు చేస్తున్నారని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!

అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు సంబంధించి ఎంబీ రికార్డులు సమర్పించిన వాటికి బిల్లులు తక్షణమే చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికగుప్తా జిల్లా ప్రణాళిక అధికారులను ఆదేశించారు. వెంటనే నిధులు విడుదల చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం మొరపెడుతున్నా.. జిల్లా ప్రణాళిక సంఘం అధికారులు ఏదో ఓ సాకుతో నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తూ నిధుల విడుదలలో జాప్యం చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తుండటంతో వారు వీరికి సమాధానం చెప్పలేక.. జిల్లా ప్రణాళిక విభాగం అధికారులను గట్టిగా అడగలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు నిధులను ఇప్పించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

కుల గణన పక్కగా చేయాలి



- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ

నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను పూర్తి స్థాయి నిర్వహించి క్షేత్ర స్థాయిలో వివరాలను పొందుపరచాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మీ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో కులగణనపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, ఎన్యూమరేటర్లు, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు రివ్యూ చెయ్యాలని కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే కుల గణన చేపట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్‌లో సీసీ రోడ్లు ప్రారంభం



- కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని సాయిబాబా నగర్‌లో రూ.36లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాప్రా డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడంలో సఫలం అవుతున్నానని చెప్పారు. సాయిబాబా నగర్‌లో తొమ్మిది వీధుల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల అవస్థ తీరనుందన్నారు. అనంతరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసా య మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ.. సాయి బాబానగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మందుముల పరమేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో వందల కోట్ల నిధులు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అహర్నిశలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయా కాలనీలు, బస్తీల సమస్యల పరిష్కరించడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాప్రా డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్, కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, సాయిబాబానగర్ వాసులు ప్రదీప్, చోటు భాయ్, షకీల్, కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి , సంతోష్ చారి , జి సత్యనారాయణ , టి శ్రీహరి , ప్రదీప్ పాల్గొన్నారు.

మార్చి 1,2 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

నవతెలంగాణ-ఘట్కేసర్

మార్చి 1,2 తేదీలలో మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లో నిర్వహించే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన గోడ పత్రికను ఏఐవైఎఫ్ ఘట్కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘట్కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం కూడలిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన విధానాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆ చర్చల ద్వారా నిర్దిష్టమైన ప్రణాళికలను పాలకులకు పోరాటాల ద్వారా తెలియపర్చనున్నట్లు అన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర సమితి సమావేశాల్లో మొదటి రోజు "సాంకేతికత, అభివృద్ధి, నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో రోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సభ్యులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఘట్కేసర్ మండల కార్యదర్శి సంపంగి శివ, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు,యేసు బాబు, సంపత్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామిని దర్శించుకున్న నవీన్ విట్టల్



నవతెలంగాణ-కీసర

చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ విట్టల్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీ హరి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలోని యూజీడీ సమస్యకు పరిష్కారం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి గుడి ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు పురాతన పైప్‌లైన్ ఉండడంతో తరచూ సమస్య వస్తుందని చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లడంతో ఏఈ సందీప్‌తో కలిసి గతంలో పరిశీలించారు. కాగా మంగళవారం ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. దీంతో చైర్మెన్, ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి
- జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కీసరగుట్టలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ చైర్మెన్ నారాయణ శర్మ, ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ఆలయ కమిటీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు క్యూలైన్‌లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, వృద్ధులకు, దివ్యాంగుల కోసం ఆటోలను అందుబాటులో ఉంచాలన్నారు. భద్రతా సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలన్నారు. అత్యవసర చికిత్సకు వైద్య సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. బ్యారీకేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికి సూచించారు. జాతరలో పరిశుభ్రత పాటించడానికి మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలన్నారు. జాతరలో పూజ సామాగ్రి, ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గుట్టకింద ఉన్నచెరువు దగ్గర గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. కీసర ఆలయానికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, చైర్మెన్‌కు తెలిపారు. పోలీసు, ట్రాఫిక్, విద్యుత్తు, ఫైర్, మెడికల్, శానిటేషన్ విభాగాలలో మూడు షిఫ్టులలో విధులు నిర్వహించాలని అధికారులను సూచించారు. కీసరగుట్టలో శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం ప్రత్యేక దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ , దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి, కీసర సీఐ శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పోలీసు, విద్యా, వైద్య, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ట్రాఫిక్, సమాచార, మత్స్య, ఫైర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కీసరగుట్ట శ్రీ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం కరపత్రాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-కీసర

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్ట శ్రీ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమం కరపత్రాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట ఉపేందర్ రెడ్డి ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ, ఉత్సవ కమిటీ చైర్మెన్ రాయల శ్రవణ్ కుమార్ గుప్తా, అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా, కోశాధికారి బచ్చు నగేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



- ఉద్యమకారుల ఫోరం డిమాండ్

నవతెలంగాణ-అల్వాల్

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, బస్ పాస్‌లను అందించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు లభించే అన్ని ప్రయోజనాలను తెలంగాణ ఉద్యమకారులకు కల్పించాలని డిమాండ్ చేశారు. 33 జిల్లాలలో పోస్ట్ కార్డ్ ఉద్యమం చేపట్టబోతున్నామని ఫోరం నేతలు తెలిపారు. కాగా మగళవారం ఆల్వాల్‌లో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫోరం చైర్మెన్ చీమ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ పట్లోళ్ల సురేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దయానంద్, మల్కాజ్గిరి ఫోరం అధ్యక్షుడు పుట్నాల కృష్ణ, కొండ స్వామి బాబు, పోచన్న, అనిల్, ఆనంద్, అనంతలక్ష్మి, నస్రిన్, శోభా ఉన్నారు.

ముస్లింలకు నైట్ షాపింగ్స్ సదుపాయం కల్పించాలి



- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేసే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా నైట్ షాపింగ్ సదుపాయం కల్పించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మసీదుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని మసీదుల అధ్యక్షులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం కుటుంబాలు ఉపవాస దీక్షలు చేసే సమయంలో మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు కృషి చేయాలని, శానిటేషన్ సిబ్బంది పనిచేయాలని కోరారు. పాత బస్తీలో ఏర్పాటు చేసిన విధంగా రాత్రి సమయాల్లో షాపింగ్‌కు మల్కాజిగిరిలో కూడా సముదాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి ముస్లింల పక్షాన మాట్లాడడం చూసి ఎం.ఐ.ఎం తర్వాత ముస్లింల కోసం పోరాటం చేసే ఏకైక నాయకుడని మజ్లిస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ ముస్లిం పెద్దలు, మసీదుల సదర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్విస్ ఇండియన్ స్పోర్ట్స్ లీగ్

- దావోస్ పర్యటన సందర్భంగా ట్రోఫీని ప్రదర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సంక్రాంతిని పురస్కరించుకుని ప్రారంభమైన స్విస్ ఇండియన్ స్పోర్ట్స్ లీగ్ ఈ నెల 15వ తేదీతో ముగిసింది. వరంగల్ వారియర్స్ ప్రారంభ సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. తొలి సీజన్‌లో ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్‌లో వరంగల్ వారియర్స్ 6 పరుగుల తేడాతో కాకతీయ నైట్ రైడర్స్‌పై విజయం సాధించింది. ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారుల సమక్షంలో ప్రదర్శించారు. వరంగల్ వారియర్స్ నిలకడగా క్రికెట్ ఆడి 5 లీగ్ గేమ్‌లలో 4 గెలిచి లీగ్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్ హిట్టర్స్ రెండో స్థానంలో నిలవగా, కాకతీయ నైట్ రైడర్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన మూడో జట్టు. టోర్నమెంట్‌లో ఆల్ రౌండ్ ప్రదర్శనకు రవితేజ పేర్ని మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికయ్యాడు. సంక్రాంతి సందర్భంగా, స్విస్ తెలుగు ఎన్ఆర్ఐ ఫోరమ్ తొలిసారిగా స్విట్జర్లాండ్‌లో ఫ్రాంచైజీ ఆధారిత క్రికెట్ లీగ్‌ను సగర్వంగా ప్రారంభించింది. ప్రారంభ ఎడిషన్‌లో తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ ప్రదేశాలు, ప్రాంతాల పేర్లతో 6 బందాలు ఉన్నాయి. తెలుగు మాట్లాడే రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో గుర్తింపు పొందిన వ్యక్తులతో, దేశంలో మూలాలకు తిరిగి సమాజాన్ని కనెక్ట్ చేస్తూ ఆరోగ్యకరమైన, పోటీతత్వ క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడం లీగ్ యొక్క భావన. ప్రారంభ ఎడిషన్ జనవరి 12వ తేదీన ఇండోర్ గ్రౌండ్‌లో జరిగింది. ఆలోచనలు, ప్రయత్నాలు, ఆర్థిక సహాయంతో తమకు మద్దతు ఇచ్చిన బృందాలు, భాగస్వాములను సొంతం చేసుకోవడానికి ముందుకొచ్చిన కమ్యూనిటీ సభ్యులందరికీ ఈ సందర్భంగా స్విస్ ఇండియన్ స్పోర్ట్స్ లీగ్ ధన్యవాదాలు తెలియజేసింది. సరైన స్ఫూర్తితో ఆడే ఉత్తేజకరమైన, పోటీతత్వ క్రీడా ప్రయాణానికి ఇది ప్రారంభం మాత్రమేనని తాము విశ్వసిస్తున్నట్టు ఇండియన్ స్పోర్ట్స్ లీగ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ

- ఎంసీ పల్లి మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ చారి



నవతెలంగాణ - శామీర్‌పేట

కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదవారికీ సంక్షేమ ఫలాలు అందాలని రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మూడు చింతలపల్లి మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ చారి అన్నారు. మంగళవారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేండ్లు అధికారంలో ఉండి ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజురు చేసిందని తెలిపారు. రేషన్ కార్డు లేనివారు, రేషన్ కార్డు ఉండి తమ పిల్లల పేర్లు నమోదు కానీ వారు సమీపంలో ఉన్న మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, వంట గ్యాస్ బుక్కు జిరాక్స్ కాపీలు తమ దరఖాస్తుకు జతపరచాలన్నారు. వివాహం అయిన వారు మ్యారేజ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ జతపరచాలని , రేషన్ కార్డు ఉండి తమ పిల్లల పేర్లు నమోదు కోసం బర్త్ సర్టిఫికెట్, బోనోఫైడ్ జతపరచాలన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతరం చేయడం అభినందనీయమని ప్రజాపాలన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలకృష్ణచారి కోరారు.

కాంట్రాక్టర్ పై దాడి హేయమైన చర్య



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంట్రాక్టర్‌పై దాడి హేయమైన చర్య అని జంట సర్కిళ్ల కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షులు రేవన్ గిరిబాబు అన్నారు. నగరంలోని చార్మినార్ సర్కిల్, దూద్బౌలి లోని జమల్ఖాభికా తకియాలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ మొహమ్మద్ ఇసాక్ పై జరిగిన దాడిని నిరసిస్తూ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కార్యాలయాల వద్ద కాంట్రాక్టర్లతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరిగితే సహించబోయేది లేదని తెలిపారు. ఆయా సర్కిళ్ల పరిధిలో ఒకరోజు పనులు ఆపివేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పబ్బ నరేష్, గౌరవా ధ్యక్షులు సాయిబాబా సభ్యులు బొంత ఎల్లయ్య, రంగరాజు, రమేష్, అశోక్ దుర్గయ్య పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉప యోగించాలనే, చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం కుల గణన కార్యక్రమం చేపట్టింది. దేశానికి దిశా నిర్దేశంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో.. దేశంలోనే ప్రథమంగా మొదలుపెట్టి, రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా పూర్తి చేసింది. బీసీ కుల గణన సర్వే సందర్భంగా.. శేర్లింగం పల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్, శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో బాలా గౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గం చెరువు పరిరక్షణకు చర్యలు

- చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు
- వివిధ శాఖల అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి అది కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. అందులో భాగంగానే పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ ఆదేశాల మేరకు చెరువు పరిసరాలను జలమండలిఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, లేక్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టడానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్ అవసరాల కోసం ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటినే వాడుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేలా...

మాదాపూర్, సైలెంట్ వాలీ ప్రాంతాలు, క్యాచ్ మెంట్ ఏరియాలో ఉత్పన్నమవుతున్న మురుగునీటిని జలమండలి దుర్గం చెరువులో నిర్మించిన రెండు ఎస్టీపీల (5 అండ్ 7 ఎమ్మెల్డీలు) ద్వారా శుద్ధి చేస్తున్నారు. దుర్గం చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేందుకు, చెరువు హైడ్రాలజీ కాపాడేందుకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదిలి పెడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా 1000 ఎంఎం డయా పైపులైన్‌ను మాదాపూర్ పెట్రోల్ బంక్ నుంచి మాదాపూర్ ఐ అండ్ డి వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్ ఖరారయ్యాక వచ్చే 3 నెలల్లో పైపులైన్ నిర్మాణ పనుల్ని పూర్తి చేయనున్నారు. దీని వల్ల లేక్ పార్కులో జరుగుతున్న సీవరేజ్ ఓవర్ ఫ్లో కూడా తగ్గనుంది.

వంద శాతం రీసైకిల్ వాటర్ నే వినియోగించాలి: ఏండీ..

రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, పార్కు, ల్యాండ్ స్కేప్ నిర్వహణకు ఇతర అవసరాలకు తప్పనిసరిగా వంద శాతం రీసైకిల్ వాటర్‌నే వినియోగించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. అందుకోసం వారం లోపల దుర్గం చెరువు ఎస్టీపీ నుంచి ప్రత్యేక పైపు లైన్ ను నిర్మించాలని ఆదేశించారు. దుర్గం చెరువు ఎస్టీపీ నుంచి ట్రీటెడ్ వాటర్ తరలించి వాడుకునేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీ అధీనంలో ఉన్న పార్కులు, ల్యాండ్ స్కేపింగ్ లల్లో రీసైకిల్ నీటినే వాడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేక్ చుట్టుపక్కల ఉన్న డైవర్షన్ మెయిన్ మ్యాన్ హెూల్లను పరిశీలించాలని రహేజా గ్రూప్ సంస్థను ఆదేశించారు. లేక్‌లో సీఎస్ఆర్, అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టినప్పుడు మ్యాన్ హెూల్ల ఎత్తు తగ్గడం కానీ, ధ్వంసం కావడం కానీ లాంటివి జరిగితే గుర్తించి, వాటికి మరమ్మతులు చేసి జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డుకు సమాంతరంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు సీజీఎం పద్మజ, ఓఎస్డీ సత్యలింగం, జీహెచ్ఎంసీ జడ్సీ ఉపేందర్ రెడ్డి, డీసీ ముకుంద్ రెడ్డి, ఈఈ దుర్గా ప్రసాద్, ఈఈ లేక్స్ నారాయణ, ఎలక్ట్రికల్, ఫిషరీస్ తదితర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకునేలా నోటీసులు

- వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెరువులో కలవకుండా వాటర్ డ్రెయిన్ సైతం నిర్మించనున్నారు. జీహెచ్ఎంసీ ఈ నిర్మాణ పనుల్ని చేపట్టి, 3 నెలల్లో పూర్తి చేయనుంది.
- దుర్గం చెరువు చుట్టు పక్కల నివాసాల నుంచి వచ్చే సిల్ట్ డైవర్షన్ మెయిన్‌లో కలకుండా సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని వారికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.
- చెరువు భూగర్భ జలాల స్థాయుల్ని కాపాడేందుకు ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటిని పార్కులో నిర్వహణ పనులకు, చెట్లు పెంచేందుకు ఉపయోగించాలని సూచించారు.

దుండిగల్ ప్రజలకు అండగా ఉంటా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద దుండిగల్ గ్రామ ప్రజలు తనతో కలిసి వారి సమస్యలను వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్ 453,454 లలో ఆర్టిఓ ఆఫీస్ ఏర్పాటు కోసం కేటాయించిన 40 ఎకరాల భూమిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మాకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇపిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసారన్నారు. దుండిగల్ గ్రామ ప్రజలు, రైతులు తమకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... దుండిగల్ గ్రామ ప్రజలు రైతులు అధైర్యపడవద్దు, మీ అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమస్యను మన ఇన్‌చార్జి మంత్రివర్యులు శ్రీ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి.. మీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు దుండిగల్ మాజీ సర్పంచ్, కావాలి గణేష్, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, మాజీ వార్డు సభ్యులు పిట్లా నాగార్జున, చెల్కల్ లక్ష్మణ్, పిట్లా సత్యనారాయణ, నాయకులు ఆకుల ప్రేమకుమార్, ఉప్పరి కృష్ణ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాడమే నా ధ్యేయం కూన శ్రీశైలం గౌడ్..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో బుధవారం నియోజకవర్గం ప్రజలతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను పరిష్కరిస్థానాని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గం అభివృద్దే నా ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



లింక్ రోడ్డు పనులు ఏర్పాటు చేయాలి



- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మగ్దూం నగర్ నుంచి హెచ్ఎంటీ రోడ్డు కులింకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట మగ్దుమ్ నగర్ సబ్ స్టేషన్ పక్కనుంచి హెచ్ఎంటి పైప్ లైన్ రోడ్డు వరకు లింక్ రోడ్డు పొడిగించాలని.. దీనివలన లింకు రోడ్డుల వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని జగద్గిరిగుట్టలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని వినతిలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డిల ఆధ్వర్యంలో రోడ్డును త్వరలోనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందించిన డిసి.మల్లారెడ్డి త్వరలోనే సర్వే జరిపి పరిశీలిస్తానని తప్పక పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీఎస్ఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

టీపీసీసీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో.. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీ య అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, ఏఐసీసీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ గొంగళ్ల సంజీవరెడ్డి 95వ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో సనత్ నగర్ ఈఎస్ఐ హాస్పిటల్‌లో, రోగులకు పండ్ల పంపిణీ కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంబాగ్ ప్రకాష్ గౌడ్ చైర్మెన్ లేబర్ సెల్, సుజీత్ గాంధీ, కాందాడి సుదర్శన్ రెడ్డి, సప్పిడి భాస్కర్, కూన భరత్ గౌడ్, చంద్రయ్య గౌడ్, శివనారాయణ, ఆయిల శ్రీధర్ గౌడ్, పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కెఎస్ఆర్ వీరాభిమాని ఫేస్ 2 గిరీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా తన అభిమాన నాయకుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కెఎస్ఆర్ దీవించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), బాలకృష్ణ, ప్రభాకర్, మహేష్ యాదవ్, ఎం.సత్యవతి, ఎన్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్


సిబ్బంది సమయ పాలన పాటించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని పల్లె దవాఖానలు, పీహెచ్‌సీలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది సమయ పాలన పాటించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో కీసర, మల్కాజిగిరి డివిజన్‌ల డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, జిల్లా ఆరోగ్య కార్యక్రమ అధికారు లు, జిల్లాలో పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి, ప్రజలకు మరింత చేరువయ్యేలా అవసరమైన సూచనలు, సలహాలు అందించినట్టు తెలిపారు.



ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్ జిల్లాలో జరుగుతున్న మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా వెళ్లిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న దృశ్యం.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ వీసీ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ టి.కిషెన్ కుమార్ రెడ్డి మంగళవారం బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా రెక్టర్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు (వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కిషెన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు పాటుపడతానన్నారు. విద్యార్థుల అకడమిక్, పరిశోధనా ప్రగతికి అనువైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రొఫెసర్ కిషెన్ కుమార్ రెడ్డి మెకానికల్ ఇంజనీరింగ్‌లో విశేష అనుభవం కలిగిన శాస్త్రవేత్త. ఆయన జేఎన్‌టీయూహెచ్‌లో రెక్టర్‌గా (1994-2016), పండిట్ దీన్ దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా (2016-2018) సేవలందించారు. ఏఐసీటీఈ, డీఆర్డీఎల్, డిఎంఆర్ఎల్, నాసా వంటి సంస్థలతో పరిశోధనలలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (2010), ఐఎఎం మెడల్ (2018) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకిష్టా రెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

సత్తయ్య సేవలు మరువలేనివి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీపీఐ కుత్బుల్లాపూర్ మాజీ మండల కార్యదర్శి వంగాల సత్తయ్య కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వేసిన బస్తీలు ఉన్నంతకాలం ఆయన సేవలు పేద ప్రజలు మరువరని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. గిరినగర్, జగద్గిరిగుట్ట, గుబురుగుట్ట, గూడెన్‌మెట్, మగ్దూం నగర్, లెనిన్ నగర్, రావి నారాయణరెడ్డి నగర్ లాంటి అనేక బస్తీలను నిర్మించి నటువంటి సత్తయ్య ఏడవ వర్ధంతి పురస్కరించుకొని.. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ గుబురుగుట్టలోని స్మారక స్థూపం వద్ద సీపీఐ నేతలతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. గిరినగర్ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య అధ్య క్షత వహించగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.యేసు రత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ వంగాల సత్తయ్య ఆటో యూనియన్ నుంచి మొదలు కొని పొట్లూరు నాగేశ్వరరావు చేత సీపీఐ పార్టీ నాయ కత్వం 1970 లో సత్తయ్య భూ పోరాటం కార్యక్రమానికి నాయకత్వం వహించి వేలాది ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర ఆయనకు దక్కుతుందని గుర్తుచేశారు. వంగాల సత్తయ్య, బండి నాగయ్యలు కలిసి ఎన్నో బస్తీలు నిర్మించారని వారి నిస్వార్థ పోరాట ఫలితమే నేడు వేలాది మంది ఇక్కడ నివసిస్తున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరూ వారు చేసిన సేవలను ప్రజలకు తెలియజేసి వారిని ప్రజల్లో చిరస్థాయిగా నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలని కార్యకర్తలను కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు వి.హరినాథ్,మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య,డి.హెచ్.పి. ఎస్.నాయకులు చర్లపల్లి రాములు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎండి. యాకూబ్, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బాబు, మల్లేష్, శ్రీ మల్లయ్య, ఖాదర్, వంగాల గణేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సీఎం సహాయనిధి పేదలకు వరం అని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లో నివాసం ఉండే భూసాని శ్రావణి ఎర్రమంజిల్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందారు. చికిత్స అనంతరం వారు కూకట్‌పల్లిలోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావుని వారి కార్యాలయంలో సంప్రదించారు. అనంతరం బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రెండు చెక్కులు రూ.54500, (21000+ 33500)ల మంజూరు అయ్యాయి. అట్టి చెక్కులను మంగళవారం బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్ గుప్తకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహయ నిధి నిరుపేదలకు వరమన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్‌కి, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావులకి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, శివా చౌదరి పాల్గొన్నారు.

పరికి చెరువును తక్షణమే కాపాడండి

- హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్‌కు చెరువు పరిరక్షణ సమితి సభ్యుల వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పరికిచెరువును కాపాడటానికి తక్షణమే చర్యలు చేపట్టాలని చెరువు పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట, గాజులరామారం పరిధిలో విస్తరించి ఉన్నటువంటి పరికి చెరువును గత నెలలో హైడ్రా కమిషనర్‌గా మీరు వచ్చిన తర్వాత, అనంతరం జరిగిన సమావేశంలో కూడా చెరువులో కబ్జాలు చేయొద్దని మీరు సూచించినప్పటికీ తిరిగి యధావిధిగా చెరువులో మట్టి పోస్తూ కబ్జా చేస్తున్నారన్నారు. ఇలానే ఇంకో నెల రోజులు సాగితే ఉన్న చెరువు మొత్తం అన్యాక్రాంతం అవుతుందని కాబట్టి వెంటనే ముందుగా చెరువు స్థలంలో ఇండ్లు కట్టకుండా,మట్టి పోయకుండా చర్యలు తీసుకోవాలని హైడ్రా ప్రజావాణిలో కోరారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ అధికారులను కచ్చితంగా అక్కడ నిర్మిస్తున్నటువంటి అక్రమ నిర్మాణాలను వెంటనే నోటీసులు పంపించి తొలగించాలన్నారు. అదేవిధంగా చెరువు పరిరక్షణ కొరకు చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి నాయకులు ఈ.ఉమామహేష్,సాయికుమార్ పంతుల, పవన్ రెడ్డి, జంబు, భరత్ పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వరస్వామివారి 3వ బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని దండముడి ఎంక్లేవ్‌లో శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి 3వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు కిరణ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, ఇంద్రా రెడ్డి, రవీందర్ రెడ్డి, 132 బీజేపీ డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, ప్రభాకర్ రెడ్డి, సతీష్, శివ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా 89వ శివ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో ఓంశాంతి బ్రహ్మకుమారీస్ వారి ఆధ్వర్యంలో 89వ అవతరణ శివ జయంతి ఉత్సోవాలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి విచ్చేసి ఓంశాంతి చెండా ఎగుర వేసి సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మెడిటేషన్‌తో ఆలోచనల్లో స్పష్టత ఏర్పడుతూ జీవశక్తిని పెంచి భావోద్వేగాలకు చలించకుండా మరింత ఆనందంగా ఉండేలా చేస్తుందని తెలిపారు. అదే విదంగా బ్రహ్మకుమారీస్ సంస్థ వారు శివరాత్రి సందర్భంగా ప్రతిఏట అనేక ప్రజలకు ఉపయో గపడే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తునందుకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ కుటుంబసభ్యులు బీకే సరోజ, దీదీజీ చీఫ్ హెడ్ ఎస్.ఆర్. నగర్, బీకే. జ్యోతి సిస్టర్, వినాయక నగర్ ఇన్‌చార్జి, బీకే మాధవి, బాలానగర్ బ్రాంచ్ ఇన్‌చార్జితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భూ బదలాయింపు చేయాలి



- ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ లోని రక్షణ శాఖ భూములను బదలాయింపు చేసి కంటోన్మెంట్ బస్తీలలోని పేదలకు ఆ భూములలో పట్టాలు ఇప్పించాలని కోరుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంగళ వారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. భూ బదిలాయింపుతోపాటు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు కట్టించే ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా దాదాపు 10 వేల కుటుంబాలు లబ్ది పొందుతాయని చెబుతూ సీఎంకు ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వినతి పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు



- కాంగ్రెస్ నేత, ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ

నవతెలంగాణ-ఓయూ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సారథ్యంలో ఎస్సీలలోని వివిధ కులాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్న నేపథ్యంలో జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్ గడువును మరో నెల రోజుల పాటు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి, మాదిగ ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ నేత, ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ ఒక ప్రకటనలో కతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో అణిచివేత దోరణిలో పాలన ఉంటే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో వివిధ వర్గాల వాదనలకు స్పందించే నాయకత్వం ఉందన్నారు. ఇదే దేశంలో రాహుల్ గాంధీ కోరుకుంటున్న సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తి అని అన్నారు.

వైద్య సేవలకు బసవతారకం ఓ నిలయం

- బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకృష్ణ
- ఆస్పత్రిలో సీయూఎస్ఏ ప్రారంభం



నవతెలంగాణ - బంజారాహిల్స్

వైద్య సేవలకూ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఓ నిలయమని ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. మెదడు,కాలేయం ట్యూమర్లకు సంబంధించిన శస్త్ర చికిత్సలలో ఖచ్చితత్వాన్ని పెంపొందించే సీయూఎస్ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజతోత్సవాలు జరుపుకొంటున్న సమయంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలుగా అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని దఢ నిశ్చయంతో సంస్కృతి శిఖర ట్రస్టు వారు అందించిన పూర్తి ఆర్థిక సహాయంతో సూమారు రూ.90 లక్షల ఖర్చుతో కూడిన ఈ అత్యాధునిక శస్త్ర చికిత్స వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి రోగులకు అవసరమైన అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించడంలో ముందంజలో ఉందని వివరించారు. ఎంతో సున్నిత భాగాలకు సంబంధించిన గడ్డలను తొలగించడానికి ఎంతగానో ఉపయోగపడే సీయూఎస్ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను రోగుల కోసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని కారణంగా కాలేయం, మెదడుకు సంబంధించిన ట్యూమర్లను మరింత ఖచ్చితత్వంతో శస్త్ర చికిత్స ద్వారా తొలగించడానికి వీలువుతుందని చెప్పారు. ఈ ఆదునిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సహాయం అందించిన సంస్కృతి శిఖర్ ట్రస్టు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ వ్యవస్థను పేద, ధనిక తారతమ్యం లేకుండా అవసరమైన రోగులందరికీ వినియోగించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఈ అత్యాధునిక వ్యవస్థ ఉపయోగాలను డా. వెంకటేశ్వర రావు, న్యూరో ఆంకాలజిస్టు వారు వివరిస్తూ.. శస్త్ర చికిత్స చేసే సమయాలలో మెదడు లేదా కాలేయంలోని ఇతరత్రా కీలక రక్త నాళాలు, భాగాలకు ఎలాంటి నష్టం లేకుండా చూడవచ్చని వివరించారు. అంతేగాకుండా తక్కువ సమయంలో రక్తస్రావాన్ని చాలా వరకూ తగ్గిస్తూ శస్త్ర చికిత్స చేయవచ్చని చెప్పారు. దీంతో రోగికి పెద్దగా ఇబ్బందులు లేకుండా త్వరగా శస్త్ర చికిత్స నుండి కోలుకొని ఇంటికి వెళ్లడానికి వీలవుతుందని తెలిపారు. చివరగా సంస్కృతి శిఖర ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా తాము ఆరోగ్య రంగంలో ఎన్నో సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ రోగులకు ఎన్నో విలువైన సేవలు అందిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చి ఇన్స్టిట్యూట్ తో కలసి పని చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో కే కృష్ణయ్య, ఎండీ డా.టియస్ రావు,ఎం ఎస్, డా.ఫణి కోటేశ్వర రావు, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్టు డా.సుజిత్ ఛాయా పట్నాయక్, సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులు తోరల్ దేశాయి, మేనేజింగ్ ట్రస్టీ జిన్నీ, చైర్ పర్సన్ నిషాషా, పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

మోకాలు లోతుకే ఉప్పొంగిన నీరు

- హైడ్రా తవ్వకాల్లో బయటపడిన బతుకమ్మకుంట



నవతెలంగాణ-సిటీబ్యూరో

బతుకమ్మ కుంట బతికే ఉంది. మోకాలు లోతు మట్టి తీయగానే బిరబిరా నీరు ఉప్పొంగింది. ఇక అంతే అక్కడి స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కబ్జాల చెరలో చెరువు ఆనవాళ్లను కోల్పోయిన చెరువుకు ప్రాణం పోయమని స్థానికులు హైడ్రాను ఆశ్రయించిన విషయం విధితమే. ఈ మేరకు అక్కడి ముల్ల పొదలను తొలగించి తవ్వకాలు చేపట్టిన హైడ్రాకు నీరు స్వాగతం పలికింది. మంగళవారం మోకాలులోతు మట్టిని తీయగానే నీరు ఉబికి వచ్చింది. దశాబ్దాలుగా నింపిన మట్టిని మొత్తం తొలగిస్తే చెరువు కళకళలాడుతుందని స్థానికులు చెబుతున్నారు. అయితే బతుకమ్మ కుంట స్థలం తనదంటూ స్థానిక నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టుకు వెళ్లాలని సూచించిన విషయం విధితమే. నాటి నుంచి పనులను హైడ్రా కొనసాగించింది.

16.13 ఎకరాల విస్తీర్ణం... మిగిలింది 5.15 విస్తీర్ణం...

బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఉంది. అంబర్‌పేట మండలం, బాగ్అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 - 63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉండేది. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణమని సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఉంది. ప్రస్తుతతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వకానికి హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందన్న స్థానికులు అభిప్రాయపడ్డారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్న స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకొచ్చారు. బతుకమ్మ కుంట చుట్టూ సుందరీకరణ పనులను హైడ్రా చేస్తోంది. బతుకమ్మ కుంటలో నీటితో కళకళలాడితే పరిసర ప్రాంతల్లో పర్యావరణం, భూగర్భ జలాల పెరుగుదలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడనుంది.

బతుకమ్మ కుంట పరిసరాలను పరిశీలించిన అధికారులు

వాటర్ వర్క్స్ స్థానిక అధికారులు బతుకమ్మ కుంట పరిసరాలను పరిశీలించారు. బతుకమ్మ కుంటలో ఎలాంటి డ్రయినేజీ పైపు లైన్లు లేవని నిర్ధారించారు. బతుకమ్మకుంటకు డ్రయినేజీ నీరు వచ్చే ఇన్లెట్ కానీ ఔట్ లెట్ కానీ లేవని చెప్పారు. బతుకమ్మకుంటకు 250 మీటర్ల దూరంలో డ్రయినేజీ, తాగునీటి పైపు లైన్లు ఉన్నాయని చెప్పారు. లోతట్టు ప్రాంతం కనుక అక్కడ ఊటనీరు వచ్చే అవకాశం ఉందని తేల్చారు. ఒకేదగ్గర కాకుండా మరో 15 అడుగుల దూరంలో కూడా తవ్వి మట్టి తీసినా నీళ్ల రావడంతో వూట నీరు గానే పరిగణించాలని వాటర్ వర్క్స్ అధికారులు నిర్ధారించారు. అక్కడ నేల, నీటి స్వభావాన్ని పరిశీలించాక కుంట(చెరువు) ఆనవాళ్లుగానే వాటర్ వర్క్స్ అధికారులు పరిగణించారు.

చేనేతకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి



- నటి ప్రియాంక మోహన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

చేనేతకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని నటి ప్రియాంక అరుల్ మోహన్ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లో గ్రితి వీవ్స్ వారు తమ గ్రాండ్ పట్టు చీర కలెక్షన్‌తో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను మేనేజింగ్ డైరెక్టర్లు సౌజన్య, బాబీ తిక్క, టి.శ్రీనివాస్‌లతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ... చీరలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయనీ, సంప్రదాయ గాంభీర్యాన్ని సూచిస్తాయన్నారు. ఈ కలెక్షన్స్ చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. చీరలపై వీరి కున్న ఫాషన్ వెల కట్ట లేనిదని.. గ్రితివీవ్స్‌లో ఉన్నంత సేపు చీరల ప్రపంచంలో ఉన్నట్టుందన్నారు. ఆర్ట్, డిజైన్స్ చాలా బాగున్నాయని తెలిపారు. తనను ఆహ్వానించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ చీర బ్రాండ్‌లు సుసంపన్నమైన వారసత్వం, సంక్లిష్టమైన డిజైన్‌లు చీర ప్రియుల విభిన్న అభిరుచులకు అనుగుణంగా అగ్రశ్రేణి చీరలను అందించే ఈవెంట్‌ను గ్రితివీవ్స్ స్పెషల్‌గా మార్చుతుందనీ చెప్పారు.

నిర్వాహకులు సౌజన్య,బాబీ తిక్క టి.శ్రీనివాస్లు మాట్లాడుతూ.. "గ్రితి వీవ్స్ 2 సంవత్సరాల క్రితం స్థాపించినట్టు చెప్పారు. ఈ బ్రాండ్ నేటికీ పోషణలో ఉందన్నారు. ఇది భారతీయ నేత జానపద కథలు, వారి దేశీయ హస్తకళ, సంస్కృతి సాంప్రదాయ డిజైన్‌ల నుంచి ప్రేరణ పొందిందన్నారు. దేశంలోని ప్రతి ప్రాంతం నుంచి చీరలను సేకరిస్తామని చెప్పారు. తాము ప్రతి సందర్భానికి,తరానికి చీరలను అందిస్తూ మారుతున్న ట్రెండ్‌లకు అనుగుణంగా చీరలను అందించడానికి నేత కార్మికులతో కలిసి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అక్రమ ఇసుక నిలువలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు...



- నిలువ చేసిన 1098 టన్నుల ఇసుక సీజ్

నవతెలంగాణ-బేగంపేట

నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిలువ చేసిన ఇసుక స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా నిలువ చేసిన 1098 క్వింటాళ్ల ఇసును సీజ్ చేశారు. ఈ మేరకు నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుదీంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. నగరంలో అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి జారీచేసిన ఆదేశాల మేరకు ఇసుక డంపింగ్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించామని చెప్పారు. బయట నుంచి ఇసుకను తెచ్చి నగరంలోని పలు ప్రాంతాల్లో నిలువ చేస్తున్నారని, లారీ లోడుకు రూ.10వేలు ఉండగా, ఒక్క లారీ లోడు ఇసుకను రూ50వేలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఇలా డంప్ చేస్తున్న ఇసుకను నగర శివారు నుంచి లారీలో తరలిస్తున్నారని, అయితే రవాణా చేసే సమయంలో ఇప్పటి వరకు పట్టుబడలేదన్నారు. త్వరలోనే రహదారులపై నిఘాపెంచుతామన్నారు. నార్త్ జోన్ పరిధిలో తుకారాంగేట్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బేగంపేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇసుక డంపులపై దాడులు చేసి 889 టన్నుల ఇసుక, వెస్ట్ జోన్ పరిధిలోని జానకమ్మ తోట, యూసఫ్ గూడ లో 143 టన్నులు, సెంట్రల్ జోన్‌లోని ముషీరాబాద్, గాంధీనగర్, దోమల గూడలో 66 టన్నుల ఇక్రమంగా నిలువ చేసిన ఇసుకు డంపును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అక్రమంగా తరిలిస్తున్న ఇసుకుకు సరైన బిల్లులు, ఎలాంటి పత్రాలు లేవని, అనుమతులు లేకుండా డంపింగ్ యార్డులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఒక మాఫియాగా ఏర్పడి ఈ దందా కొనసాగిస్తున్నారని అన్నారు. అక్రమంగా నిలువ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ఇసుకను కొని మోసపోవద్దని డీసీపీ ప్రజలకు సూచించారు.

అమెరికా దుశ్చర్యలను ఖండిస్తున్నాం..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

అమెరికాకు వలస వెళ్లిన భారతీయులను ఆ దేశం ఖైదీల్లా చూస్తోందని,ఈ దుశ్చర్యను బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ. అమెరికా నుంచి వందలాదిమంది భారతీయులని బంధించి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలన్న నిబంధనలు ఉన్నాయని గానీ అమెరికా మాత్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు.భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యను పూర్తిగా ఖండించి, వెంటనే ట్రంపు చేసే నిరంకుశ విధానాలకు స్వస్తి పలికే విధంగా ప్రధానమంత్రి, విదేశాంగ శాఖ మంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో, చర్చలు జరిపి వారి విధానాలకు స్వస్తి పలకాలన్నారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధ్యక్షులు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్వీ ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు. నాగేందర్ కోదాటి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జాన్ వెస్లీకి ఓయూ విద్యార్థుల వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో పరిశోధక విద్యార్థులు యూనివర్సిటీలో ప్రధాన సమస్యలపై మంగళవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి వినతి పత్రం అందజేశారు. ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు పరిశోధక విద్యార్థులు ఆర్ఎల్ మూర్తి, కంచర్ల బద్రి, గాదె వెంకట్, ఉదయ్, నాగరాజు చక్రవర్తి,క్రాంతి రాజ్,లెనిన్ రాజు, శెట్టి, శ్రీకాంత్,ఉదయ్,కరణ్,శ్రీకాంత్ పాల్గొన్నారు. ఓయూ సమస్యలపై స్పందించి ముఖ్యమంత్రికి లేఖ రాసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



రేపు విప్లవ విద్యార్థుల సమైక్య సదస్సు

నవతెలంగాణ-బంజారాహిల్స్

చీకటి నీడల్లో ఉన్న గ్రామీణ ప్రాంతాలతో పాటు చిన్న చిన్న టౌన్లలో సైతం 70,80 దశబ్దాల విద్యార్థి పోరాటాలు వెలుగులు నింపిన జీవిత చరిత్రను తెలుసుకోవడం కోసం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న 50 ఏండ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు పోస్టర్లను ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విప్లవతో కలిసి మాట్లాడారు. 1970 వ సంవత్సరం విద్యార్థుల కలయిక గొప్ప విషయమని, విప్లవ ఉద్యమ చరిత్ర సదస్సు గా అభివర్ణించారు.

ఎమ్మెల్సీ నవీన్ తక్షణమే క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ - బంజారాహిల్స్

రెడ్డి కులస్తులపై స్వలాభం కోసం ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న తక్షణమే క్షమాపణ చెప్పాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెం గారి మాధవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, కాంతాల నారాయణరెడ్డిలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మార్చి 11న చలో ట్యాంక్ బండ్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెడ్డిలందరితో మార్చి 11న "రెడ్డి మార్చ్" చేసి హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని తెలిపారు. అతను వ్యాఖ్యలు చేసి ఇన్ని రోజులైనా కాంగ్రెస్ పార్టీ మల్లన్నపై చర్యలు ఎందుకు తీసుకోవట్లేదో అర్థం కావట్లేదన్నారు. క్షమాపణ చెప్తే సరే లేదంటే తామేంటో చూపిస్తామని హెచ్చరించారు.

అంసా ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతిని కార్యక్రమాన్ని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షులు నామ సైదులు ఆధ్వర్యంలో మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా నిర్వహించారు. నామ సైదులు మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ దక్కన్ పీఠభూమిలో భాగ్యనగరం నడిబొడ్డున ధ్రువతార అని, సామాజిక ఉద్యమకారులకు తొలి గురువు అన్నారు. సాధారణ దళిత మాల కుటుంబానికి చెందిన మాదిరి వెంకటయ్య, రంగమాంబ దంపతులకు హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లో భాగ్యరెడ్డి వర్మ జన్మించారని, యుక్త వయసులో సుల్తాన్ బజార్ లో ఆర్య సమాజంలో కొంతకాలం పని చేశాడని, ఆర్య సమాజం నిర్వహకులు కిషన్ రావు ఆయన సేవలను గుర్తిం చి వర్మ అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆ రోజుల్లో రెడ్డి కులానికి ఇచ్చే గౌరవాన్ని చూసి రెడ్డి అంటే పరిపాలదక్షుడిగా గౌరవం ఉంటుందని వారి కన్నా తమ జాతులు తక్కువ కాదని ఆయన పేరులో రెడ్డి చేర్చుకున్నాడని తెలిపారు. అలాగే భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి దళిత బాలికలకోసం 26 పాఠశాలలో నెలకొల్పాడని గుర్తు చేశారు. బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఒకవైపు విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూనే సాంఘిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. జగన్ మిత్రమండలి, ఆది హిందూ సోషల్ లీగ్ లీగ్ లీగ్ సంస్థలు ఏర్పాటు చేశారని చెప్పారు. అణగారిన వర్గాల ఆత్మస్థైర్యం కోసం నిరంతరం పోరాడుతున్న హైదరాబాద్‌లో ఎన్నో సంఘసేవ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. బౌద్ధమతం స్వీకరించాలని నిర్ణయించుకున్నారని, అందులో భాగంగానే అంబేద్కర్ కంటే ముందు బుద్ధ పూర్ణిమ రోజు 1915 లో బౌద్ధమతం స్వీకరించారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ సేవలు గుర్తించి తెలంగాణ ప్రభుత్వం జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించడం స్వాగతిస్తున్నామన్నారు. భాగ్యరెడ్డివర్మ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. అడ్వకేట్ సత్యనారాయణ, ఓయూ విద్యార్థి నాయకులు ఏనపోతుల అరుణ్ కుమార్ కోరే మహేష్,చెరుకు కష్ణ, పుల్లగిరి అశోక్, కుమార్, దుర్గం రమేష్, శివ, రవీందర్,వంశీ, రవీందర్ పాల్గొన్నారు.

రహమత్ నగర్‌లో
కాంగ్రెస్ నాయకులు మధ్య నాయకత్వ పోరు..!

- భవాని శంకర్ ఫ్లెక్సీలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు
- సీఎన్ రెడ్డి ఫ్లెక్సీలు కూడా తొలగించాలని డీసీకి భవాని శంకర్ అభిమానుల ఫిర్యాదు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

రహమత్ నగర్ డివిజన్‌లో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు మధ్య రాజకీయ వైరం నడుస్తున్నది. భవాని శంకర్ పుట్టినరోజు ఫ్లెక్సీలను ఒక్క రోజులోనే జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. దాంతో సీఎన్ రెడ్డి పెక్సీ లను కూడా తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు భవాని శంకర్ అభిమానులు ఫిర్యాదు చేశారు.

రహమత్ నగర్ డివిజన్‌లో గత 20 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉండి పీజేఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తన తల్లి బండపల్లి చంద్రమ్మను(లేట్) రెండు సార్లు రహమత్ నగర్ కార్పొరేటర్‌గా అత్యధిక మెజార్టీతో గెలిపించిన నాయకుడు భవాని శంకర్. అదే విధంగా రహమత్ నగర్ డివిజన్ ప్రజలు గత 30 సంవత్సరాలుగా హై టెన్షన్ వైర్లు ఇండ్ల పైన ఉండడంతో ఒక్క అంతస్తు ఇండ్లు మాత్రమే నిర్మించుకున్నారు. ఎంతో పోరాటం చేసి హై టెన్షన్ వైర్లను తొలగించారు భవాని శంకర్. అనంతరం రహ్మత్ నగర్ లో హై టెన్షన్ వైర్ల కింద ఉన్న ఇంటి యజమానులు అందరూ మూడు- నాలుగు అంతస్తుల ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ గా గెలిచి కొంతమంది బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీ ఎన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుండి అసలైన కాంగ్రెస్ నాయకులు మధ్య,బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు మధ్య రాజకీయ వైరం నడుస్తున్నది. అందులో భాగంగా ఈనెల 16న ఆదివారం భవాని శంకర్ పుట్టిన రోజు జరుపుకోగా ఆయన అభిమానులు యూసఫ్ గూడలో, రహమత్ నగర్ లో పుట్టినరోజు బ్యానర్లను ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం సాయంత్రం ఎవరో ఫిర్యాదు చేశారని భవాని శంకర్ ఫ్లెక్సీలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న భవాని శంకర్ అభిమానులు తాము కూడా ఫిర్యాదు చేస్తామని.. సీ ఎన్ రెడ్డి ఫ్లెక్సీలు తొలగించాలని డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాకు ఫిర్యాదు చేశారు . అయితే సీఎన్‌రెడ్డి ఒక నెల రోజులకు ఫ్లెక్సీలు ఉంచుకునేందుకు చలానా చెల్లించారని ఫిర్యాదు చేసిన వారికి డీసీ తెలిపారు. దాంతో తాము కూడా చలానా చెల్లిస్తామని భవాని శంకర్ ఫ్లెక్సీలు తొలగించవద్దని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే మీ వద్ద చలానా తీసుకోబోమని డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని భవాని శంకర్ అభిమానులు ఆరోపిస్తున్నారు బుధవారం జీహెచ్ఎంసీ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతామని వారు హెచ్చరిస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో నాగరాజు(రహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి) సుందర్ రాజ్, అరుణ్ గౌడ్, బెన్హర్ ,సాయి తదితరులు ఉన్నారు.

వాహనాలు చోరీ చేసే దొంగ దొరికాడు

నవతెలంగాణ - బంజారాహిల్స్

నగరంలో ఈజీ మనీ కి అలవాటు పడి రకరకాల చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడుతున్న నిందితుల్లో మార్పు శూన్యమే. అటువంటి ఓ దొంగనే ఫిల్మ్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.. ఈ నెల 16 న హైదరాబాద్‌లోని ద్వారకా నగర్‌లోని ఓ నివాసం వద్ద పార్కింగ్ చేసి ఉన్న TG34T2871 నెంబరు ఆటో చోరీకి గురైందని పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతికత సహకారంతో ఆటో నడుపుతున్న సమయంలోనే నిందితుడు సయ్యద్ అబ్దుల్లా ఏ అబ్దుల్లా ఓక్లహెూమాను పట్టుకున్నారు. ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డితో పాటు క్రైమ్ సిబ్బంది టాస్క్ ఫోర్స్ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న నిందితుడు మోయిన్ బాగ్‌కు చెందనవాడని, ప్రస్తుతం సలాలా,వెంకటపూర్ కొత్తపేట,బార్కాస్‌లో నివసిస్తున్నట్టు తెలిసింది. ఈజీ మనీ కోసం ఇదే నెలలో గుడిమల్కాపూర్ పరిధిలో ఆటో TS-07-UA-1532 ఆటోను దొంగతనానికి పాల్పడినట్టు నిందితుడు ఒప్పుకున్నాడు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసిన ఆటోను TG34T2871ను స్వాధీనం చేసుకొని 303(2) బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.ఇంత త్వరగా కేసులు పరిష్కరించడం పట్ల వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ఇన్‌స్పెక్టర్‌ను, పోలీసు బృందాన్ని అభినందించారు.



ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

15 సెల్ ఫోన్లు ,7 లాప్‌టాప్స్ స్వాధీనం.. బ్యాంకు అకౌంటు లోని రూ. 4 ,73, 508 హెూల్డ్ చేయించిన ఎస్ఆర్ నగర్ పోలీసులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నిందితులను అరెస్టు చేసిన సంఘటన, ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, జయప్రకాష్ నగర్ లో ఓ ఇంట్లో గత కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్టు ఎస్సార్ నగర్ ఎస్సై శ్రవణ్ కుమార్‌కు సమాచారం వచ్చింది. వెంటనే వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ అన్వేషణలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి ,డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం గోపాల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో కలిసి వెళ్లి బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 15 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారి అకౌంట్‌లో ఉన్న నగదును నిలిపివేశారు. అరెస్ట్ అయిన ముగ్గురు నిందితులు లింగాల అరుణ్ రాజ్ , లింగాల సాకేత్, మేకల సంజయ్, ఇద్దరు నిందితులు పెద్దపల్లి జిల్లా, రామగుండం మండలం, ఎలకలపల్లి గ్రామానికి చెందినవారు. మూడో నిందితుడు కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి మండలం ,మెర్పల్లి గ్రామానికి చెందినవాడు. ప్రధాన నిందితుడు తైవాన్ లో ఉంటూ హైదరాబాదులో క్రికెట్ ఇన్‌స్టాగ్రామ్ పేజీ లో " క్రికెట్ 360 మీడియా క్రికెట్ రిలేటెడ్ కాంట్రాక్ట్ వీడియో ద్వారా బెట్టింగ్ ఆడిస్తున్నట్టు తెలిసింది. ప్రధాన నిందితుడితో పాటు మరో 9 మంది క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్నట్టు ఆధారాలు సేకరించామని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని అందరిపై పలు సెక్షన్ల కింద గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశామని ఎస్సార్ నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- పద్మభూషన్ పుల్లెల గోపీచంద్
- ఘనంగా సెయింట్ ఆంథోనీ ఇన్స్టిట్యూషన్స్ రజతోత్సవ వేడుకలు

నవతెలంగాణ-దుండిగల్

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకో వాలని ఇండియన్ బ్యాడ్మింటన్ టీం నేషనల్ కోచ్ పద్మభూషన్ పుల్లెల గోపీచంద్ తెలిపారు. కొంపల్లి లోని జీబీఆర్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూ షన్ నిర్వహించిన రజితోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి విద్యా ర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచి కష్టపడే తత్వంన్ని అలవర్చు కోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమ్మని తాము రూపాంతరించుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల, సంస్కృతిక, నృత్య, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం మాజీ టీ జీటీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల వల్ల విద్య వ్యాపారంగా మారిందని, ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను



అందిస్తూ 25 సంవత్సరాలుగా అకుంఠిత దీక్షతో విద్యాసంస్థ నడిపిస్తున్న సుందర్ రాజని అభినందించారు, అనంతరం సెయింట్ అంథోని గ్రూప్ చైర్మెన్ ఎస్ పీ సుందర్ రాజు మాట్లాడుతూ తమ విద్యాసంస్థ 2000 సంవత్సరంలో సుచిత్రలో 30 మంది విద్యా ర్థులతో స్థాపించామని, స్థాపించిన నాటి నుంచి నేటి వరకు విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో తమ సంస్థలో అకుంటిత దీక్షతో పనిచేస్తున్నామని తెలిపారు.అనంతరం విద్యార్థుల ఎ చేసిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు అందరిని అలరించాయి. గత సంవత్సర పది ఫలితాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రం అందించి శాలువాతో సత్కరించారు. టీజీ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జట్టి కుసుమ కుమార్, చక్రపాణి, మెట్రో టీవీ ఎం డి.జయప్రసాద్, నరేశెట్టి థామస్, , మాజీ కార్పొరేషన్ భాను, కరస్పాండెంట్ రాంబాబు, శ్రీనివాస్ ప్రిన్సిపాల్ నరిశెట్టి సరిత, ఉపాధ్యాయుల విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మంచి విద్యా వ్యవస్థకు కృషి చేద్దాం..

- ప్రభుత్వ విద్యా విధానం మెరుగుపరచాలన్నదే సర్కారు ఉద్దేశం
- మానవ అభివృద్ధిలో ప్రపంచంలో మన దేశం 136 స్థానంలో...
- విద్యను అభివృద్ధి చేస్తే తప్ప ముందుకు వెళ్లలేం
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్ పర్సన్ ఆకునూరి మురళి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత ప్రభుత్వం అలసత్వం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడిందని, ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్ పర్సన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పేరెంట్స్, ఎన్జీవోలు, మండల విద్యాధికారులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి విద్యా విధానంపై వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ మానవ అభివృద్ధిలో ప్రపంచంలో మన దేశం 136 స్థానంలో ఉందనీ, విద్యాభివృద్ధి చేస్తే తప్ప ముందుకు వెళ్లలేమని తెలిపారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఏర్పడిన తర్వాత తాను దాదాపు 260 విద్యా సంస్థలను పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలలో అందరి సలహాలు అభిప్రాయాలను తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వ అలసత్వం వల్ల విద్య వ్యవస్థ కుంటు పడిందని, విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. తాను, కమిషన్ సభ్యులు నిరంతరం కృషి చేస్తున్నామనీ, ఒక మంచి విద్యా వ్యవస్థను తీసుకువచ్చి మంచి భవిష్యత్తును నిర్మించ డానికి అందరం కలిసి ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో రాయడం, మాట్లాడడం రావాలని, మ్యాథ్స్, సైన్స్, సోషల్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరితో కలిసి పని చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఫౌండేషన్ లిటరసీ, విద్యా ప్రమాణాలు పెరగాలన్నారు. ప్రాథమిక నైపుణ్యాలు, చదవడం రాయడం మెరుగుపడాలన్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, సలహాలు సూచనలు ఇవ్వాలని విద్యా వ్యవస్థ బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, కె.జోష్న శివారెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఈవో ఆర్.రోహిణి, డీఐఈవో ఒడ్డెన్న, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐవోఎస్‌లు, జూనియర్ లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




సిబ్బందికి పోస్టల్ బాండ్ల పంపిణీ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పని చేసే సిబ్బంది సంక్షేమం, భవిష్యత్ అవసరాలకు పొదుపు అవసరం అని భావించి,తపాలా బీమా విభాగం అధికారి శ్రీనివాసరావు సలహా మేరకు, సిబ్బందికి చిన్న- చిన్న మొత్తాలను పొదుపు చేయడం వల్ల కలిగే భవిష్యత్ ప్రయోజనాలను పలు దఫాలుగా అవగాహన కల్పించారు. తపాలా బీమా సదుపాయం వల్ల కలిగే ప్రయోజనాలు, పొందే సౌకర్యాలను తెలుసుకొని సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారికి అనుకూలంగా ఉన్న బీమా పాలసీలు తీసుకున్నారు. వారందరికీ మంగళవారం బీమా బాండ్లు పంపిణీ చేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు - పల్స్ పోలియో నివారణకు వాడిన నినాదం అయితే, నిండైనా భవిష్యత్ కు చిన్న మొత్తం పొదుపు అనేది తపాలా బీమా విభాగం వారి సందేశం.

"హోమ్ గార్డులకు , సి.పి.యస్ ఉద్యోగులకు భవిష్యత్ ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ సదుపాయం ఉండదు. కాని తపాలా బీమా నందు పొదుపు చేసుకోవడం వల్ల పాలసీదారుల పొదుపు మొత్తానికి సమానంగా తపాలా శాఖా నుండి ప్రయోజనంతో పాటు, ప్రమాద బీమా కూడా వస్తుంది. జీవితం చివరిలో ఎవరికి భారం కాకుండా బ్రతకడంకోసం ఈ పొదుపు ఉపయోగం అవుతుంది. చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద ప్రయోజనాలు పొందవచ్చు. ఉద్యోగులే కాకుండా పట్టభద్రులు కూడా ఈ బీమా సదుపాయాలు ఉపయోగించు కొనవచ్చు. మరిన్ని వివరాల కోసం పోస్టల్ ఇన్సూరెన్స్ అధికారి జూగుంట్ల శ్రీనివాసరావుని ఈ నెంబర్(9963172350) కు కాల్ చేసి లేదా మీ దగ్గర ఉన్న పోస్టు ఆఫీసు నందు సమాచారం తీసుకో వచ్చు. పొదుపు చేయండి- సహాయం కోరండి- బీమా చేయడం నిర్లక్ష్యం చేయకండి" అని సందేశం ఇచ్చారు. అనంతరం ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు సిబ్బంది పోస్టల్ అధికారికి , ఇన్‌స్పెక్టర్ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.



సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌కు వినతి

నవతెలంగాణ - చర్లపల్లి

ఇందిరానగర్ స్ట్రీట్ నెంబర్ 9, 10లలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని బస్తీ వాసులు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఇంద్రానగర్ లో ఉన్నటువంటి అన్ని విధుల్లో భూగర్భ డ్రయినేజీలు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కేవలం మూడు వీధుల్లో మాత్రం భూగర్భ డ్రయినేజీలు ఏర్పాటు చేయలేకపోవడం వల్ల సిమెంట్ రోడ్లు వేయలేకపోయామని ఇప్పుడు డ్రయినేజీ నిర్మాణాలు పూర్తయిన సందర్భంగా తొందర్లోనే సిమెంటు రోడ్లు వేయిస్తామని కార్పొరేటర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారుక్, ఫహీం అబ్దుల్, స్టీఫెన్, జయ్ రాజ్, అన్వార్ పాషా, జుబేదా బేగం, సయ్యద్ ముస్తఫా, మొహాద్ యాసీన్, ప్రభాకర్. వాషిమ్. హైదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT, At: Medchal
O.S.No.972 of 2024

BETWEEN:
Smt Nalla Manjula and others ...Plaintiffs
AND
The Tahasildar Quthbullapur mandal and all concerned ...Defendants

To
All concerned
The above named plaintiffs have filed the above suit for declaration to declare them as legal heirs of Late Nalla Chandra Shaker before this Hon'ble court. Please take notice that the above suit is posted on Date 25-02-2025 at 10-30-AM before this court, for your appearance along with documents if any in your support, failing which the matter will be decided according to law.

//BY ORDER OF THE COURT//
S.KAMALAKAR
B.SHAKER
Advocates
Plot No.37m 1 st floor, Green park, Suchitra, Hyderabad
Cell No. 9848362904

IN THE COURT OF HON'BLE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S.No:2697 OF 2024

Between :
State Bank Of India ....Plaintiff
Vs
M/s SRINIVAS CONFECTIONERY & Other ...Defendant

TO
D1.M/s SRINIVAS CONFECTIONERY Prop. Bodula Srinivas S/o B.Gangadhar Aged about : 48yrs;Occ. : Business H.No.7-128 /1, Near Ghatkesar Rly. Station Road, Ghatkesar, Keesara, Ranga Reddy-501301.
D2.Mr.Bodula Srinivas S/o B.Gangadhar H.No.1-10-185/3, Bharath Nagar, Near Insuland Bank, Temple Alwal, Secunderabad-500010.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no. D1, and D2 for a sum of Rs. 2,32,890/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 06.03.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //
S.INDIRA DEVI
ADVOCATE
H.NO : 17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S.

IN THE COURT OF THE HON'BLE II ADDL SENIOR CIVIL JUDGE CUM II ADDL CHIEF JUDICIAL MAGISTRATE, RANGA REDDY DISTRICT :: AT :: L.B.NAGAR
O.S.NO. 33 OF 2025

Between :-
Kambalapally Saritha Reddy & another ..Plaintiffs
(Rep by their SPA holder)
And
The Tahsildar, Rajendranagar Mandal & others. .....Defendants

Please take notice that the above plaintiffs herein have filed the above suit for declaration to declare them as the legal heirs of the deceased Sri. Kambalapally Narsimha Venkatraj Reddy S/o.Late K.Narsimha, who died on 22-03-2017 leaving behind them as his only surviving legal heirs/successors. The above suit is posted for your appearance on **28-02-2025.**
Hence, if any person or persons having any objection/interest in respect of the claims made by the plaintiffs may appear before the above said Hon'ble Court at 10.30 a.m on the above said date in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

SCHEDULE OF PROPERTY
All that the Semi- Finished Flat bearing NO.401 in Fourth Floor, with built up area of 1494 Sq.Feet (including a common area) and two car parking areas one each in stilt and cellar of " PARAMOUNT KINNERA " on Plots bearing No.75, 76 and 85 in Survey No.438/part, 472/part, 473, 474 and 475 with an undivided share of land admeasuring 55 Sq.yards out of 1192.32 Sq.yards, situated at Attapur Village, GHMC Rajendranagar Circle, Ranga Reddy District and bounded as follows:-

BOUNDARIES OF THE PLOTS
North : Road,**South :** Neighour's land
East : Plots No.72, 73 and 74
West : Plots No.84 and 77

BOUNDARIES OF THE FLAT
North : Open to Sky
South : Staircase, open to sky and Flat No.402,**East :** Open to Sky
West : Corridor and Flat No.404.

// By order of the Hon'ble Court//
Filed by:
M/s. Chirumarri Saidulu
V.Raju Goud
V.Haribabu
Advocates
Hyderabad
Mobile No. 9440055264.

IN THE COURT OF HON'BLE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S.No: 2699 OF 2024

Between :
State Bank Of India .....Plaintiff
Vs
M/s SRI LAXMI NARASIMHA ENGINEERING WORKS & Other ....Defendant

TO
D1.M/s SRI LAXMI NARASIMHA ENGINEERING WORKS Prop. Uppara Narsimha S/o Uppara Veeranna Aged about : 45yrs; Occ: Business H.No.1-204/4, Pipeline Road, Kerala Transport Road, Fathenagar, Balanagar, Hyderabad-500018.
D2.Mr.Uppara Narsimha S/o Uppara Veeranna H.No.10-5-21, Fathenagar, Post Office line, Balanagar, Moosapet, Hyderabad-500018.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no. D1 and D2 for a sum of Rs. 1,34,356/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 06.03.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //
S.INDIRA DEVI
ADVOCATE
H.NO : 17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL, SENIOR CIVIL JUDGE, AT: BHONGIR
I.A.NO.02 OF 2022
IN
O.S.NO.32 OF 2022

BETWEEN:
K.Surya Prakash Rao ...Petitioner/Plaintiff
AND
Gosukonda Sridhar Reddy and others ...Respondents/Defendants

NOTICE

To
6.Jakka Sreenath Reddy, S/o. J. Raghunath Reddy, Age 43 years, Occ: Employee, R/o.H.No.16-11-511/D/78, Shalivahana Nagar, Disukhnagar, Amberpet, Sripuram Colony, Hyderabad-500 036.
8.Mekala Venkatram Reddy, S/o. Late Narsimha Reddy, Age 56 yrs, Occ: Business, R/o.H.No.2-1-39, Raj Nagar Colony, Rajyalaxmi Theater, Hyderabad

That the above case is posted on 03-04-2025 for your appearance and in case, if you the above addressees herein fail to attend before the above said court in the above said case on 03-04-2025 at 10:30AM, the matter will be decided exparte

//BY THE ORDER OF THE HON'BLE COURT//
G.SREENIVAS REDDY
ADVOCATE BHONGIR
#H.No.1-3-217, Vidya Nagar, BHONGIR-508 116
YADADRI BHONGIR DISTRICT
Phone: 08685-242153
Cell: 98484 11034

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS, AT: HYDERABAD
O.S.4128 of 2024

Between:
Smt.Vedaraju Sita Maha Lakshmi and another ....PLAINTIFFS.
A N D
All Concerned and others ....DEFENDANTS

To,
Defe.No.3.Mr.Vedaraju Rajendra Prasad S/o. Late Vedaraju Siva Rama Krishna, R/o. H.No.8-3-167/K/188/a, Sai Padma Ratna Apartments, Kalyan Nagar, Venture-3, Yousufguda, Hyderabad., Telangana -5000 45 Presently staying at U.S.A

Whereas the Plaintiffs namely Smt. Vedaraju Sita Maha Lakshmi and her daughter namely Smt. Chandra Mohini Baikady have jointly filed the above Suit seeking declaration by declaring them and the Defendant No.3 Mr.Vedaraju Rajendra Prasad as the legal heirs of Late Vedaraju Siva Rama Krishna before the Hon'ble II Junior Civil Judge, City Civil Courts, at Hyderabad. The Hon'ble Court was pleased to order for publication to you, the Defendant No.3 in the above case. Therefore the Defendant No.3 Mr.Vedaraju Rajendra Prasad who have objection against the Plaintiffs claim is hereby summoned to appear before the Hon'ble II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD, in person or by a pleader on 05.03.2025 at10.30 A.M and further you are hereby directed to file your objections/claims and to produce the relevant documents in your support, otherwise the above case will be heard and determined on merits and in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)
M/s.K.DURGAPRASAD & Ch.VENKATESHWARLU
Advocates,
#5-10-194, Chakrapani Estate Saifabad,Hyderabad-500004.
Mb.No.7013549690

IN THE COURT OF HON'BLE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S.No:295 OF 2024

Between :
State Bank Of India ...Plaintiff
Vs
Mr.MOHAMMED SHAFI ...Defendant

TO
D1.Mr.Mohammed Shafi S/o Late Mohammed Yusuf Aged about : 48Yrs; Occ. : Business H.No. 12-B2-640, NFC Nagar, Ghatkesar, Ranga Reddy-501301.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant for a sum of Rs.3,30,256/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 06.03.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //
S.INDIRA DEVI
ADVOCATE
H.NO : 17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE. R.R. DISTRICT At L.B.Nagar
O.S.No.775 of 2020

Between:
Naram Hanmanth Reddy ...Plaintiff
AND
Naram Venkat Reddy and 6 others: ...Defendants

NOTICE

To
1.P.Harshavardhan, S/o.Rajeswar Rao R/o. Flat No. 406. Rank-I Towers Langar House, Hyderabad-500008
2.A.Venkateswari, W/o.Tara Prakash R/o.Flat No.202. Mashed Mansion 6-3-563/B/402. IC Quarters, Erramanzil Colony Banjara Hills, Hyderabad-500034
3.K.Raj Shekar, s/o. Sreeramulu R/o. 10-288/1, Vasanthapuri Colony Malkajgiri, Secunderabad-500047

WHEREAS the above named plaintiff filed the above suit against you and four others for declaration of 1) Gift Settlement Deed bearing document No.591/2009, Dt. 12.03. 2009, 2)Agreement of Sale cum GPA, bearing document No. 862/2009 Dt. 18.03.2009 and 3) Agreement of Sale cum GPA bearing document No. 863/2009 Dt. 18.03.2009, registered at the SRO. Gandipet. as null and void:
PLEASE take notice that the above suit stands posted for your appearance to 12.03.2025. You are required to appear before the Hon'ble Court at 10.30 a.m. on 12.03.2025 in person or through an advocate: failing which, the matter will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT//
Sd/
K.VENKATESWARLU.
Advocate.
2-43/A/2, Sai Nagar. Chaitanyapuri. Hyderabad-600060.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER FORUM-I: AT HYDERABAD
CC No.561of 2024

BETWEEN:
Naresh Goud Venkatapuram ...Complainant
AND
M/s PluckWalk Technologies Pvt. Ltd. (Brick&Bolt) & Others ...Opposite Parties

TAKE NOTICE

To
1.M/s PluckWalk Technologies Pvt. Ltd.(Brick&Bolt), Rep.by its Cofounder and CEO Jayesh Rajpurohit, S/o Not Known, Aged about: 50 Years, Occ: Cofounder and CEO
2.M/s PluckWalk Technologies Pvt. Ltd.(Brick&Bolt), Rep. by its authorized signatory Hemanth Sai Yeruvaka, S/ o Srinivas Benarjee Yeruvaka, Aged about: 50 Years, Occ: City Head Hyderabad Regd. Office at Clayworks, 16/2, 2nd Floor, Sobha Alexander Plaza, Commissariat Rd, Ashok Nagar, Bengaluru, Karnataka 560025 BriB Building, Plot No.1-98/75a-75b, Jubilee Enclave, Madhapur, Hyderabad-500081.
3.M/s Siri Constructions, Rep by its Authorized signatory Narwa Vikranth, S/o Not Known Aged about: 45Years, Occ: Contractor Karwan Branch, No.13-6-156/1, Upparbasti, Karwan, Land Mark below MNR School, Hyderabad - 500006 Mobile No. 8500033455, 7330917788, WhatsApp No. 8500033455, 7330917788
Email: vikranthsagar@gmail.com ...Opposite Parties.

Whereas the above complainant has filed complaint against you before the District Consumer Forum-I at Hyderabad in respect of Plot No:290, D.No-1453/2017/BK-I, JB Serene City, Ibrahimpatnam, bearing No.290 measuring 2400 sq.ft situated at Survey Nos - 625, 628/a/a, 627, 628, 624, 625/a/1, 625/u, 626/e. The above case stands posted on 13-03-2025. You are hereby required to appear in the above court in person or by pleaders duly instructed on 13-03-2025 at 10-30 O' Clock in the forenoon to Show Cause against the complaint, failing which the said complaint will be heard and determined ex-parte.

//By order of the Commission//
Counsels for the Complainant
M/s KUNDAVARAPU SUJATHA
MD HAROON UL RASHEED,
NARSIMHACHARY,
ADVOCATES, HYDERABAD
Cell: 9948950283/8919966336

PUBLIC NOTICE

GENERAL PUBLIC are hereby informed that our client is intending to purchase below mentioned schedule property from (1) Sri.Tirupari Achyut Kumar Reddy and (2) Sri.Tirupari Siddaram Reddy, both R/o.Flat No.302, SSD Heights, Plot No.73, 74, 85, 86, Mahadevapurm Kailash Hills Residential Project Phase-I, Gajularamaram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District and has already paid considerable amount as advance. Any person/s have any objection, claim, lease, easement, mortgage title, etc over the schedule property, they are hereby called upon to approach the undersigned with all documentary proof within 7 days from the date of this publication, otherwise our client will complete the sale transaction and any claims, objections raised thereafter will not be entertained and will be deemed void.

SCHEDULE OF PROPERTY
All that Flat No.102, D.No.02-067/281 to 295/190/ATO192/102 in First Floor with built up area of 1926 Sq.ft. (including common area and one car parking) together with undivided share of land admeasuring 60 Sq.yards out of 653.33 Sq.yards in the building known as "SSD PARK VIEW RESIDENCY" constructed on Plot Nos.190/A (part), 191 & 192 in Sy.Nos.281, 282, 283, 284, 288 & 295 situated at Mahadevapura, Kailash Hills, Residential Project Phase-I, Gajularamaram village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District and bounded by :
North : Corridor, Lift, Staircase & Flat No. 101
South : Open to Sky East : Open to Sky West : Open to Sky

K.KONDAIAH, Advocate,
Flat No. 102, First Floor, H.No.4-6/7, Plot No. 34, Gandhi Nagar, Lane No.8, Meerpet, Balapur (M),Hyd-97.
Mobile No. 7207779988

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.2311 OF 2014

Between:
Mohammed Abrar Ahmed and Others ...Plaintiffs
And
M.Sanjiva Reddy and Others ...Defendants

To,
1.Mrs.M.Vasantha W/o.Late. Bhoopal Reddy, Aged 62 Years Occ: House Wife, R/o.H.No.12-2-425, Gudimalkapur, Hyderabad
2.Mr.M.Sandeep Reddy S/o.Late. Bhoopal Reddy, Aged 36 Years Occ: Business, R/o.H.No.12-2-425 Gudimalkapur, Hyderabad
3.Mrs.R.Roja Reddy W/o.Late. M.Raghavender Reddy, Aged 30Yrs Occ: House Wife, R/o. H.No.12-2-425, Gudimalkapur, Hyderabad
4.Mr.M.Kalyan Reddy S/o.Late. M.Raghavender Reddy, Aged 5Yrs Occ: Student, minor represented by his Natural Guardian and Mother 10 th Respondent, R/o. H.No. 12-2-425, Gudimalkapur, Hyderabad

Whereas the above mentioned Plaintiffs has instituted the present O.S. 2311 of 2017 against you for perpetual injunction. The said case is posted to 04.03.2024. The notices sent by the Hon'ble court returned unserved. Therefore, the Hon'ble court ordered notice by way of publication. Hence you are hereby called upon to appear before this court in person or through an advocate on 04-03-2025 at 10:30 AM. Otherwise, the O.S. will be heard and determined in your absence.
[The present Notice is being published as substituted service as per the Hon'ble Court order Dt.04/02/2025 in O.S. No.2311/2014.]

// By order of the court//
G. Thirupathi Reddy
Advocate
Office at Flat No.201, Veeru castle Apartments, Near Ganesh Temple, Durga Nagar Colony, Punjagutta, Hyderabad - 500082

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.2310 OF 2014

Between
R.Dayakar chary and Others ...Plaintiffs
And
M.Sanjiva Reddy and Others ...Defendants

To,
1.Mrs.M.Vasantha W/o. Late. Bhoopal Reddy, Aged 62 Years Occ: House Wife, R/o.H.No.12-2-425, Gudimalkapur, Hyderabad
2.Mr.M.Sandeep Reddy S/o.Late. Bhoopal Reddy, Aged 36 Years Occ:Business, R/o.H.No.12-2-425, Gudimalkapur, Hyderabad
3.Mrs.R.Roja Reddy W/o.Late. M.Raghavender Reddy, Aged 30 Years Occ: House Wife, R/o. H.No. 12-2-425, Gudimalkapur, Hyderabad
4.Mr.M.Kalyan Reddy S/o.Late. M.Raghavender Reddy, Aged 5 Years Occ: Student, minor represented by his Natural Guardian and Mother 10 th Respondent, R/o. H.No. 12-2-425, Gudimalkapur, Hyderabad

Whereas the above mentioned Plaintiffs has instituted the present O.S. 2310 of 2017 against you for perpetual injunction. The said case is posted to 04.03.2024. The notices sent by the Hon'ble court returned unserved. Therefore, the Hon'ble court ordered notice by way of publication. Hence you are hereby called upon to appear before this court in person or through an advocate on 04-03-2025 at 10:30 AM. Otherwise, the O.S. will be heard and determined in your absence.
[The present Notice is being published as substituted service as per the Hon'ble Court order Dt.04/02/2025 in O.S. No.2310/2014.]

// By order of the court//
G.Thirupathi Reddy
Advocate
Office at Flat No.201, Veeru castle Apartments, Near Ganesh Temple, Durga Nagar Colony, Punjagutta, Hyderabad - 500082

IN THE COURT OF THE HON'BLE VIII ADDL. DIST JUDGE, RANGA REDDY DIST : AT L.B.NAGAR
AS No 213 OF 2022

Between :
Smt. T Karuna ... Appellant
AND
Mohd. Sharifuddin and others ... Respondents

To,
Shaik Munna, S/o Shaik Babu Miya, Aged: 56 Years, Occ: Business, R/o H.No 4-12-64/2/51, MM Pahadisharif, Balapur Mandal, Ranga Reddy Dist. ... Respondent No. 9

Please take notice that the Appellant herein had filed the aboveappeal being aggrieved by the judgment and decree passed in OS No. 534/2020dated 18-10-2022, on the file of Hon'ble II Addl. Senior Civil Judge, RangaReddy Dist at L.B.Nagar against the you and others and the samehasbeenposted for your appearance on 10-03-2025. Hence, you are make it convenient to appear before theHon'bleCourt, on **10-03-2025** at 10:30 AM. Otherwise the matter will bedecidedagainst you.

**\\ By order of the court **
M/s. G. CHANDRA SHEKAR REDDY
Advocates
Plot No. 66, RTC Colony, Champapet, Hyderabad –79.

IN THE COURT OF HON'BLE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S.No: 294 OF 2024

Between :
State Bank Of India .....Plaintiff
Vs
M/s RAMANJANEYA KIRANA & GENERAL STORE & Other .....Defendant

TO
D1.M/s RAMANJANEYA KIRANA & GENERAL STORE Prop. L.Naveen Kumar S/o Keshavulu Lothumalla Partner Lothumalla Jyothi D/o Madhaar Vemula H.No.2-34, Nacharam Village, Nacharam, Uppal Khalsa, Medchal (Malkajgiri) Ranga Reddy-500076.
D2.L.Naveen Kumar S/oKeshavulu Lothumalla Aged about : 40Yrs, Occ. Business, H.No.4-3-77/1, Erukula Basti, Nacharam Village, Uppal Khalsa, Medchal (Malkajgiri) Ranga Reddy-500017.
D3.Smt. Lothumalla Jyothi D/o Madhaar Vemula Aged about : 37Yrs, Occ. Business, H.No. 4-3-77/1, Erukula Basti, Nacharam Village, Uppal Khalsa, Medchal (Malkajgiri) Ranga Reddy-500017.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no. D1, D2 and D3 for a sum of Rs. 3,41,355/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 06.03.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //
S.INDIRA DEVI
ADVOCATE
H.NO : 17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S.

IN THE COURT OF THE HON'BLE II ADDLJUNIOR CIVIL JUDGE-CUM II ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: MEDCHAL/MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI
O.S.No.130 OF 2025

BETWEEN:
Chundi Narasimha Swamy and also rep. Chundi Narasimha Ravi Kiran and also rep her GPA Holder Smt.Chundi Naga Hima Sree ...Plaintiff 1 to 3
And
1.The Tahsildar, Malkajgiri Mandal, Neredmet,Medchal/Malkajgiri District
2.All concerned ...Defendants

To,
1.The Tahsildar, Malkajgiri Mandal, Neredmet, Medchal/Malkajgiri District
2.All concerned

The above named plaintiffs have filed the above numbered suit for declaration of Title to declare the plaintiffs i.e, 1.Chundi Narasimha Swamy, S/o.Late Chundi Sundara Ramaiah, 2.Chundi Narasimha Ravi Kiran, s/o.Chundi Narasimha Swamy & 3.Smt.Chundi Naga Hima Sree, W/o.late.M.Hari Krishna, as the legal heirs of late. Smt.Chundi Suvarchala Ratna kumari (maiden name Vinnakota Suvarchala Ratna Kumari) and for that reason you are hereby called upon to be present in person or through your counsel duly instructed on 20 th day of March, 2025, at 10.30 AM before the said court, failing which the above suit will be decided against you:

Schedule of property
in respect of plaint schedule property i.e landed property of open plot No.40 admeasuring 300 Sq.Yards equivalent to 250.84 mtrs in Survey No.57 situated at Ahmedguda Village(Bandlaguda), Gram Panchayat of Chiryal Village, Medchal, Medchal/Malkajgiri district, erstwhile Ranga Reddy District and bounded as: North by: Plot No.41, South: by Plot No. 39, East:by :25' wide Road and West: Plot Nos. 45 & 45

"BY THE OF THE COURT"
B.Siva Prasad
Advocate
Flat No:202, II Floor
Sai Darshan Apartments
P.V.N Colony, Mirjalaguda, Malkajgiri, Hyderabad,
Mob:9391137379

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: AT BHONGIR
O.S.NO.32 OF 2022

BETWEEN:
K.Surya Prakash Rao ...Plaintiff
AND
Gosukonda Sridhar Reddy and ...Defendants

NOTICE

To
6.Jakka Sreenath Reddy, S/o. J.Raghunath Reddy, Age 43 years, Occ: Employee, R/o.H.No.16-11-511/D/78, Shalivahana Nagar, Dilsukhnagar, Amberpet, Sripuram Colony, Hyderabad-500 036.
8.Mekala Venkatram Reddy, S/o. Late Narsimha Reddy, Age 56yrs, Occ Business, R/o.H.No.2-1-39, Raj Nagar Colony, Rajyalaxmi Theater, Hyderabad.

That the above case is posted on 03-04-2025 for your appearance and in case, if you the above addressees herein fail to attend before the above said court in the above said case on 03-04-2025 at 10.30AM, the matter will be decided exparte.

//BY THE ORDER OF THE HON'BLE COURT//
G.SREENIVAS REDDY
ADVOCATE BHONGIR
#H.No.1-3-217, Vidya Nagar, BHONGIR-508 116
YADADRI BHONGIR DISTRICT
Phone: 08685-242153
Cell: 98484 11034

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: AT: BHONGIR
I.A.NO.01 OF 2022
IN
O.S.NO.32 OF 2022

BETWEEN:
K.Surya Prakash Rao ...Petitioner/ Plaintiff
AND
Gosukonda Sridhar Reddy and others ...Respondents/Defendants

NOTICE

To
6.Jakka Sreenath Reddy, S/o. J.Raghunath Reddy, Age 43 years, Occ: Employee, R/o.H.No.16-11-511/D/78, Shalivahana Nagar, Dilsukhnagar, Amberpet, Sripuram Colony, Hyderabad-500 036.
8.Mekala Venkatram Reddy, S/o. Late Narsimha Reddy, Age 56 yrs, Occ. Business, R/o.H.No.2-1-39, Raj Nagar Colony, Rajyalaxmi Theater, Hyderabad

That the above case is posted on 03-04-2025 for your appearance and in case, if you the above addressees herein fail to attend before the above said court in the above said case on 03-04-2025 at 10.30AM, the matter will be decided exparte.

//BY THE ORDER OF THE HON'BLE COURT//
G.SREENIVAS REDDY
ADVOCATE BHONGIR
#H.No.1-3-217, Vidya Nagar, BHONGIR-508 116
YADADRI BHONGIR DISTRICT
Phone: 08685-242153
Cell: 98484 11034

IN THE COURT OF THE HON'BLE XIV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
I.A.No.353 of 2024
In
O.S.No.508 of 2014

Between:
KANTILAL NARANIA ...Petitioner/Plaintiff
And
1.Dr.BrijlalNarania (died per LRs)
2.Vinod Kumar Narania (died per LRs) ....Respondents/Defendants
3.Miss Gita Narania and others ...Proposed Respondents/ Proposed Defendants 3 to 7
4.Kausalya Narania and others ...Proposed Respondents/ Proposed Defendants 8 to 13

NOTICE

To,
1.Miss Gita Narania W/o Dr. Brijilal Narania, Aged about74 years, Occ: Housewife.
2.Umesh Narania S/o Dr. Brijilal Narania, Aged about 50 years, Occ: Private Service.
3.Durgesh Narania S/o Dr. Brijilal Narania, Aged about 47 years, Occ: Private Service.
4.Sangita Narania, D/o Dr. Brijilal Narania, Aged about 55 years, Occ: Housewife
5.Sudha Rani Narania, D/o Dr. BrijilalNarania. Aged about 53 yrs, Occ: Housewife.(LRs of Defendant no.1)
Sl.No 1 to 5 are R/ H.No 4-3-716-719 Ram Kote, Hyderabad, TS. ...Proposed Respondents 3 to 7/Proposed Defendants 3 to 7

Please take notice that the Petitioner/ Plaintiff filed a petition under Section 5 of the Limitation Act to condone the delay of 58 days vide I.A No 353 of 2024 in O.S No 508 of 2014. The same is posted for your notice on 28-02-2025 at 10:30 AM in the above case and thus, kindly approach in the court of the Hon'ble XIV Additional Chief Judge, city civil court at Hyderabad on 28-02-2025 at 10:30 AM either in person or through counsel failing which the matter shall be decided as per law.

//BY ORDER OF THE COURT //
V.KUMAR PUROHIT
R. KRISHNA RAO SYED SUBHANUDDIN
Advocates
Office: Flat No.403, 4th Floor, Konark Towers, Dilsukhnagar, Hyderabad. T.S, Cell: 9246161911

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య..

● జీపీఎస్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.సురేష్ కుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యను అందిస్తున్నామని చిరాగ్ అలీ లోని జీపీఎస్ కూచే ప్రభుత్వ పాఠశాల (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం) ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం. సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ శాలలో మిడ్ డే మీల్స్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. పిల్లలకు విద్యతోపాటు క్రీడల్లో శిక్షణ, వివిధ డ్రాయింగ్ (చిత్రలేఖనం) లాంటివి తర్ఫీదు ఇస్తున్నామ న్నారు. తమ పాఠశాలలో అన్ని తరగతులకు 7మంది టీచర్లు ఉన్నారని తెలిపారు. పాఠశాలలో మొత్తం 108 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.

ఖాళీగా ఉన్న స్వీపర్ కార్మికుల పోస్టులు భర్తీ చేయాలి



నవతెలంగాణ-మెహిదీపట్నం

ఖైరతాబాద్ జోన్ సర్కిల్ 13లో ఖాళీగా ఉన్న స్వీపర్ కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ స్వీపర్ కార్మికులు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సర్కిల్ 13 మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కార్వాన్ సర్కిల్ పరిధిలోని శ్రీ లక్ష్మీ రాజేంద్ర, శ్రీ సూర్య గ్రూపులలో ఒక్కొక్క గ్రూపులలో ఏడు మంది చొప్పున 21 మంది ఉండాల్సి ఉండగా మొత్తం 16 మంది మాత్రమే ఉన్నారని దీంతో తమపై పనిభారం విపరీతంగా జరిగిందన్నారు. వెంటనే గ్రూపులలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్, సీపీఐ ఎం నాయకులు విట్టల్, స్వీపర్ కార్మికులు పాల్గొన్నారు.

తరుచుగా కూలిపోతున్న గోషామహల్

నాలా స్లాబ్ పనులపై సమగ్ర విచారణ చేపట్టాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర నేత ఎండీ అబ్బాస్
● నాలా దగ్గర నిరసన వ్యక్తం చేసిన సీపీఐ(ఎం) నాయకులు..





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్


గోషామహల్ చాక్నవాడిలో ప్రాంతంలో నాలాపై నిర్మిస్తున్న స్లాబ్‌లు తరుచుగా కూలిపోతున్నాయని ప్రజల ప్రాణాపాయ స్థితికి గురయ్యే ప్రమాదముందని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా స్థానిక సీపీఐ(ఎం) నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో చేపట్టిన నిరసనకు ఆయన హాజరై మాట్లాడుతూ.. గడిచిన కొద్ది కాలంలోనే 4 దఫాలు ఈ నాలాపై వేసిన స్లాబ్‌లు కూళిపోయిందని వాహనాలు నాలాలో పడిపోయాయని ప్రాణాపాయం తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టడం దీనికి కారణంగా సీపీఐ(ఎం) ప్రాథమిక పరిశీలనలో తెలిసిందని చెప్పారు. తక్షణం జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం జరుగు తున్న మిగతా పనుల్లో పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గోషామహల్ మెయిన్ రోడ్ నాలా ప్రక్క రోడ్డంతా కుంగిపోవడం వల్ల వేలాది వాహనాలు దారి మళ్లించారు. దీనివల్ల ప్రజలు అవస్థల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగు తున్నా స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలో సీపీఐ (ఎం) గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్, జిల్లా, జోన్ నాయకులు కే.జంగయ్య, ఎం.బాలు, ఎం.మీనా, ఎం.శ్రావణ్, నెమ్మది గోపాల్, ఎండి అయూబ్ ఖాన్, కిషన్ తదితరులున్నారు.

నత్తనడకగా సాగుతున్న అంబర్‌పేట

ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు పనులు

ఆరు సంవత్సరాలైనా నేటికీ పూర్తికాని ఫ్లైఓవర్

● సర్వీస్ రోడ్డు పనులన్నీ పెండింగే
● టౌన్ ప్లాన్ అధికారుల నిర్లక్ష్యంతో సర్వీస్ రోడ్లు కబ్జా
● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల వైఫల్యం
● వారం రోజుల్లో ఫ్లైఓవర్ ఓపెన్ చేయకపోతే నేను ఓపెన్ చేసా
● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
● అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్, అధికారులు





నవతెలంగాణ-అంబర్‌పేట

గత ఆరు సంవత్సరాల నుంచి వరంగల్ జాతీయ రహదారి అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు మొదలుపెట్టి ల్యాండ్ అక్విజేషన్ రూ. 229 కోట్లు, నిర్మాణ వ్యయం రూ.335 కోట్లు, మొత్తం వ్యయం రూ. 564 కోట్లు ఖర్చుపెట్టిన ఇంకా పూర్తి కాకపోవడంతో నత్తనడకనే సాగుతున్నాయి. నిత్యం అంబర్‌పేట ప్రజలు ఏదో ఒక రకంగా ఇబ్బందులు పడుతూ యాక్సిడెంట్లు అవుతున్న స్థానిక జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారం నిర్లక్ష్యంతో కొంతమంది నష్టపరిహారం పొందిన కూడా టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో మళ్లీ రోడ్డు ముందుకు నిర్మాణాలు చేపట్టడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సర్వీస్ రోడ్డు పనులు నెమ్మదిగా జరిగిన కనీస ఫ్లైఓవర్ ఓపెన్ చేయాలని ఓపెన్ చేస్తే వానదారులకు కొంత ఇబ్బందులు తప్పుతాయిని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నవతెలంగాణతో మాట్లాడుతూ అంబర్‌పేటలో నిర్మిస్తున్న ఫ్లైఓవరు వారం రోజుల్లో అధికారులు ప్రారంభించాలని, లేదంటే తామే కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆరేండ్లుగా అంబర్‌పేట ప్రజలు ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో అష్టాకష్టాలు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్య తీరకపోగా ఇంకా ఎక్కువైందన్నారు. ఈ ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయని సర్వీసు రోడ్ల సంగతి అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని చెబుతూ సాగదీస్తున్నారని మండిపడ్డారు. ఫ్లైఓవర్ కింద రోడ్డు అధ్వాన్నంగా మారిందని, ఫ్లైఓవర్ కట్టి కూడా లాభం లేకుండా పోయిందని చెప్పారు. సర్వీసు రోడ్లను ఇంకా అభివృద్ధి చేయలేదని, ప్రజలు ఎలా వెళ్తారో కూడా తెలియదని, ప్రజల అవసరాల కోసం వెంటనే ఫ్లైఓవర్ పై నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించాలన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మాజీ ఎంపీ వీ.హనుమంతరావులు కలిసి రావాలని కోరారు. అధికారికంగా ప్రారంభం ఎప్పుడైనా చేయండి కానీ ఇప్పుడు ప్రజల కష్టాలు తీరాలంటే ఫ్లైఓవర్ పై నుంచి వాహనాలను అనుమతించాలన్నారు. అంబర్‌పేట ప్రజల కష్టాలు తీరాలంటే అందరం ముందుకు వచ్చి అధికారులపై ఒత్తిడి తేవాలని, లేదంటే వారం రోజులు చూసి తామే వాహనాలు వెళ్లేలా కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తామని హెచ్చరించారు.

ఎట్టకేలకు ఫ్లైఓవర్‌ను సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ అధికారులు



అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ అంబర్‌పేటలో నిర్మితమవు తున్న ఛే నెంబర్ ఫ్లైఓవర్ పనులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మంగళవారం ఉదయం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, ఆర్అండ్‌బి ఈఈ ధర్మారెడ్డి, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ తది తరులతో కలిసి మొదట గోల్నాక చర్చి నుంచి నడుచుకుంటూ అంబర్‌పేట ముక్రం హెూటల్ వరకు వెళ్లారు. నిర్మాణం తీరును పరిశీలించారు. ముక్రం హెూటల్ దగ్గర రోడ్డుకు ఆనుకొని మసీదు ఉండడంతో ఆ రోడ్డు ఇరుకుగా మారింది. మసీదు గోడను తొలగింపు విషయమై మసీదు ప్రతినిధులతో చర్చించాలని, గోల్నాక వద్ద చర్చికి ఎదురుగా ఉన్న గ్రేవార్డు విషయమై కూడా చర్చించాలని ఈఈకి చెప్పారు. ఫ్లైఓవర్ పైకి ఎక్కి పరిశీలన చేశారు. పెండింగ్ ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వీలైనంత తొందరగా పనులన్నీ పూర్తి కావాలన్నారు. కమిషనర్ వెంట జీహెచ్‌ఎంసీ ఈ ఈ రమేష్, అంబర్‌పేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, మహేష్, బాబు, ఏఎంఓహెచ్ డా. హేమలత తదితరులు పాల్గొన్నారు .



ప్రభుత్వం ఇస్తానన్న తులం బంగారం ఎక్కడ..?

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదింటి ఆడపిల్లలు పెళ్లి చేసి ఇబ్బంది పడొద్దని ఆనాడు కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాలను అమలు చేశారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న తులం బంగారం ఎక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌జీ ఫంక్షన్ హాల్‌లో అంబర్‌పేట ఎమ్మార్వో వీర బాయి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 194 లబ్ధిదారులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు ఇ.విజయ్ కుమార్ గౌడ్, పద్మ వెంకట్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద తల్లిదండ్రులకు ఆడపిల్లల వివాహాలు భారంగా కావద్దని కేసీఆర్ ఈ పథకం తీసుకొచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి, అనిల్, వెంకటరమణ, మిరియాల శ్రీనివాస్, సంతోష్, వెంకటేష్, సంతోష్ చారి తదితర నాయకులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్యపై గళం వినిపిస్తా'

● స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యావంతులైన మేధావులరా రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీరు ఓటు వేసే ముందుగా ఒక్కసారి ఆలోచించుకోవాలని మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ కోరారు. వందల కోట్లు డబ్బులు వెదజల్లి గెలిచిన తర్వాత కనీసం మీ ఫోన్ కాల్ కూడా ఎత్తని అభ్యర్థులు కావాలో లేక మీ మధ్యనే ఉండి, మీ కోసం పని చేసే విద్యావంతుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలని కోరారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఆప్ రాష్ట్ర నేతలు విజయ్ మల్లంగి, యుమున గౌడ్, జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్యా నాయక్ మాట్లాడారు వందల కోట్లకు పడగలెత్తిన కోటీశ్వర్లు రాజకీయ పార్టీల ముసుగులు ధరించి పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసి అరచేతిలో స్వర్గం చూపుతూ గెలిచే ప్రయత్నం చేస్తున్నారని, విద్యావంతులైన ఓటరులారా మీ ఓటు మీలో ఒక్కరైనా విద్యావంతుడికి వేసి గెలుపించుకోవాలని కోరారు. అనేక ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారిన విద్యావంతుల పక్షాన తన వాణి వినిపించే అవకాశం కల్పించాల్సిందిగా ముస్తాక్ అలీ విజ్ఞప్తి చేశారు. తన సేవాభావం చూసి జాతీయ స్థాయి పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు పట్టభద్రుల ఓటర్ల గడపగడపకు వెళ్లి సెక్యూలర్ అభ్యర్థి మహ్మద్ ముస్తాక్ అలీని గెలిపించేందుకు కృషి చేయాలని దిడ్డి సుధాకర్ సూచించారు.

మంచినీటి లో ప్రెజర్ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చేపట్టాలి



● కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

మంచినీటి లోప్రెజర్ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చేపట్టాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అని అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్ర కేఫ్ వై జంక్షన్ చౌరస్తా సమీపంలోని బీ.ఎన్ రెడ్డి వీధి లోని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పావని జలమండలి అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. మంచినీటి లోప్రెషర్ సమస్య వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కావున సమస్యను అధిగమించేందుకు నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని వాటర్ వర్క్ డీజీఎం కార్తీక్ రెడ్డికి సూచించారు. డివిజన్‌లో తీవ్రతరంగా మారిన మంచినీటి లోప్రెషర్ సమస్యను ప్రత్యేక దృష్టి వహించి పరిష్కరించాలని ఆదేశించారు. నూతన సేవరేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు నివేదిక సమర్పించినట్లు, మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ నేతలు ఆనంద్ రావు,అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పునకు ప్రగతిశీల శక్తులతో కలిసి ఉద్యమిస్తాం

● సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి పురుషోత్తం



నవతెలంగాణ-ముషీరాబాద్

సామాజిక మార్పుకు ప్రగతిశీల శక్తులతో కలిసి ఉద్యమిస్తామని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి పురుషోత్తం తెలిపారు. సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రాల శేఖర్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రెండవ మహాసభ మే17,18 లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరపాలని నిర్ణయించడం జరిగిందని అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బి.పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రాల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న వరకట్న బాల్య వివాహాలు అత్యాచారాలు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మహిళలు కల్పించబడిన చట్టపర రాజ్యాంగపరమైన హక్కులను అమలు చేయాలని దేశంలో రాష్ట్రంలో నెలకొన్న కులతత్వం మూఢనమ్మకాలు మతతత్వం మొదలగు భావాలు నుండి విముక్తి చేస్తూ పార్టీ అభ్యుదయ భావాలను పెంపొందించుటకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డీడబ్ల్యుఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బి.సుజాత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీస్ సంధ్యారాణి, ఉపాధ్యక్షులు వంటిపుల్లి నాగేంద్రమ్మ, పార్టీ సీనియర్ నాయకులు గొర్రె కృష్ణ, సూర్యాపేట జిల్లా కార్యదర్శి పి.సురేష్, ఆఫీస్ బేరర్ పి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన టీజీసీఏబీ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

డీసీసీబీ, సహకార సంఘాల పదవీ కాలం 6 నెలలు పొడిగించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు నేతృత్వంలో డీసీసీబీ చైర్మెన్ల బృందం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు జానారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్‌లు కొత్తకుర్మసత్తయ్య, కుంట రమేష్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ అడ్డి భోజారెడ్డి, శ్రీ దొండపాటి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులకు నెల రోజులపాటు శిక్షణ అందిస్తున్నామని బేగంబజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉస్మానియా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు రోగుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. రోగికి వైద్య పరీక్షలు, బీపీ, షుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు, గర్భిణీ స్త్రీ, బాలింతలకు వైద్యం, చిన్నపిల్లలకు టీకాలు అందిస్తున్న విధానం, రోగులకు అందిస్తున్న వైద్యంపై వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నర్సింగ్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే రోగులకు అందించే సేవలు తెలుసుకోవడం వల్ల నర్సింగ్ విద్యలో ఉన్నతంగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ నాగేశ్వరమ్మ, ఉస్మానియా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లెక్చరర్ పల్లవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గోషామహల్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్ కుమార్ దూత్ తదితరులు



మక్కా మసీదులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

రంజాన్ సందర్భంగా మక్కా మసీదులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన బృందంతో మక్కా మసీదు చైర్మెన్ మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ సిద్ధిఖీతో కలిసి రాబోయే రంజాన్‌లో భక్తులకి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, అక్కడ సమస్యలను మంచినీరు, కరెంటు, టాయిలెట్స్, పరిశుభ్రత వంటి సమస్యల్ని అడిగి అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ, జీహెచ్‌ఎంసీ, ఎలెక్ట్రిక్ ఉన్నత అధికారులు సందర్శించారని, అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు మక్కా మసీదు చైర్మెన్ అవాజ్ కమిటీకి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవాజ్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ తరపున ఆహ్వానం పలుకుతూ జీహెచ్‌ఎంసీ ఇతర ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో వేలాదిమంది భక్తులు నగర వ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి సందర్శిస్తారని, ఎవరికి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వా దృష్టికి తీసుకెళ్లాలని చైర్మెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు గులాబ్ నసీర్, ఇంతియాజ్ అలీ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్షేత్ర సందర్శనలు పాఠ్యప్రణాళికలో కీలకం



● జాతీయ గణాంకాల సంచాలకులు పి.మనోహర్

నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా క్షేత్ర సందర్శనలు కూడా చేయాలని, అవి పాఠ్యప్రణాళికలో కీలకమని జాతీయ గణాంకాల సంచాలకులు పి.మనోహర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌లో జాతీయ గణాంకాల కార్యాలయం ఏర్పాటు చేసిన స్టాల్‌ను చివరి రోజు సిటీ కాలేజి గణిత శాస్త్రం, గణాంకాల విభాగ విద్యార్థులు సందర్శించారు. డిగ్రీ, పీజీ విద్యార్థులు 35 మంది, అధ్యాపకులు జయదేవ్ రాథోడ్, రుచిత, షణ్ముఖ రావు, మనోజ్, నయోమి ఆధ్వర్యంలో ఈ క్షేత్ర సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్ఎస్ఓ సంచాలకులతో సహా ఇతర అధికారులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఓ నిర్వహిస్తున్న పనితీరును అధికారులు విద్యార్థులకు వివరించారు. ఎంఓఎస్పీఐ (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్‌పై పరిచయం చేసి, గణాంకాలు, డేటా విశ్లేషణ రంగంలో అవకాశాలను అన్వేషించేందుకు ప్రోత్సహించారు. ఈ ఫీల్డ్ ట్రిప్ తమకి ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ అందించడంతో పాటు, భవిష్యత్తులో గణాంక రంగంలో అవకాశాలను పరిగణించేందుకు ప్రోత్సహించిందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.

సాంస్కృతిక సంస్థలకు చేయూతనందించాలి..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కళ పోషకులు కళా, సాంస్కృతిక సంస్థలకు చేయూతనందించాలని ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ అన్నారు. అర్కా గ్రూప్ సౌజన్యంతో రాగా ఆర్ట్స్ కల్చరల్స్, శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాపోషకుడు కెయి రాజు పుట్టినరోజు వేడుకల సందర్భంగా 'రాజువయ్యా మహరాజువయ్యా' సినీ సంగీత విభావరి తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరస్వతి ఉపసకులు దైవజ్ఞ శర్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెయి రాజు సంస్కృతిక రంగానికి చేస్తున్న సేవలు గొప్పవని తెలిపారు. ఆయన జన్మదిన వేడుకలు కళాకారుల మధ్య జరుపుకోవడం సంతోషదాయకమ న్నారు. సభకు ముందు గాయని, గాయకులు బాల కామేశ్వరరావు, వినోద్ బాబుసినీ నేపథ్య గాయకులు. అవార్డు గ్రహీత వైఎస్ రామకృష్ణ, భాస్కర్,కె.మోహన్, రాజన్, క్షాస్య, శశికళాస్వామి, సురేఖామూర్తి, అనురాధ, రేవతి, శ్రీదేవి, శారదా, పవన్, ఉమాపతి, లక్ష్మీ గాయత్రి, కేశవ్, చందన, కె.సింధు, చరిత,రవికుమార్, శ్రీమణి, రజని ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో సంగీత దర్శకులు కె.రామాచారి, సినీ నేపథ్య గాయని విజయలక్ష్మి చంద్రశేఖర్ గొర్తి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట


బీసీ కులగణనలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మెన్ జీ.నిరంజన్, మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హను మంతరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, హైదరాబాద్ జిల్లా బీసీ అధికారి ఆశన్న, ఏంహెచ్ఓ డా. హేమలత తదితరులున్నారు.





మా కథలు.. మా పోరాటాలు..

ఇది ఓ సాధారణ పుస్తకమే కావొచ్చు... కానీ స్త్రీల పట్ల సమాజం చూపుతున్న వివక్ష ఎంత తీవ్రంగా ఉందో కండ్లకు కట్టినట్టు మనకు చూపిస్తుంది. రోజురోజుకు మహిళల జీవితాల్లో హింస ఎలా వ్యాపిస్తుందో తెలియజేస్తోంది. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్య తర్వాత విడుదలైన 'అవర్ స్టోరీస్, అవర్ స్ట్రగుల్: హింస - మహిళల జీవితాలు' అనే ఈ సంకలనం ఓ చర్చనీయాంశంగా మారింది. ఎంతోమందిని ఆలోచింపజేస్తున్న ఆ పుస్తకంలో అసలేముందే తెలుసుకుందాం...



ఈ సంకలనం అంతటా మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులే మనకు కనిపిస్తాయి. 'బిరంగోనా' అనే కవితలో.. విముక్తి యుద్ధంలో పాకిస్తాన్ దళాలచే అత్యాచారం చేయబడిన వేల మంది బంగ్లాదేశ్ మహిళల గురించి సదాఫ్ సాజ్ రాశారు. భారత రాష్ట్రంలోని సైనిక, పారా మిలటరీ దళాలు మణిపూర్ మహిళలపై అత్యాచారాన్ని ఆయుధంగా ఎలా ఉపయోగించాయో తెరెసా రెహ్మాన్, హెూయినిల్హింగ్ సిథౌ వివరించారు. 2023 సంఘర్షణ సమయంలో ఆధిపత్య మెయిటీ కమ్యూనిటీకి చెందిన పురుషులు కుకి మహిళలపై అత్యాచారం చేసిన ఘటనలను ఆమె తన కవిత్వంలో చెప్పారు.

జాతి హింసతో పోరాటం

స్టురాంగ్ రీనా 2009లో అరుణాచల్ ప్రదేశ్ నుండి ఢిల్లీకి తరలివెళ్లారు. 'హిడెన్ వల్నరబిలిటీస్'లో ఆమె భారతదేశ జాతి, లింగ యుద్ధాల కాలంలో జీవించిన అనుభవాలపై దృష్టి పెడుతున్నారు. భారతదేశ ఈశాన్య ప్రాంతం నుండి 'ప్రధాన భూభాగం'కి వలస వచ్చినవారు ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం వంటి వారి ప్రాథమిక అంశాలలో జాతి హింసతో ఎలా పోరాడుతున్నారో వివరిస్తున్నారు. అక్కడి ప్రజలు సాంస్కృతిక, నైతిక పోలీసింగ్‌ను ఎదుర్కొంటున్నారు. వారి ఆహారం, దుస్తులు, జీవనశైలి, ఆదాయ మార్గాలు, సంబంధాలు, వినోదం వంటి విషయాలలో భారతీయ సమాజం నుండి వివక్ష అనుభవిస్తున్నారు. అంతేకాదు మహానగరాలలో మహిళా వలసదారులు ఎదుర్కొంటున్న గుర్తింపు సమస్యలను ఆమె విశ్లేషిస్తున్నారు. మహిళల భద్రత, శ్రేయస్సుతో పాటు విస్మరించబడుతున్న అనేక అంశాలను ఆమె తన కవిత్వంలో లేవనెత్తారు.

పునరుత్పత్తితో పాటు...

శ్రీలంక మహిళల సాహిత్య వారసత్వంపై వచ్చిన ఒక వ్యాసంలో.. సిమ్రాన్ చద్దా రాజకీయ లక్ష్యాలు, మహిళల ప్రవర్తన, శరీరాలకు ఆపాదించబడిన జాతి లక్షణాలు ఎంత దారుణంగా ఉన్నాయో పరిశీలిస్తుంది. మూడు దశాబ్దాలుగా కొనసాగిన సమాజాల మధ్య యుద్ధంలో పాత్రలు, గుర్తింపులు ఎలా పునర్నిర్వచించబడ్డాయో విశ్లేషించడానికి LTTE మహిళా కార్యకర్తల నుండి సింహళ మహిళల వరకు శ్రీలంకలోని మహిళలు రాసిన రచనలను ఆమె ప్రస్తావించారు. పునరుత్పత్తితో పాటు మహిళలు మాతృభూమి సేవలో చురుకైన యోధులుగా ఉండాల్సిన కొత్త స్త్రీత్వం ఆలోచనను LTTE మహిళా యోధులు స్వీకరించారు.

పురుషాధిక్యతను ప్రశ్నిస్తుంది

ఈ సంపుటి ఇప్పటి వరకు చెప్పని అనేక విషయాల గురించి మాట్లాడుతుంది. గౌరవ హత్యలు, సతి, లైంగిక దాడి, అత్యాచారం తర్వాత మహిళలను విస్మరించడాన్ని కూడా వివరిస్తుంది. ఇల్లు, కుటుంబం అనే ఆలోచనను ఇది ప్రశ్నిస్తుంది. తండ్రులు, మామలు, భర్త తరపు బంధువులు, ఆ కుటుంబాలలోని మహిళలు ఇలా స్త్రీలను క్రూరంగా హింసించే ఎన్నో కథలు ఇందులో ఉన్నాయి. ఈ పురుషాధిక్యతను సవాలు చేస్తూ తమ సోదరీమణులను, కుమార్తెలను హింస, దుర్వినియోగం నుండి రక్షించలేనప్పుడు సోదరులు, తండ్రులు ఎదుర్కొనే దుఃఖం, నిస్సహాయతను కూడా మనం చూడొచ్చు.





పదే పదే దాడి

జీవిత భాగస్వాముల హింస, భర్తలు తమ భార్యలను కొట్టడంతో పాటు అనేక కథనాలు ఇందులో ఉన్నాయి. 'డు యు వాంట్ టు డై యంగ్'లో ఫరా అహ్మద్ భర్త చేత మానసికంగా, శారీరకంగా, లైంగికంగా హింసించబడిన ఓ స్త్రీ గురించి రాశారు. ఈ మహిళపై వివిధ సంస్థలు, వ్యక్తులు పదే పదే దాడి చేయడంతో కుటుంబం, రాష్ట్రం, సమాజం మధ్య కుట్ర బయటపడుతుంది. 'శ్రీజస్ స్టోరీ', 'ది ఫోన్ కాల్'లలో సంప్రదాయాలు, సామాజిక నిబంధనలను ధిక్కరిస్తూ ప్రేమించి పెండ్లి చేసుకున్న పురుషులు తర్వాత కాలంలో ఎంత భయంకరంగా మారి మహిళలను హింసిస్తున్నారో మనం చూస్తాము.

స్త్రీని ఓ ఫర్నీచర్‌గా...

ఉల్లంఘన, అణచివేత, స్వేచ్ఛా పితృస్వామ్యాన్ని ఈ విశ్లేషణ హైలైట్ చేస్తుంది. ఓ ఫర్నీచర్ లాగా స్త్రీలను వారి కుటుంబాలు ఉంచే చోట ఉంచుతారు, వారు కూడా దానికి అనుగుణంగా ఉండాలి. 'ది సోషల్ వర్కర్'లో ఆయ్షా బాకీర్.. మహిళల మధ్య ఉద్రిక్తతలు, సమాజంలోని తరగతి విభజనలు, ఆత్మవిశ్వాసంతో ఉన్న మహిళల వెనుక దాగి ఉన్న కథల గురించి రాశారు. మహిళల జీవితాల్లోని చీకటి, నిస్సహాయత, అలాగే వారు తమను తాము పునర్నిర్మించుకోవడానికి తీసుకునే చర్య గురించి ఈ విశ్లేషణ మాట్లాడుతుంది. పదహారేండ్ల వయసులో నేపాల్ నుండి భారతదేశానికి అక్రమ రవాణా చేయబడిన చరిమయ తమంగ్ తిరిగి వచ్చి 1997లో అక్రమ రవాణాదారులకు వ్యతిరేకంగా ధైర్యంగా సాక్ష్యమిచ్చిందని చదవడం స్ఫూర్తిదాయకం.

మైనార్టీలే లక్ష్యంగా...

ఇది విభిన్న శైలులు, కథలు, ఆలోచనలను కలిపి రూపొందించబడిన సేకరణ. చాలా మంది రచయితలు మార్పు కోసం సూచనలు అందించారు. సమాజాన్ని ప్రశ్నించేందుకు ఏమాత్రం వెనుకాడలేదు. భారత ప్రభుత్వం, దాని సంస్థలు మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు పాల్పడుతున్న వారిని ఎలా క్షమించారో కల్పనా కన్నబిరాన్ మనకు తెలియజేస్తారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్న హింసకు స్పష్టమైన ఉదాహరణలు ఉన్నాయి. అయితే వీటిని మహిళలు ప్రతిఘటించారు. తమతమ స్థాయిలో జోక్యం చేసుకోవడం, కోర్టుకు వెళ్లడం ద్వారా మెజారిటీ రాజ్యాన్ని ప్రశ్నించడంపై దృష్టి సారించారు.

హింస లేని సమాజానికై...

మీనాక్షి మల్హోత్రా.. ప్రతీకారం, న్యాయం అందించడం మధ్య వ్యత్యాసాన్ని చూపుతున్నారు. దేశంలో ఎన్‌కౌంటర్, మరణశిక్షపై ఆధారపడకుండా హింస లేని సమాజాన్ని ఎలా సృష్టించాలో వివరిస్తున్నారు. అన్యాయం, అసౌకర్య భావనను రేకెత్తించే ఉద్దేశ్యంతో ఈ పుస్తకం రూపొందించ బడిందని మితాలి చక్రవర్తి తన ముందు మాటలో చెప్పారు. ఈ సంకలనంలోని వ్యాసాలు, కథలు, కవితలు అనేక సమస్యలను గుర్తించి చక్కగా వివరించాయి. మన సమాజాలలో విస్తృతంగా వ్యాపించిన హింస గురించి ఆందోళన చెందుతున్న పాఠకులకు ఈ పుస్తకంలో అసరమైన సమాచారం, ఆలోచనలు, లోతైన అవగాహనను కనుగొంటారు. సమాజ మార్పుకు, అందుకు అవసరమైన అవగాహన పెంచుకునేందుకు దోహదపడే సంకలనం ఇది.

యాసిడ్ దాడులపై...

ఈ సంకలన సంపాదకులలో ఒకరైన రత్నోత్తమ సేన్‌గుప్తా.. 'వెన్ కిన్ సేస్ కిల్' అనే వ్యాసంలో ప్రధానంగా భారతదేశం, పాకిస్తాన్‌లో 'గౌరవ హత్యలు' గురించి రాశారు. ఈ హత్యలు ఎక్కువగా పాకిస్తాన్‌లో జరుగుతున్నాయి. 'ఎ ఫేస్ దట్ మేక్స్ డెత్ షివర్'లో సేన్‌గుప్తా యాసిడ్ దాడుల గురించి రాశారు. అక్కడ పురుషులు మహిళలపై యాసిడ్ పోసి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంటారు. సేన్‌గుప్తా తన విశ్లేషణలో బాధితుల సోషల్ మీడియా అకౌంట్లు, ప్రభుత్వ డేటా, చట్టపరమైన నిబంధనలు, వార్తాపత్రిక నివేదికలపై ఆధారపడి ఈ క్రూరత్వం వివిధ అంశాలను ప్రదర్శిస్తుందని తెలిపారు. అలాగే సాంస్కృతిక అంచనాలు, వేగవంతమైన వైద్య సంరక్షణ లేకపోవడం, చట్ట అమలు సరిపోకపోవడం వంటి వాటిని కూడా నొక్కి చెబుతున్నారు.

ఇట్ల చేద్దాం..

చెక్క ఫర్నిచర్, కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై నీటి మరకలు ఓ పట్టాన వదలవు. అలాంటప్పుడు ఆలివ్ నూనె, ఉప్పు కలిపి పేస్ట్‌లా తయారు చేసిన మిశ్రమాన్ని మరకలున్న చోట అప్లై చేయాలి. గంట తర్వాత పొడి క్లాత్‌తో తుడిస్తే చాలు. ఇలాగే కిచెన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా శుభ్రం చేసుకోవచ్చు.

ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలా ?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని చేర్చకూడదు' అని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 1961 సంవత్సరపు ఆదాయపన్ను చట్టం ప్రకారం ఎన్నికల బాండ్ల ద్వారా కంపెనీలు, వ్యక్తుల నుండి వచ్చిన విరాళాల నుండి రాజకీయ పార్టీలకు మినహాయింపు ఉంది. 64 సంవత్సరాల నాటి ఐటీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతన ఆదాయపన్ను బిల్లును తీసుకొచ్చింది. చట్టానికి 4000కు పైగా సవరణలు చేసినందున అది సంక్లిష్టంగా మారిందని, అందుకే దానిని సరళీకరించి 622 పేజీల బిల్లును తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతోంది.

ప్రభుత్వ చర్యలు చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసేందుకు వాటిని సమీక్షించడం, పర్యవేక్షించడం సాధారణంగా జరిగే పనే. అందుకోసం కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనను చేర్చి ఉండవచ్చునని లేదా భవిష్యత్తులో ఆ పథకాన్ని సవరించి మరో దారిలో తీసుకొచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం కూడా కావచ్చునని ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి రజత్ మోహన్ చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన సమయంలో కొన్ని అంశాలను లేవనెత్తిందని, వాటిని వ్యవస్థీకృత చర్చలు, నిపుణులతో సంప్రదింపుల ద్వారా పరిష్కరించవచ్చునని ఆయన సూచించారు. అయితే సవరించిన రాజకీయ విరాళాల వ్యవస్థను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం తనకున్న శాసనాధికారాన్ని అట్టే పెట్టుకున్నదని అన్నారు. కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల ప్రస్తావన తేవడం వ్యూహాత్మక నిర్ణయం కావచ్చునని, దీని ద్వారా భవిష్యత్తులో ఎన్నికల నిధులకు సంబంధించిన సంస్కరణలకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కంపెనీ భాగస్వామి రోహిత్ గార్గ్ మాట్లాడుతూ కొత్త ఆదాయపన్ను బిల్లులో చేసిన మార్పులు స్వభావరీత్యా కేవలం నిర్మాణ సంబంధమైనవేనని అన్నారు. నిబంధనలు, సెక్షన్లలో ప్రధాన మార్పులేవీ లేవని చెప్పారు. 'ఎన్నికల బాండ్ల జారీని నిలిపివేయాలని ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ తీర్పును ప్రతిబింబించేలా సంబంధిత చట్టాల్లో సవరణలు చేయాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఎన్నికల బాండ్లు జారీ చేయాల్సి వచ్చినా వాటిని డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఏదేమైనా దాతల వివరాలకు బహిర్గతం చేసే అంశాన్ని సంబంధిత చట్టాల కిందే పరిష్కరించాల్సి ఉంటుంది' అని అన్నారు.

2018లో ఎన్నికల బాండ్ల పథకం ప్రారంభమైంది. అప్పటి నుండి ఎస్‌బీఐ ఎనిమిది దఫాలుగా రూ.16,518 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసింది. ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం ఏ రాజకీయ పార్టీ అయినా తాను పొందిన స్వచ్ఛంద విరాళాలపై పన్ను మినహాయింపు కోరాలంటే ఆరు షరతులు పాటించాల్సి ఉంటుంది. అందులో ఒక షరతు ప్రకారం...రాజకీయ పార్టీ రెండు వేల రూపాయల కంటే ఎక్కువ విరాళం పొందకూడదు. అయితే అకౌంట్ పేఈ చెక్కు, అకౌంట్ పేఈబ్యాంక్ డ్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సిస్టమ్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతి ద్వారా అంతకు మించిన మొత్తంలో విరాళం తీసుకోవచ్చు.

భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

ఆ మేరకు భూభారతి విధివిధానాలు : కలెక్టర్లతో వర్క్ షాప్‌లో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూ భారతి విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకువచ్చామనీ, అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలుంటాయని ఆయన చెప్పారు. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్క్‌షాప్ లో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లుపెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా మెరుగైన, సమగ్ర రెవెన్యూ సేవలను సత్వరమే అందిం చాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఆ చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో దానికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయటానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. "ఎలాంటి విధి



విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కండ్లముందే కనిపిస్తున్నాయి. ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. చట్టం తీసుకొచ్చి మూడేండ్లు గడిచినా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. మేం మాత్రం సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా, విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని అమల్లోకి తెస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నాం. తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం (భూభారతి) భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుంది. భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకు రావడం భూ లావాదేవీలను సులభతరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందు బాటులోకి తీసుకురావడం ఇది ప్రధాన లక్ష్యం. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగిం చుకుని భూ పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తాం. ఈ నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే గాకుండా వారి జీవితాలకు ఆత్మగౌరవాన్ని ఆర్థిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుంది" అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్ఓ మకరంద్, భూ చట్ట నిపుణులు భూమి సునిల్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్గిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు వివిధ జిల్లాల ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంపై ఫికర్ లేదు

నవతెలంగాణ-ఆమనగల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్‌పై ఉన్న ఫికర్ రాష్ట్రంపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో పది శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా రాలేదన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణం మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతూ.. అత్తగారి ఊరిలో ఉన్న వెయ్యి ఎకరాల భూముల ధరలను పెంచేందుకు డబుల్ రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందే వెల్దండ మండలంలో తమ కుటుంబ సభ్యులకు ఉన్న 500 ఎకరాల భూమికి తోడు ఇటీవల మరో 500 ఎకరాల భూమిని సీఎం, ఆయన సోదరులు దొబ్బేసినట్టు చెప్పారు. రైతు రుణమాఫీ కాక రైతులు, పెండింగ్ బిల్లులు అందక మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండ్లి కానుక తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారో రేవంత్‌రెడ్డిని ప్రజలు ప్రశ్నించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. పిట్ట కథ చెబుతూ.. 'తాగుడుకు బానిసై తల్లిదండ్రులను చంపిన వ్యక్తి కోర్టులో న్యాయవాది ముందు నేను అమ్మానాన్న లేని అనాథను.. నన్ను క్షమించండి సార్' అన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ నుంచే ఆయన పతనం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్ పాల్గొన్నారు.

హైకోర్టు హాల్లోనే కుప్పకూలిన లాయర్

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర హైకోర్టులో విషాద ఘటన జరిగింది. కేసు వాదిస్తూ ఓ సీనియర్ న్యాయవాది గుండెపోటుతో మరణించారు. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు మంగళవారం హైకోర్టులో ఓ కేసుకు సంబంధించి న్యాయమూర్తి ముందు వాదనలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో కోర్టు హాల్లోనే ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయారని వైద్యులు వెల్లడించారు. లాయర్ మృతితో మిగతా కోర్టు హాళ్లలో రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.

బీజేపీ ఆదాయం రూ.4,340 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం 83.85 శాతం మేర పెరిగిందని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఇక కాంగ్రెస్ 1225.11 కోట్లతో కాంగ్రెస్ పార్టీ రెండోస్థానంలో నిలిచింది. అయితే అంతకు ముందు ఏడాదితో పోల్చితే.. కాంగ్రెస్‌కి అధిక మొత్తంలోనే విరాళాలు వచ్చాయి. ఈ పార్టీ విరాళాలు సేకరించడంలో 170.82 శాతం మేర పెరుగుదల ఉందని ఈ నివేదిక తెలిపింది. ఇక బీఎస్పీ 22.68 కోట్లు, ఆప్ 22.44 లక్షల విరాళాలతో వరుస స్థానాల్లో నిలిచాయి.కాగా, విరాళాల రూపంలో వచ్చిన ఆదాయంలో పార్టీలు 50 శాతం మేరకే ఖర్చు చేశాయని ఏడీఆర్ నివేదిక తెలిపింది. బీజేపీ తన ఆదాయంలో రూ.2,211.69 కోట్లు (50.96 శాతం) వ్యయం చేయగా.. కాంగ్రెస్ పార్టీ రూ.1025.24 కోట్లు (83.69 శాతం) ఖర్చు చేసినట్టు ఏడీఆర్ తెలిపింది. బీఎస్పీ రూ.43.18 కోట్లు (66.67 శాతం) ఖర్చు చేశాయి. ఆప్ రూ.34.09 కోట్లు ఖర్చు చేసింది. జాతీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే ఎక్కువ ఆదాయం సమకూరినట్టు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.

జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా టీకేకే రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ టి కిషెన్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కోసం సెర్చ్ కమిటీ సమావేశమైన విషయం తెలిసిందే. ముగ్గురు ప్రొఫెసర్ల జాబితాను ప్రభుత్వానికి పంపించింది. వాటిని పరిశీలించి గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వ ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించి టి కిషెన్‌కుమార్‌రెడ్డిని జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా ఆమోదించారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేండ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు. మంగళవారమే ఆయన జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, జేఎన్టీయూ హైదరాబాద్ ఇన్‌చార్జీ వీసీ వి బాలకిష్టారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గంగ నీటిలో మల బ్యాక్టీరియా !

ఎన్‌జీటీ ఆందోళన

- చర్యలపై నివేదిక ఇవ్వాలని యూపీ అధికారులకు ఆదేశాలు



న్యూఢిల్లీ : మహా కుంభమేళా సందర్భంగా త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు లక్షలాదిగా పోటెత్తుతున్నారు. గంగలో మునిగితే సర్వ పాపాలు తొలగిపోతాయని, పుణ్య ఫలాలు లభిస్తాయని వారి విశ్వాసం. పుణ్యం మాట దేవుడెరుగు కానీ ప్రయాగరాజ్‌లోని గంగానదిలో మల సంబంధమైన బ్యాక్టీరియా అధిక స్థాయిలో పెరుగుతోందని కాలుష్య నియంత్రణ సంస్థ అయిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిపై తీసుకుంటున్న చర్యలేమిటో వివరించాలని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది. బుధవారంలోగా సవివరమైన నివేదిక అందజేయాలని డిమాండ్ చేసింది.

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) అందజేసిన నివేదిక ఆధారంగా ఎన్‌జీటీ ఈ చర్యలు చేపట్టింది. ఈ నెల 3న సీపీసీబీ అందించిన నివేదిక ప్రకారం "మహా కుంభమేళా సమయంలో మానవ మలంలో బ్యాక్టీరియా గణనీయంగా పెరుగుతోంది. నదీ జలాలు స్నానం చేయడానికి అనువుగా లేవు. జనవరి 12-13 తేదీల్లో నదీ జలాలను

పరీక్షించాం. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ)కు కావాల్సిన ప్రమాణాలు నీటిలో లేవు. అంతేకాదు...స్నానం చేసే నీరు నాణ్యమైనదిగా ఉండాలి. అయితే అనేక పర్యాయాలు పరీక్షించినప్పటికీ అది మల బ్యాక్టీరియా ప్రమాణాలకూ అనుగుణంగా లేదు. మహా కుంభమేళాలో...ముఖ్యంగా పవిత్ర దినాలలో ప్రజలు భారీగా గంగలో స్నానం చేస్తున్నారు. మల బ్యాక్టీరియా పెరగడానికి, కాలుష్యానికి ఇది కారణమవుతోంది" అని నివేదిక వివరించింది.

ఈ నివేదికను కోల్‌కత్తా హైకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ శ్రీవాత్సవ నేతృత్వంలోని ట్రిబ్యునల్ పరిశీలించింది. బుధవారం వర్చువల్‌గా తన ఎదుట హాజరు కావాలని యూపీ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది.

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

సిఫారసులు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఈ కమిషన్ నవంబరు 11న బాధ్యతలు చేపట్టింది. సమగ్ర అధ్యయనం చేసి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆ కమిషన్‌ను కోరింది. జనవరి 10న అరవై రోజుల గడువు ముగియడం తో జనవరి 11 నుంచి ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. అనంతరం కమిషన్ ఇటీవలే నివేదిక సమర్పించింది. అయితే ఎస్సీ వర్గీకరణకు చట్టరూపం రావాల్సి ఉండటం తోపాటు, పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పున్ణపరిశీలించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కమిషన్ కాలపరి మితిని మార్చి 10 వరకు మరో సారి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్

'దిల్ రూబా'

హోలీ కానుకగా రిలీజ్

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్. శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.
రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్‌లో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'హే జింగిలి..'ని రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ, 'సినిమాను అందరికీ నచ్చేలా చేసిన మా టీమ్‌కు థ్యాంక్స్' అని అన్నారు.
"హే జింగిలి' పాటను మీరంతా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాం. ఈ పాటలో కిరణ్, రుక్సర్ పెయిర్ చాలా బాగుంది. ఫస్ట్ టైమ్ లవ్‌లో పడిన అబ్బాయి కింగ్‌లా ఫీలవుతాడు. ఆ లవ్ ఫెయిలై సెకండ్ టైమ్ లవ్‌లో పడినప్పుడు అతనిలో ఒక భయం మొదలవుతుంది. ఇలాంటి ఒక ఎక్స్‌ప్రెషన్ చెప్పగానే భాస్కరభట్ల సూపర్బ్ లిరిక్స్ ఇచ్చారు. సామ్ సీఎస్ సూపర్ హిట్ ట్యూన్ ఇచ్చారు. గంటలో ఈ పాట రెడీ అయ్యింది. ఈ సాంగ్‌కు మంచి పేరొస్తుంది' అని డైరెక్టర్ విశ్వ కరుణ్ చెప్పారు.
హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ మాట్లాడుతూ, 'ఈ మూవీ ప్యూర్ లవ్ ఎమోషన్, ఫీలింగ్‌తో ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా ఫుల్ లవ్ అండ్ ఎమోషన్ చూపించాను' అని తెలిపారు.

ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా, హ్యాపీగా ఫీలవుతున్నాను. ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా మీ అందరినీ ఆకట్టుకుంటుంది. సారెగమ వాళ్లు ఫస్ట్ టైమ్ ఈ మూవీతో టాలీవుడ్‌లోకి వస్తున్నారు. ప్రొడ్యూసర్ రవి, డైరెక్టర్ విశ్వ కరుణ్ మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డారు. హోలీ మంచి డేట్ అని సినిమాని రిలీజ్ చేస్తున్నాం. నా సినిమాలన్నింటిలో కంటే ఇందులో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. నా క్యారెక్టర్‌లాగే యాక్షన్ ఎపిసోడ్స్ ఇంటెన్స్‌గా ఉంటాయి. యాక్షన్ ఎపిసోడ్స్ స్క్రీన్ మీద కొత్తగా ఉండి ఎంజాయ్ చేస్తారు.

- హీరో కిరణ్ అబ్బవరం

నవచిత్రం

మ్యూజికల్ డ్రామాగా 'మ్యాజిక్'



ఒక వైపు భారీ సినిమాలను రూపొందిస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్యభరిత చిత్రాలను అందిస్తూ, ఘన విజయాలను సొంతం చేసుకుంటోంది సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ.
'జెర్సీ' వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'మ్యాజిక్' అనే సినిమాను ప్రస్తుతం సితార సంస్థ నిర్మిస్తోంది. ఈ మ్యూజికల్ డ్రామాలో పలువురు యువ నటీనటులు నటిస్తున్నారు.
ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఇటీవల ఈ చిత్రం నుంచి 'డోంట్ నో వై' అనే మొదటి గీతాన్ని విడుదల చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా అనిరుధ్ పాట విడుదలై ఆకట్టుకోవడం కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, 'డోంట్ నో వై' పాటతో మరోసారి కట్టిపడేశారు అనిరుధ్. అనిరుధ్ రవిచందర్, ఐశ్వర్య సురేష్ కలిసి తెలుగు, తమిళ భాషల్లో ఈ గీతాన్ని ఆలపించారు. అనిరుధ్ తన సంగీతంతో మాత్రం కాకుండా, గాత్రంతోనూ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ఈ పాట ఒకసారి వినగానే మళ్ళీ మళ్ళీ వినాలి అనిపించేలా ఉంది. ఈ గీతానికి తెలుగులో కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, తమిళంలో విఘ్నేష్ శివన్ సాహిత్యం అందించారు. వారి సాహిత్యం పాట విలువను మరింత పెంచింది. తమ కళాశాల ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపరచడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ 'మ్యాజిక్' చిత్రంతో ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు అని చిత్ర బృందం పేర్కొంది.

'మజాకా'కి సెన్సార్ సభ్యుల ప్రశంసలు



సందీప్ కిషన్, రీతువర్మ

సందీప్ కిషన్ నటించిన నూతన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకుడు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్‌ల కొలాబరేషన్‌లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రావు రమేష్, అన్షు కీలక పాత్రల్లో నటించారు.
తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ దీనికి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్ ఉంది. హెల్తీ కామెడీ, ఎంటర్టైన్మెంట్ చాలా బావుందని సెన్సార్ సభ్యులు మూవీ టీమ్‌కి వారి రెస్పాన్స్‌ని తెలియజేశారు.
మంగళవారం మేకర్స్ ఈ సినిమా నుంచి 'పగిలి' సాంగ్‌ని రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ ఈ పాటని మాస్ డ్యాన్స్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. మహాలింగం, సాహితీ చాగంటి, ప్రభ పవర్ ఫుల్ వోకల్స్, కాసర్ల శ్యామ్, ప్రసన్న కుమార్ బెజవాడ అందించిన లిరిక్స్ మాస్‌ని మరింత ఎలివేట్ చేశాయి. ఈ సాంగ్‌లో సందీప్ కిషన్ ఎనర్జిటిక్ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ అదిరిపోయాయి. సందీప్ కిషన్, రీతు వర్మ కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది. మ్యాసీవ్ అండ్ వైబ్రెంట్ సెట్స్‌లో చిత్రీకరించిన ఈ సాంగ్‌లో విజువల్స్ కలర్ ఫుల్‌గా ఉన్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ గ్రేస్ ఫుల్‌గా ఉంది. ఈ పాట థియేటర్స్‌లో మాస్‌ని మెస్మరైజ్ చేయడం ఖాయం. ఇప్పటికే రిలీజైన టీజర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌ని అందించి సినిమాపై అంచనాలని పెంచింది. ఫస్ట్ సింగిల్ 'బ్యాచులర్స్' ఆంథమ్, సెకండ్ సింగిల్ 'బేబీ' చార్ట్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. త్రినాథ రావు నక్కినతో సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులలో పని చేసిన రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ రాస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది అని చిత్ర బృందం చెప్పింది.
ఈచిత్రానికి దర్శకత్వం: త్రినాధరావు నక్కిన, నిర్మాతలు: రాజేష్ దండా, కథ, స్క్రీన్ ప్లే, మాటలు: ప్రసన్న కుమార్ బెజవాడ, సహ నిర్మాత: బాలాజీ గుత్తా, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి, సంగీతం: లియోన్ జేమ్స్, డీవోపీ: నిజార్ షఫీ, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, స్టంట్స్: పృథ్వీ

ఆ జర్నలిస్ట్‌లు ఏం చేశారు?



మిమో చక్రవర్తి, సశా చెత్రి

బాలీవుడ్ నటుడు, సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి, ఎయిర్ టెల్ ఫేం సశా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'నేనెక్కడున్నా'. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మాధవ్ కోదాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈనెల 28న ఈ సినిమాను విడుదల చేయనున్నారు.
ఈ సందర్భంగా ప్రజా నాయకుడు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఈచిత్ర ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ, 'జర్నలిజం విలువలు, మహిళా సాధికారతపై తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. దర్శకుడు మాధవ్ కోదాడ, నిర్మాతలు కె.బి.ఆర్, మారుతి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి నా శుభాకాంక్షలు' అని అన్నారు.
ఈ సినిమాలో ఆనంద్ పాత్రలో మిమో చక్రవర్తి, ఝాన్సీగా సశా చెత్రి నటించారు. వాళ్లిద్దరూ జర్నలిస్ట్ రోల్స్ చేశారు. జీతం కోసం కాకుండా జనాల జీవితాల కోసం పాత్రికేయ రంగాన్ని ఎంచుకున్న ఆనంద్, ఝాన్సీ చేసిన కొన్ని స్టింగ్ ఆపరేషన్స్ వల్ల అవినీతిపరుల భాగోతాలు బయట పడతాయి. ఆ తర్వాత ఏమైంది? ఎన్ని ప్రమాదాలు ఎదుర్కొన్నారు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి అని చిత్రయూనిట్ తెలిపింది.
మురళీ శర్మ మహేష్ మంజ్రేకర్, ప్రదీప్ రావత్, షాయాజీ షిండే, అభిమన్యు సింగ్, రాహుల్ దేవ్, బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి, సీవీఎల్ నరసింహారావు, రవి కాలే, భాను చందర్, రమణ చల్కపల్లి, మిలింద్ గునాజీ, మిహిర, ఉత్తర, అర్చన గౌతం తదితరులు నటించిన ఈ సినిమాకు డాన్స్: ప్రేమ్ రక్షిత్, లిరిక్స్ : సుద్దాల అశోక్ తేజ, సంగీతం : శేఖర్ చంద్ర , ఫోటోగ్రఫీ : జయపాల్ నిమ్మల, ఎడిటింగ్: ఫిల్మీ గ్యాంగ్ స్టర్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: రాజేష్, సమర్పణ: కె.బి.ఆర్, నిర్మాత: మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి, స్టోరీ - స్క్రీన్ ప్లే - డైలాగ్స్ - డైరెక్షన్: మాధవ్ కోదాడ.

స్ఫూర్తినిచ్చే 'దీక్ష'



ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీక్ష'. కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో, హీరోయిన్లు. అక్సాఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రలలో నటించారు. లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, రిలీజ్‌కు రెడీ అయింది.
ఈ సందర్భంగా దర్శక, నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ,'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని, లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చాలా అందమైన లొకేషన్స్‌తోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ చిత్రీకరణ పూర్తి చేశాం. పాటలు అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది. ఈ చిత్రంలో భీముడు పాత్రలో హీరో కిరణ్ అద్భుతంగా నటించారు. హీరో శ్రీహరిని గుర్తు చేసేలా తన నటన ఉంటుంది. అక్సాఖాన్ స్పెషల్ సాంగ్‌లో, తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. మా చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ప్రముఖ గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రంలో 5 ఫైట్స్ ఉన్నాయి. ఇప్పటి వరకు 40 చిత్రాలు మా బ్యానర్‌లో నిర్మించాను. ఈ చిత్రం మా బ్యానర్‌కు సూపర్ హిట్ అందించే చిత్రం అవుతుంది. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ రిషి.



కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత.. మాధవరం కృష్ణారావు





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి అంటే కృష్ణారావు ..కృష్ణారావు అంటేనే కూకట్ పల్లి అనేంతలా ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు. 19 ఫిబ్రవరి 1967వ సంవత్సరంలో నారాయణరావు, సక్కుబాయి దంపతులకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కూకట్ పల్లిలో జన్మించాడు. రాజకీయంగా తన కుటుంబం నుంచి తనకంటూ గాడ్ ఫాదర్ ఎవరూ లేకపోయినప్పటికీ ప్రజా సేవ చేయాలనే తన బలమైన ఆకాంక్షనే మాధవరం కృష్ణారావును ప్రజా నాయకుడిగా నిలబెట్టింది. ఆల్విన్ కంపెనీలో ఉద్యోగిగా తన జీవితం ప్రారంభించినప్పటికి ప్రజా సేవ చేయాలనే తన ఆకాంక్షతో జననేతగా కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజల మనసులను గెలుచుకున్నారు మాధవరం కృష్ణారావు. కూకట్ పల్లి గ్రామంలో అతి పురాతనమైన రామాలయాన్ని పునర్నిర్మించి రామదాసుగా నిలిచారు ఆయన.

రాజకీయ అరంగేట్రం

మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి మున్సిపాల్టీ వైస్ చైర్మెన్‌గా తెలుగుదేశం పార్టీ తరఫున పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మొదటి సారి 2014 సంవత్సరంలో రాష్ట్ర ఆవిర్భావం తరువాత టీడీపీ తరఫున కూకట్‌పల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీచేసి టీఆర్ఎస్ అభ్యర్థి గొట్టిముక్కల పద్మారావుపై గెలుపొందాడు. అటు తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై నియోజకవర్గ అభివృద్ధికి 2015 మే 30న టీడీపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరాడు. అనంతరం మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి అభివృద్ధిలో కృష్ణారావు మార్క్

2018 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. 2018 శాసనసభలో పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ (పీఈసీ) సభ్యుడిగా విధులు నిర్వర్తించారు. అనంతరం మాధవరం కృష్ణారావు 2023 శాసనసభ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి,తన సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ పై రాష్ట్రంలో రెండో భారీ మెజార్టీ 70,387 ఓట్లతో హ్యాట్రిక్ విజయం సాధించి కూకట్ పల్లి నియోజకవర్గంలో తన సత్తా చాటారు.

కూకట్ పల్లి నియోజకర్గంలో కృష్ణారావు మార్క్ అభివృద్ధి

కూకట్ పల్లి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పరితపిస్తూ, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటి అండ్ మున్సిపల్ శాఖ మాత్యులు కేటీఆర్‌ల సహాయ సహకారాలతో ,నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలు తొలగించాలనే కృత నిశ్చయంతో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు నిర్మించి కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరిగెత్తించారు కృష్ణారావు. అందులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో కైత్లాపూర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు రూ.83.06 కోట్లు వ్యయంతో 675.50 మీటర్ల పొడవులో, 46 మీటర్ల మేర రైల్వే స్పాన్, 16.61 మీటర్లలో నాలుగు లేన్ల బై డైరెక్షనల్‌లో 5.50 మీటర్లలో సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే పనులకు గాను రూ.18.06 కోట్లు, భూసేకరణకు రూ.25 కోట్లు, నిర్మాణానికి జీహెచ్ఎంసీ రూ.40 కోట్లు ఖర్చు పెట్టారు. పాదచారులు వంతెన దాటేందుకు వీలుగా ప్రత్యేక మెట్లు, సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.




కైత్లాపూర్ ఆర్‌వోబీతో బోయిన్‌పల్లి, బాలానగర్, ఎర్రగడ్డ, మూసాపేట, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలకు ట్రాఫిక్ రహితంగా సాఫీగా ప్రయాణం సాగుతుంది. దీంతో జేఎన్‌టీయూ మీదుగా హైటెక్ సిటీ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్ళాల్సిన అవసరం ఉండకపో వడంతో మలేషియా టౌన్‌షిప్ జంక్షన్, హైటెక్ సిటీ ఫ్లై ఓవర్, సైబర్ టవర్స్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గిపోయి వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తగ్గాయి, బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణంతో సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సిన వాహనదారులకు దూరం తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణాలు సాగిస్తున్నారు,

ప్రజా సంక్షేమంలోనూ అగ్రస్థానం కూకట్ పల్లి

నిరుపేదలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఎప్పటి కప్పుడు అందజేస్తూ, అనారోగ్యంతో ఉండే వారికి సీఎంఆర్‌ఎఫ్ లు అందజేస్తూ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటున్నారు మాధవరం కృష్ణారావు. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు,యూనిఫారం లు అందించి విద్యార్థులకు చేరువయ్యారు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.







Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎన్‌టీపీసీ అదనపు డివిడెండ్ రూ.2,424 కోట్లు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ దిగ్గజ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీ తమ వాటాదారులకు మరో బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను అదనంగా మరో రూ.2,424 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను అందించడాని కి నిర్ణయం తీసుకుంది. ఇంతక్రితం తొలి మధ్యంతర డివిడెండ్ కింద నవంబర్ 2024లోనూ రూ.2,424 కోట్లు చెల్లించింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.8,000 కోట్ల మొత్తం డివిడెండ్‌ను చెల్లించినట్లు కానుందని ఆ సంస్థ పేర్కొంది. 2023-24కు సంబంధించిన రూ.3,152 కోట్ల డివిడెండ్‌ను సెప్టెంబర్ 2024లో చెల్లించినట్లు గుర్తు చేసింది. కాగా.. వరుసగా 32వ ఏడాదిలోనూ తన వాటాదారులకు డివిడెండ్‌ను ప్రకటించినట్లయ్యిందని వెల్లడించింది.

జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఎండిగా అనురాగ్ మెహ్రోత్ర



న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా అనురాగ్ మెహ్రోత్రాను నియమించుకుంది. ఇంతక్రితం ఆయన ఫోర్డ్ ఇండియా ఎండీగా పని చేశారు. మూడు దశాబ్దాల ప్రొఫెషనల్ అనుభవం కలిగిన ఆయన, ఆటోమేటివ్ రంగం విక్రయాలు, మార్కెటింగ్, వ్యూహరచన, మరియు వ్యాపారాభివృద్ధిలో కీలకమైన లీడర్‌షిప్ పాత్రలను నిర్వహించారు. పరిశ్ర మలో ఎంతో అనుభవం కలిగిన అనురాగ్‌కు బ్రాండ్లను అభివృద్ధి పథంలో ముందుకు పరుగులు తీయించిన అనుభవం ఉందని ఆ కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది.


సోలార్, బ్యాటరీ ఉత్పత్తుల్లోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇన్‌ఫ్రా (ఆర్‌ఇన్‌ఫ్రా) కొత్తగా రెన్యువెబుల్ ఎనర్జీ పరికరాల తయారీలోకి ప్రవేశించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం తన రెన్యూవెబుల్ మానుఫ్యాక్చరింగ్ విభాగానికి సిఇఒగా ఇవాన్ సహోను, బ్యాటరీ మానుఫాక్చరింగ్‌కు చీఫ్‌గా మస్తాక్ హుస్సెన్‌ను నియమించింది. భారత్‌లో సోలార్ ఉత్పత్తుల తయారీ కోసం కేంద్రీకృత ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని సమాచారం. దీంతో క్లీన్ ఎనర్జీలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్‌ఇన్‌ఫ్రా లక్ష్యంగా పెట్టుకుందని తెలుస్తోంది.

జేబీసీ గ్లోబల్ బోనస్ షేర్‌కు ఆమోదం

న్యూఢిల్లీ : ఇన్‌ఫ్రా కంపెనీ కెబిసి గ్లోబల్ లిమిటెడ్ 1:1 నిష్పత్తిలో బోనస్ ఈక్విటీ షేరుకు ఆమోదం తెలిపినట్టు వెల్లడించింది. తమ వాటాదారులకు ప్రతి ఈక్విటీ షేరుకు గాను మరొక్క బోనస్ ఈక్విటీ షేరును అందించనున్నట్లు పేర్కొంది. సమీప భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలు, రుణ తగ్గింపులను వేగవంతం చేసే ప్రణాళికలతో వ్యాపార కార్యకలాపాలను పునరుద్ధరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. బోనస్ ఇష్యూ కోసం మొత్తం రూ.261.43 కోట్లు ఉపయోగించనున్నట్లు పేర్కొంది.

'ది మ్యూజ్ బై కీర్తిలాల్స్' కలెక్షన్స్ ఆవిష్కరణ



హైదరాబాద్ : నగరంలోని సోమాజిగూడ కీర్తిలాల్ షోరూమ్‌లో కొత్తగా 'ది మ్యూజ్ బై కీర్తిలాల్స్' కలెక్షన్స్‌ను ఆవిష్కరించినట్టు ఆ సంస్థ తెలిపింది. ఈ ఆభరణాలు ఫ్యాషన్ ప్రేమికులను ఆకర్షిస్తాయని పేర్కొంది. ఆధునిక మహిళకి నచ్చేలా, ఆధునిక డిజైన్లు, కీర్తిలాల్స్ సంప్రదాయ శిల్పకళా నైపుణ్యాన్ని సమ్మిళితం చేసి రూపొందించినవని కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తెలిపారు. సూక్ష్మమైన డిజైన్లు, వినూత్న నమూనాలు, బహుముఖ ప్రత్యేక దృష్టితో వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. సంప్రదాయ ఆధునిక దుస్తులకు సరిగ్గా సరిపోయే స్టేట్మెంట్ నెక్లెస్లు, సొగసైన చెవిపోగులు, వివిధ డిజైన్లలో ఉన్న ఉంగరాలు, కంకణాలు సహా విభిన్న తరహా ఆభరణాలు ప్రదర్శన, విక్రయానికి పెట్టామన్నారు.

హైదరాబాద్‌లో అధిక విలువ ఇండ్లకే డిమాండ్

నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

హైదరాబాద్ : నగరంలో అధిక విలువ కలిగిన నివాసాలకు డిమాండ్ కొనసాగుతోంది. ప్రముఖ రియల్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ ప్రకారం.. 2025 జనవరిలో హైదరాబాద్ నివాస మార్కెట్ స్థిరంగా ఉంది. అధిక విలువ కలిగిన ఇండ్లకు డిమాండ్ కొనసాగుతోంది. రూ.1 కోటి ఎగువ విలువ కలిగిన నివాసాల విక్రయాలు 12 శాతం పెరిగాయి. దీంతో ప్రీమియం నివాసాలకు పెరుగుతున్న డిమాండ్ స్పష్టమవుతోంది. రూ.50 లక్షల దిగువ కలిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు అధిక వాటాను కలిగి ఉన్నాయి. అత్యధికంగా 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నివాసాలు 69 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2,000 చ.అ నివాసాల వాటా 14 శాతంగా ఉంది. గడిచిన జనవరిలో సంఖ్యా పరంగా 5 శాతం వృద్ధితో మొత్తంగా 5,444 యూనిట్ల అమ్మకాలు జరిగాయి.

గూగుల్‌తో జాగల్ జట్టు

హైదరాబాద్ : జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ లిమిటెడ్ తాజాగా స్మార్ట్ ఎంప్లాయి పర్చేజ్ (ఇపిపిఎస్) ప్రోగ్రాం కోసం రెడింగ్టన్ (ఇండియా) లిమిటెడ్ ద్వారా గూగుల్‌తో జట్టుకట్టినట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా జాగల్ తన కార్పొరేట్ క్లయింట్లకు పలు పరిష్కారాలను అందించనున్నట్లు పేర్కొంది. సంస్థలకు ఖర్చులు, కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి వీలు కల్పిస్తూ ఉద్యోగుల అనుభవాన్ని సులభతరం చేసే, మెరుగుపరిచే పరిష్కారాలను నిరంతరం ఆవిష్కరించడానికి తాము కట్టుబడి ఉన్నామని జాగల్ ఎండి అనినాష్ గోడిండి పేర్కొన్నారు.

జియోథింగ్స్‌తో ప్యూర్ ఈవీ ఒప్పందం

హైదరాబాద్ : ద్విచక్ర వాహనాల తయారీ సంస్థల్లో ఒక్కటైన ప్యూర్ ఈవీ సంస్థ, జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన జియో థింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. దీంతో తమ జియో థింగ్స్ యొక్క స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లు, టెలీమ్యాటిక్స్‌ను తమ ఎలక్ట్రిక్ వాహనాల్లోకి అనుసంధానించనున్నట్లు పేర్కొంది. అధునాతన ఐఒటి సొల్యూషన్స్, నిరాటంకమైన కనెక్టివిటీ, సమగ్రమైన డిజిటల్ అనుసంధానతను ఉపయోగించుకుంటూ వినియోగాదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందించాలనేది తమ ఈ భాగస్వామ్య లక్ష్యమని ప్యూర్ ఈవీ ఎండీ నిశాంత్ దొంగారి పేర్కొన్నారు.

సినిమాలకు పిల్లల అనుమతివ్వాలి

- ఇంప్లీడ్ పిటిషన్ వేసిన మల్టీప్లెక్స్ అసోసియేషన్

నవతెలంగాణ -హైదరాబాద్



ఉదయం 11 గంటల లోపు, రాత్రి 11 గంటల తర్వాత 16 ఏళ్ల లోపు పిల్లలను అనుమతి ఇవ్వరాదన్న మధ్యతర ఉత్తర్వులను రద్దు చేయాలంటూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తున్నట్లు ప్రకటించిన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేస్తూఉత్తర్వులు జారీ చేశారు. గేమ్ చేంజర్ సినిమా అదనపు ప్రదర్శనలకు, టిక్కెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేసిన కేసులో సంబంధం లేని అంశంలోకి వెళ్లి పిల్లలను రాత్రివేళ షోలకు అనుమతి ఇవ్వరాదన్న ఉత్తర్వులు చెల్లవని పిటిషనర్ వాదన.

కేసు కొట్టేయాలంటూ నాగం పిటిషన్

అసెంబ్లీకి 2023లో జరిగిన ఎన్నికలప్పుడు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. 2023, నవంబర్ 26న అనుమతి లేకుండా దాదాపు 300 మందితో నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలో రాత్రి ర్యాలీ నిర్వహించారని ఆయనపై ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. కింది కోర్టులో ఉన్న ఆ కేసును కొట్టేయాలని నాగం హైకోర్టును ఆశ్రయించారు.

అసైన్డ్ భూముల అమ్మకాలపై విచారణ చేయండి

కొందరు లాభాపేక్షే లక్ష్యంగా చేసుకుని చట్ట వ్యతిరేకంగా అసైన్డ్ భూములను అమ్ముతున్నారనీ, ఫలితంగా అమాయకులు నష్టపోతున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొందరు మోసగాళ్లు, రెవెన్యూ ఆఫీసర్లు సబ్ రిజిస్ట్రార్లతో కుమ్మక్కు కావడంతో ఈ దారుణాలకు తెరలేస్తోందని అభిప్రాయపడింది. 1977 అసైన్డ్ యాక్ట్ ప్రకారం రూల్స్‌ను ఉల్లంఘిస్తే ప్రభుత్వం ఆ భూముల్ని తీసేసుకునే అధికారం ఉందని చెప్పింది. అమ్మకాలకు చెందిన దస్తావేజు డాక్యుమెంట్లు లేకపోయినప్పటికీ అమ్మకాలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అసైన్డ్ భూమి అమ్మకాలు జరగడంపై మూడు నెలల్లోగా జిల్లా కలెక్టర్ విచారణ పూర్తి చేసి బాధ్యులైన వాళ్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంది. మొయినాబాద్‌లోని సర్వే నెం 178/23లోని భూమిని తమ సమ్మతి లేకుండా అమ్మకాలు చేయడంపై నాగమ్మ, ఆమె ముగ్గురు కొడుకులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారించారు. భర్త మృతి తర్వాత అసైన్డ్ భూమిని కొందరు 2021లో విక్రయించారన్నారు. విక్రయించేముందు తల్లితోపాటు ఇతర వారసుల అంగీకారం తీసుకోలేదన్నారు. దీనిపై న్యాయమూర్తి, తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ 1317 ఫసలీ ప్రకారం అసైన్డ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలనీ, అందుకు విరుద్ధంగా చేస్తే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చునని చెప్పారు. అసైన్డ్ చట్టంలోని సెక్షన్ 7 (2ఎ) ప్రకారం ఏ అధికారి అయినా 5 (1) (2) కింద్ర నిబంధనలను ఉల్లంఘిస్తే ఆరు నెలల సాధారణ జైలు రూ.10 వేలు జరిమానా విధించేందుకు వీలుందన్నారు. ఈ కేసులో పిటిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాలనీ, వినతి పత్రం అందిన మూడు నెలల్లోగా కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిటిషన్‌పై విచారణను క్లోజ్ చేశారు.

నేడు శివాజీ జయంతి వేడుకలకు అనుమతి

చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి అనుమతించాలని హైదరాబాద్ సీపీని హైకోర్టు ఆదేశించింది. సుందర్ భవన్ నుంచి ట్రూప్ బజార్, జాంబాగ్ వరకు 150 మందితో శివాజీ జయంతి వేడుకలను నిర్వహించేందుకు అనుమతిచ్చింది. పలు షరతులు విధించింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మందికి మించకుండా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలంది. నేరచరిత్ర ఉన్నవారిని అనుమతించరాదనీ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేయరాదని నిర్వాహకులను ఆదేశించింది. వీటిని ఉల్లంఘించి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పోలీసులు నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చునని చెప్పింది. ఈనెల 17న సమర్పించిన వినతి పత్రంపై సిటీ పోలీస్ కమిషనర్ చర్యలు లేవంటూ వీర్ శివాజీ సేన, గోల్కొండ బీజేపీ యువజన మోర్చా అధ్యక్షుడు నితిన్ నంద్కర్ లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ బి విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసు బెయిల్ పిటిషన్లను పరిష్కరించండి : హైకోర్టు

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన 'ఫోన్ ట్యాపింగ్'కేసులో నిందితులు(4, 5) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని మెజిస్ట్రేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించింది. ట్రయల్ కోర్టులో మెరిట్ ఆధారంగా కేసులో వాదనలు వినిపించాలంది. గత ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ చక్రధర్‌గౌడ్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును ఏ-1గా, రాధాకిషన్‌రావును ఏ-2గా, సంతోశ్‌కుమార్‌ను ఏ-4గా, పర్శరాములును ఏ-5గా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించగా.. అరెస్టు చేయవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో తమను అరెస్టు చేశారనీ, బెయిల్ ఇవ్వాలని కోరుతూ సిద్ధిపేట్‌కు చెందిన ఏ-4, ఏ-5 హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో మంగళవారం పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని దిగువ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు.

నిందితులు వేగవంతమైన విచారణను కోరవచ్చు

అది ఆలస్యమైతే బెయిల్ పొందవచ్చు
ఛత్తీస్‌గఢ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ : చేసిన నేరం ఎంత తీవ్రమైనదైనప్పటికీ విచారణను వేగవంతం చేయాలని కోరే ప్రాథమిక హక్కు నిందితులకు ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. తీర్పు చెప్పకుండా అండర్ ట్రయల్ ఖైదీని ఆరేడు సంవత్సరాలు జైలులో ఉంచడం అతని ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమే అవుతుందని, అలాంటి సందర్భంలో బెయిల్ మంజూరు చేయవచ్చునని స్పష్టం చేసింది. ఉగ్రవాద నిరోధక ఉపా చట్టం కింద విచారణను ఎదుర్కొంటూ గత ఐదు సంవత్సరాలుగా కస్టడీలోనే ఉన్న నిందితుడిని బెయిల్‌పై విడుదల చేసింది. నిందితుడి విచారణలో సాక్షులను పెద్ద సంఖ్యలో ప్రశ్నించే ప్రాసిక్యూషన్ సంస్థల ధోరణిని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇది విచారణలో జాప్యానికి కారణమవుతోందని తెలిపింది. విచారణలో జాప్యం, బెయిల్ వంటి అంశాలను పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందని అంటూ దీర్ఘకాలం నిర్బంధంలో గడిపిన తర్వాత నిర్దోషిగా విడుదలైతే కనీసం ఆర్థికంగా పరిహారం కూడా పొందలేకపోతున్నారని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన బెంచ్ తెలిపింది.

నిందితులు సుదీర్ఘ కాలం పాటు విచారణను ఎదుర్కొంటే ఒత్తిడికి గురవుతారని చెప్పింది. 'చాలా కాలం నిర్బంధంలో ఉండి నిర్దోషిగా బయటపడే వారికి ఆర్థికంగా పరిహారం కూడా లభించడం లేదు. వారు ఉద్యోగాన్నో వసతినో కోల్పోవచ్చు' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.నక్సల్స్ కార్యకలాపాల్లో వినియోగించే వాకీటాకీలు, లెడ్ లెన్సులు వంటి వస్తువులను తీసుకొని వెళ తుండగా నిందితుడిని ఛత్తీస్‌గఢ్‌లో 2020 మార్చిలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వంద మంది సాక్షులను విచారించాలని భావించింది. కానీ ఐదు సంవత్సరాల్లో కేవలం 42 మందిని మాత్రమే విచారించింది.

అక్రమ పట్టా పాస్‌బుక్.. ఇనాం భూమి కబ్జా!

- బ్రాహ్మణపల్లి గ్రామస్తుల ఆరోపణ



నవతెలంగాణ- నర్సాపూర్

ఇనాం భూమిపై కన్నేసిన కొందరు పట్టా పాస్‌బుక్ సృష్టించి కబ్జా చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని కొత్తచెరువు సమీపంలో సర్వే నంబర్ 63లో 25 ఎకరాల మూడు గుంటల భూమి ఉంది. దాన్ని కొంత మంది కబ్జా చేశారని గ్రామస్తులు పలువురు ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దొంగ పాసుబుక్కులు సృష్టించి కబ్జా చేశాడని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ భూమిని పోలీసుల సహకారంతో చదును చేస్తున్నాడని తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని ఎలా కబ్జా చేస్తావని అడిగితే పోలీసుల చేత భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని చెప్పారు. హైదరాబాద్ చెందిన సదరు కబ్జాదారునికి తమ గ్రామానికి చెందిన కొందరు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కలగజేసుకొని తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు, యాదయ్య, నర్సింలు, రాములు, నాగరాజు, రమేష్, అంజయ్య, నాగరాజు, రాములు, కిష్టా గౌడ్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్గో విమానానికి తప్పిన ప్రమాదం

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర ల్యాండింగ్

నవతెలంగాణ-శంషాబాద్



బ్లూడార్ట్ కార్గో విమానామానికి ప్రమాదం తప్పింది. విమానంలో గేర్ బాక్స్ పనిచేయకపోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. కార్గో విమానం చెన్నయ్ నుంచి మరో ప్రదేశానికి వెళ్తోంది. ఈ సమయంలో విమానంలో గేర్ బాక్స్ పనిచేయకపోవడంతో అత్యవసరంగా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమాచారం అందించారు. విమానం దిగడానికి ఎయిర్‌పోర్టు అధికారులు అనుమతించారు. చాకచక్యంగా వ్యవహరించిన పైలట్ సురక్షితంగా కిందికి దింపారు. ల్యాండింగ్ అయిన సమయంలో విమానంలో 5మంది సిబ్బంది ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రూ.22 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

విమానాశ్రయంలో మంగళవారం పెద్దమొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి వెళ్తున్న ఓ ప్రయాణికుడి కదలికలపై సీఐఎస్ఎఫ్ అధికారులకు అనుమానం వచ్చింది. అప్రమత్తమైన అధికారులు అతనితోపాటు లగేజ్‌ని పరిశీలించారు. ఈ తనిఖీలో రూ.22 లక్షల విలువైన విదేశీ కరెన్సీ పట్టుబడింది. ప్రయాణికుడిని అమీర్ అహ్మద్‌గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

- డీఐఈవోలకు కృష్ణ ఆదిత్య ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల ఐదో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా అధికారుల (డీఐఈవో)ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయంలో జూమ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. అన్ని జిల్లాల డీఐఈవోలు, నోడల్ అధికారులు హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కఠినమైన నిఘాను ఉంచడానికి జిల్లాల వారీగా కస్టోడియన్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాలని కోరారు. బఫర్, రిజర్వుడు, సిబ్బంది సంసిద్ధతను సమీక్షించామని పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను చేర్చడం ద్వారా కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన సంబంధిత డీఐఈవోలతో కలిసి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించబడుతుందని తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లనూ ఆయన వివరించారు. సిబ్బంది డేటాను ఇంటర్ బోర్డుకు పంపాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్రాల వారీగా ఏర్పాట్లు, కేటాయించిన సిబ్బంది, మౌలిక వసతులను వెంటనే పంపాలని డీఐఈవోలను కోరారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ కాలేజీలకు చెల్లింపు లేకుండా అన్ని నామినల్ రోల్ దిద్దుబాట్లను చేయాలని సూచించారు.

విద్యార్థులకు సంబంధించిన అన్ని ఫిర్యాదులనూ తక్షణమే పరిష్కరించడానికి పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని జిల్లాల పరీక్షా కమిటీ సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలనీ, పరీక్షలను సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



సెమీ రెసిడెన్షియల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి : డీటీఎఫ్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ కోరింది. ఈ మేరకు విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి కలిసి పలు అంశాలపై నివేదికను సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్నట్టుగా మంచి రుచికరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. దాంతోపాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని కోరారు. పాఠశాలల్లోనే (హోం వర్క్) ఇంటి పని పూర్తి చేసిన తర్వాత విద్యార్థులను పంపించాలని పేర్కొన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక విద్యతో అనుసంధానం చేయాలని సూచించారు. ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని తెలిపారు. ప్రయివేటీకరణను పూర్తిగా నియంత్రించాలని పేర్కొన్నారు. విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

రైతుల గోడు పట్టదా.. ?

నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి
తక్షణమే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలి
గందరగోళం.. కాకిలెక్కలతో కాలం వెల్లదీస్తున్న సీఎం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వక రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల గోడు పట్టడం లేదా ? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనమైన దూరజ్‌పల్లి లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరలో ఆమె మంగళవారం చౌడమ్మ తల్లికి బోనం సమర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. పంటలు ఎండి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇంకా మాటలు చెబుతూ మభ్యపెడుతోందని విమర్శించారు. రాజకీయ కక్షతో మేడిగడ్డను వాడుకోక తెలంగాణను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్లలో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, కానీ మన ముఖ్యమంత్రి మాత్రం కనీసం నాగార్జున సాగర్‌ను కూడా మన ఆధీనంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు.

కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ గోదావరి జలాలను పారించారని, కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ గోదావరి నుంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా లక్షా 22 వేల ఎకరాలకు నీళ్లు అందించారని వివరించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. మరో 40 రోజులపాటు నీళ్లు ఇస్తేనే పంటలు చేతికొచ్చే అవకాశం ఉంటుందని, అయినా ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుండా ఎండగడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రియే కాకుండా సాగునీటి శాఖ మంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి నీళ్లు ఇవ్వని మంత్రి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనన్నారు. రోజంతా కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే కాంగ్రెస్ నాయకులకు ఒరిగేదేమీ లేదని, ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. 14 నెలల్లో 30 సార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని ఎవరు ఏమనుకున్నా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఒక్క కార్యక్రమాన్ని కూడా చేయని కాంగ్రెస్ ప్రభుత్వం. అలాగే, మహిళలకు ప్రభుత్వం ఏమి చేసిందో ప్రభుత్వ పెద్దలు చర్చకు రావాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు సన్నగిల్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎస్సీ, బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తోందని విమర్శించారు. గందరగోళం.. కాకిలెక్కలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. రైతులను కూడా మోసం చేస్తూ రేవంత్ రెడ్డి పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యదవ్, నోముల భగత్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్, బూర బాల సైదులు, రఫీ పాల్గొన్నారు.

స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్‌అలీ ఆప్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్‌ఆద్మీ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీకి విద్యావంతులైన మేధావులు ఓటు వేయాలని కోరారు. డబ్బు వెదజల్లి గెలవాలనుకునే వారికి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం పని చేసే విద్యావంతుడైన స్వతంత్ర అభ్యర్థి ముస్తాక్‌అలీని గెలిపించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో ఆప్ రాష్ట్ర నేతలు విజయ్ ముల్లంగి, నర్సింగ్. యమున గౌడ్, జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్యా నాయక్ మాట్లాడారు.

కాళేశ్వరం మహా కుంభాభిషేకం ప్రసాదాన్ని

కాంగ్రెస్ అధిష్టానానికి పంపిన మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం మహా కుంభాభిషేకం ప్రసాదం, కాళేశ్వరుడి ప్రతిమ, త్రివేణి సంగమం(గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు) జలాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, ఎల్ఓపీ రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ ప్రియాంక గాంధీలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపారు. కాళేశ్వరం మహా కుంభాభిషేకం గురించి ఏఐసీసీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 1982 తర్వాత ఇప్పుడే మహా కుంభాభిషేకం జరిగిందని పేర్కొన్నారు. అందులో శృంగేరి జగద్గురువులు భారత తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి పాల్గొనన్నారని తెలిపారు.

సిక్కింలో పర్యటించిన మాజీ ఎంపీ బోయినపల్లి

అకడి అభివృద్ధి గురించి ఆరా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సిక్కింలో పర్యటించిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్.. ఆ రాష్ట్ర క్యాబినెట్ సెక్రటరీ భూషణ్ పాఠక్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిక్కింలో జరుగుతున్న అభివద్ధి గురించి ఆయన ఆరా తీశారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంతో పాటు వ్యవసాయంలో పసుపు, అల్లం, యాలకులు, గోధుమలు, పండ్లతోటలే కారణమని భూషణ్ పాఠక్ వివరించారు. రాష్ట్రంలో, ముఖ్యంగా గ్యాంగ్‌టక్ నగరం చాలా శుభ్రంగా ఉందనీ, దీనికి పట్టణ ప్రజల పాత్ర గొప్పదని ఆయన కితాబిచ్చారు. అంతేకాకుండా పారిశుధ్య సిబ్బంది పనితీరు, అధికారుల బాధ్యత కూడా దానికి తోడయ్యాయని వివరించారు. రోడ్ల మీద చెత్త వేస్తే, ప్రజలు ఇబ్బందులు పడతారనీ, అదే విధంగా తమ ప్రభుత్వం రూ.5 వేల జరిమానా వేస్తుందని తెలిపారు.

భారత్, ఖతార్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

న్యూఢిల్లీ : భారత్, ఖతార్‌ల మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళేందుకు ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఖతార్ అమీర్ తమిమ్ బిన్ హమద్ అల్ థానితో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం భేటీ అయ్యారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులతో సహా పలు అంశాలపై ఇరువురు నేతలు కూలంకషంగా చర్చించారని విదేశాంగ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదుర్చుకునేందుకు గల అవకాశాలను ఇరు వర్గాలు అన్వేషించాయని తెలిపింది. ప్రస్తుతమున్న ద్వైపాక్షిక సంబంధాల స్థాయిని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళాలని ఇరు పక్షాలు భావించాయని మీడియాతో మాట్లాడుతూ కార్యదర్శి అరుణ్ కుమార్ చటర్జీ తెలిపారు.